

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ గురువారం 26-11-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:98 పేజీలు:8 వెల: రూ.1/-

# కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ కన్నుమూత



### ప్రధాని మోడీ,సోనియా తదితరుల సంతాపం
### ట్రబుల్ షూటర్‌గా పెరుగాంచిన అహ్మద్

న్యూఢిల్లీ,నవంబర్25(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ కరోనాకు చికిత్స పొందుతూ కన్నుమూశారు. గురుగావ్‌లోని మేదాంత ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. బుధవారం ఉదయం 3.30 గంటలకు అహ్మద్ పటేల్ మృతి చెందారని ఆయన కుమారుడు ఫైజల్ పటేల్ ట్విటర్ ద్వారా తెలియ జేశారు. అహ్మద్ పటేల్‌కు నెల రోజులు క్రితం కరోనా వైరస్ సోకింది. గత కొద్దిరోజులుగా ఆయన శరీరంలోని పలు అవయవాలు సవ్యంగా పనిచేయకపోవడంతో ఆరోగ్యం మరింతగా క్షీణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 15 నుంచి అహ్మద్ పటేల్ ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఒక ట్వీట్‌లో ప్రధాని మోదీ... అహ్మద్ పటేల్ సమాజానికి ఏళ్ల తరబడి సేవలు అందించారని కొనియాడారు. అలాగే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. తాను అతని కుమారుడు ఫైజల్‌కు ఫోనుచేసి, వారి కుటుంబాన్ని పరామర్శించానని, సానుభూతి ప్రకటించానని తెలిపారు. ఈశ్వరుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుకుంటున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నేత, సోనియాగాంధీ అత్యంత సన్నిహిత రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ (71) కోవిడ్‌కు చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయనకు పార్టీలో ట్రబుల్ షూటర్‌గా పేరుంది. ఆయన మృతిపై కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన స్థానాన్ని ఎవ్వరూ పూడ్చలేరంటూ ట్వీట్ చేశారు. నమ్మకమైన స్నేహితుడిని, సహచరుడిని కోల్పోయామని అన్నారు. గాంధీ- నెహ్రూ కుటుంబాలకు అత్యంత విశ్వాసపాత్రుడిగా ఉన్న అహ్మద్ పటేల్...సోనియాగాంధీకి అనేక సంవత్సరాలు రాజకీయ కార్యదర్శిగా వ్యవహరించారు. అత్యంత శక్తి వంతమైన నాయకుల్లో ఒకరైన ఆయన...కాంగ్రెస్‌తో సుదీర్ఘ సంబంధాలున్నా.. ఎన్నడూ మంత్రి పదవులను అధిరోహించలేదు. ఆశించలేదు. ఎక్కువగా నిరాడంబరంగా వుండేందుకు ప్రాధాన్యత నిచ్చారు.

1997లో సోనియాగాంధీ కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత..అన్ని తానై...పార్టీ వ్యవహారాలను చూసుకున్నారు. రాజకీయాల్లో ఆమె వెంటే ఉంటూ..మార్గనిర్దేశం చేశారు. పార్టీ సంక్షోభాలు, వ్యూహాత్మక నిర్ణయాలు, పొత్తుల విషయంలో నిర్ణయాత్మక నిర్ణయాలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. గుజరాత్ నుండి ఎనిమిది సార్లు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారు. మూడుసార్లు లోక్‌సభ, అయిదు సార్లు రాజ్య సభ సభ్యుడిగా ఉన్నారు. అహ్మద్ సామాజిక కార్యకలాపాల్లో ముందుండేవారు. గుజరాత్‌లోని బరూచ్‌లో జన్మించిన ఆయన అదే స్థానం నుండి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. 1976లో రాజకీయ జీవితాన్ని ఆరంభించిన ఆయన..అదే ఏడాది స్థానిక ఎన్నికల్లో పోటీ చేశారు. యువనేత నుండి ఆ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. 28 ఏళ్ల వయస్సులోనే అప్పటి అధినేత్రి ఇందిరాగాంధీ దృష్టిలో పడటంతో..1977లో బరూచ్ స్థానం నుండి బరిలోకి దిగారు. అలాగే 1980, 84ల్లో వరుసగా అదే స్థానం నుండి పోటీ చేసి గెలుపొందారు. 1990లో ఓటమి చవిచూశారు. రాజీవ్ గాంధీ హయాంలో పార్లమెంటరీ కార్యదర్శిగా వ్యవహరించారు. 2018లో కాంగ్రెస్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. 2004-09లో కాంగ్రెస్ అధికారంలో వుండగా.. పార్టీలో కీలకమైన బాధ్యతలు చేపట్టారు. రాజకీయ సర్కిల్స్‌లో అహ్మద్ భాయ్ అని పిలిచే ఆయన..కాంగ్రెస్‌లోని కోర్ కమిటీ సమావేశాల్లోనూ, మంత్రి వర్గ కూర్పుకు సంబంధించిన సమావేశాల్లోనూ పాల్గొని, ప్రతి ఒక్కటి శ్రద్ధతో వినేవారు. కాంగ్రెస్ తీసుకునే ప్రతి కీలక నిర్ణయాల్లోనూ ఆయన పాత్ర ఎనలేనిది. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియా కొనసాగినంత కాలము ఆయన సలహాలను తీసుకుని పలు నిర్ణయాలు తీసుకున్నారు. గాంధీ రాజకీయ వారసత్వంపై ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... ఆ కుటుంబాన్ని వెనకేసుకొచ్చారు.

## కరోనా ఉధృతితో అప్రమత్తం అయిన పంజాబ్

### రాత్రిపూట కర్ఫ్యూ అమలు చేయాలని నిర్ణయం
### రాత్రి 10 నుంచి తెల్లవారు జాము 5గంటలవరకు అమలు
### డిసెంబర్ 1నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు: సిఎం

చండీఘడ్,నవంబర్25(ఆర్ఎన్ఎ): ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో కోవిడ్ కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదు అవుతున్న దృష్ట్యా.. పంజాబ్ సీఎం కెప్టెన్ అమరిందర్ సింగ్ అప్రమత్తత ప్రకటించారు. తాజాగా కొత్త ఆంక్షలను అమలు చేయాలని ఆదేశించారు. పంజాబ్ రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో నైట్ కర్ఫ్యూను అమలు చేయనున్నారు. సోషల్ డిస్టాన్స్ పాటించకున్నా.. మాస్క్ ధరించుకున్నా.. జరిమానాను రెట్టింపు చేశారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఈ నియమావళిని అమలు చేయనున్నారు. మాస్క్ లేకుండా ఫైన్‌ను 500 నుంచి వెయ్యికి రెట్టింపు చేశారు. డిసెంబర్ 15వ తేదీన ఆంక్షలపై సమీక్ష చేసిన తర్వాత మళ్లీ తాజా ఆదేశాలు ఇవ్వనున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, మ్యారేజ్ ప్యాలెస్‌లను రాత్రి 9.30 గంటల వరకు మాత్రమే తెరిచేందుకు అనుమతి ఇచ్చారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు కర్ఫ్యూ అమలులో ఉంటుంది. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని సీఎం అమరిందర్ హెచ్చరించారు. ఢిల్లీ నుంచి కోవిడ్ చికిత్స కోసం పంజాబ్ వస్తున్న రోగుల గురించి కూడా సీఎం తన సమావేశంలో ఆరా తీసినట్లు తెలుస్తోంది. ప్రైవేటు హాస్పిటళ్లలో ఉన్న మంచాల లభ్యత గురించి సమీక్షించారు. ప్రైవేటు హాస్పిటళ్లలో ఎక్కువ శాతం మంచాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సీఎస్ వినీ మహాజన్‌ను సీఎం ఆదేశించారు. స్పెషలిస్టు, సూపర్ స్పెషలిస్టు, నర్సులు, పారామెడిక్స్‌ను అత్యవసరంగా రిక్రూట్ చేయాలని ఆరోగ్య, వైద్య విద్య శాఖలను సీఎం అమరిందర్ ఆదేశించారు. 4వ, 5వ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులను రిజర్వ్‌గా ఉంచేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్‌టీపీసీఆర్ టెస్టింగ్ సామర్థ్యాన్ని ప్రతి రోజూ 25 వేలకు పెంచాలని సీఎం ఆదేశించారు. జిల్లా హాస్పిటళ్లలో 24 గంటలు టెస్టింగ్ అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కాంటాక్ట్ ట్రేసింగ్ చేపట్టి, ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించాలని అమరిందర్ తెలిపారు. హోం ఐసోలేషన్‌లో ఉన్నవారు మరణించకుండా ఉండే చర్యలు చేపట్టాలన్నారు. వ్యాక్సిన్ పంపిణీ విషయంలో ఫ్రంట్‌లైన్ వర్కర్ల డేటాను సిద్ధం చేయాలని అధికారుల్ని సీఎం అమరిందర్ ఆదేశించారు.

# నగరం నలుచెరుగులా అభివృద్ధి

### వికేంద్రీకరణతో ప్రజలకు సౌకర్యం
### జిల్లాల్లోనూ పారిశ్రామిక ప్రగతికి తోడ్పాటు
### ఇంకా వెన్నాడుతున్న నోట్ల రద్దు దుష్ఫలితాలు
### ఆత్మనిర్భర భారత్ ఎవరికి మేలు చేసిందో తెలియదు
### 'హుషార్ హైదరాబాద్' కార్యక్రమంలో మంత్రి కెటిఆర్

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): అభివృద్ధి వికేంద్రీకరణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఐటీ మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నలచెరుగులా అభివృద్ధి జరగాలన్న ప్రణాళికతలో ముందుకు వెళుతున్నామని చెప్పారు. అలాగే వివిధ పట్టణాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఉద్యోగం చేసుకుని పోయేలా రవాణావ్యవస్తను కూడా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు టూటైర్ సిటీల్లోనూ ఇండస్ట్రీలను నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఆయన బుధవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని మారియెట్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'హుషార్ హైదరాబాద్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. కోవిడ్ ప్రభావం అన్ని రంగలమీద పడిందని, నష్టపోయిన వారందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి సహాయనిధిని నగరంలో నష్టపోయిన చిన్న పరిశ్రమలకు కూడా అందిస్తామని ఐటీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఏరో స్పేస్ ఇండస్ట్రీ, లైఫ్ సైన్స్, ఫార్మా, ఐటీని హైదరాబాద్‌కి తీసుకొచ్చామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'ఆత్మ నిర్భర్ భారత్' పథకం కింద ఎంత మందిని ఆదుకుందో తెలియదని ఎద్దేవా చేశారు. డీమానిటైజేషన్ వల్ల చిరు వ్యాపారులు ఎన్నో కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. కరోనా కారణంగా ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడ్డారని, వాణిజ్యంతో పాటు అనేక రంగాలను దెబ్బతీసిందన్నారు. లాక్‌డౌన్ సమయంలో తెలంగాణలో ఆరునెలల కాలానికి కరెంటు చార్జీలు రద్దు చేశామన్నారు. కరోనా సమయంలో వ్యాపార వర్గాలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచాయన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి అనేక మంది విరాళాలు ఇచ్చారన్నారు.కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో కేంద్రం ప్రకటించిన రూ.20లక్షల కోట్ల ప్యాకేజీ ఎవరికి అందలేదన్నారు. లాక్‌డౌన్‌కు ముందు ఎనిమిది త్రైమాసికాల్లో ఆర్థిక వృద్ధి క్షీణిస్తూ వచ్చిందన్నారు. కేంద్రం తీసుకువచ్చిన పెద్దనోట్ల రద్దుతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇబ్బందిపడ్డాయన్నారు. పెద్ద నోట్ల రద్దు దుష్ఫలితాలు ఇంకా కొనసాగుతున్నాయని, ఆర్థిక వ్యవస్థ క్రమంగా కోలుకుంటోందన్నారు. మేం అధికారంలోకి రాక ముందు పారిశ్రామికవేత్తలు కరెంటు కోసం ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు చేశారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 24గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. నేను చదువుకునే రోజుల్లో హైదరాబాద్‌లో కర్ఫ్యూల కారణంగా సెలవులు వచ్చేవని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అరగంట కూడా కర్ఫ్యూ పెట్టలేదన్నారు. త్వరలో కొంపల్లిలో ఐటీ పార్క్‌ను ప్రారంభించనున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. ఐటీరంగాన్ని నలుదిక్కులా విస్తరిస్తున్నట్లు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధిరంగాలను వికేంద్రీకరిసున్నట్లు పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంట టౌన్ షిప్‌లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఐటీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ రంగాలకు అద్భుతమైన భవిష్యత్ హైదరాబాద్‌లో ఉందన్నారు. హైదరాబాద్ వ్యాక్సిన్ క్యాపిటల్ అని, ప్రపంచంలో వినియోగించే వ్యాక్సిన్లలో మూడో వంతు హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయాలు బాగుంటే పెట్టుబడులు భారీగా వస్తాయన్నారు. హైదరాబాద్‌లో మత ఘర్షణలు లేవని, ప్రాంతీయ విభేదాలు లేవన్నారు. ఆరేండ్లుగా హైదరాబాద్ ఎంతో ప్రశాంతంగా ఉందని తెలిపారు. ఏ నగరంలోనైనా శాంతిభద్రతలు బాగుంటేనే పెట్టుబడులు వస్తాయన్నారు. హైదరాబాద్‌లో ఐదు లక్షల సీసీ లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, షీటీమ్స్ ఏర్పాటు చేసి మహిళల భద్రతకు భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. గడిచిన ఆరేళ్లలో నగరంలో ఎలాంటి అశాంతి, అభద్రతా భావం లేదన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎప్పుడూ రాజీపడలేదన్నారు. హైదరాబాద్‌ని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తున్నామని, సిటీ శివారుల్లో కొత్తగా వస్తున్న టౌన్షిప్‌లకు రోడ్లు వేస్తున్నామని తెలిపారు. నగరంలో అందుతున్న వైద్యం, విద్య, ఉద్యోగావకాశాలను జిల్లాల్లోనూ కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాల్లోనూ ఇన్వెస్ట్ చెయ్యాలని వ్యాపారవేత్తలను కోరుతున్నామని, ఆగ్రో ప్రాస్సెసింగ్ ఇండస్ట్రీకి మంచి డిమాండ్ ఉందన్నారు. పాడి పరిశ్రమల్లో మనం దేశంలోనే రెండో స్థానంలో ఉందని, వరి, పప్పు ధాన్యాలు బాగా పండుతున్నాయన్నారు. వివిధ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలను నెలకొల్పేలా చూస్తామని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ దయానంద్ గుప్త, టూరిజం కార్పోరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్ గుప్తా, హ్యాండ్ క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సంపత్ కుమార్ గుప్తా, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.




హైదరాబాద్‌లో జరిగిన చర్చగోష్టిలో పాల్గొన్న టిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మంత్రి కెటిఆర్

# నగర ప్రజలు స్వేచ్ఛగా ఓటేయాలి

### గ్రేటర్ పరిధిలో పక్కాగా ఏర్పాట్లు
### వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సైబరాబాద్ సిపి

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): నగర ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని సైబరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికల నిర్వహనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సైబరాబాద్ పరిధిలో జీహెచ్ఎంసీ ఎన్నికల ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులకు బందోబస్తు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. పోలింగ్ రోజు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పకడ్బందీ బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సిబ్బందికి సూచించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 38 మున్సిపాలిటీలలో ని 674 పోలింగ్ లొకేషన్స్ లోని 2569 పోలింగ్ స్టేషన్లలో డిసెంబర్ 1న నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలు ఏర్పాట్లకు సంబంధించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సమీక్షించారు. రాజేంద్రనగర్, మైలార్దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి అధికారులకు బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు సలహాలు ఇచ్చారు.రాజేంద్రనగర్ పద్మశాలిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీగుడా వాంబే ట్ కాలనీ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల, లక్ష్మిగుడా మండల పరిషత్తు పాఠశాల, నౌ నంబర్ సెట్విన్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్, సిఖ్ చావని, రాంబాగ్ స్పోర్ట్స్ హై స్కూల్ వద్ద ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ల ను సందర్శించి సూచనలు చేశారు. జీడిమెట్ల, సనత్ నగర్ పోలీస్ స్టేషన్లను సందర్శించి అధికారులకు బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు సలహాలు ఇచ్చారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని గాంధీనగర్ లోని జిల్లా పరిషద్ హై స్కూల్, ఠాగూర్ హై స్కూల్, అల్లావుద్దీన్ కమ్యూనిటీ హాల్, సనత్ నగర్, జీహెచ్ఎంసీ మల్టీ పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్లను సందర్శించి సూచనలు చేసిన సీపీ. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించిన విధంగానే మున్సిపల్ ఎన్నికల నిర్వహణకూ ముందస్తు పటిష్ట భద్రతా చర్యల తీసుకుంటున్నామన్నారు. ప్రజలందరూ నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే గుర్తించిన 243 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో, సమస్యాత్మక ప్రాంతాలల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతీ లొకేషన్ లో ఇద్దరు పోలింగ్ లొకేషన్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. వీరు ఆయా ప్రాంతాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపించి నివేదించడంతో పాటు పోలింగ్ సరిగ్గా జరిగేలా సహకరిస్తారు. పది ప్రాంతాల్లో సీసీటీవీ మౌంటెడ్ వెహికిల్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిద్వారా ఎన్నికల వేళ జరిగే పరిణామాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ కు చేరవేస్తారన్నారు. నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్, కౌంటింగ్ మొత్తం ఎన్నికల ప్రక్రియలపై పటిష్ట నిఘా ఉంచనున్నామన్నారు. పోలింగ్ రోజు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఓటర్లు ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికల్లో పాల్గొనేందుకు ఇప్పటికే అన్ని సౌకర్యాలు సమకూర్చామ న్నారు. ఎన్నికల వేళ పోలీసులు విధుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. నిష్పక్షపాతంగా పనిచేయాల న్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ శంషాబాద్ ఎన్ ప్రకాష్ రెడ్డి, , ట్రాఫిక్ డీసీపీ ఎస్ఎమ్ విజయ్ కుమార్, , బాలానగర్ డీసీపీ పీవీ పద్మజా, సీఎఆర్ ఏడీసీపీ మాణిక్ రాజ్, రాజేంద్రనగర్ ఏసీపీ అశోక్ కుమార్, బాలానగర్ ఏసీపీ పురుషోత్తం, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ విశ్వప్రసాద్, రాజేంద్రనగర్ ఇన్ స్పెక్టర్ సురేష్, మైలర్ దేవ్ పల్లి ఇన్ స్పెక్టర్ నరసింహ, జీడిమెట్ల ఇన్ స్పెక్టర్ బాలరాజు, సనత్ నగర్ ఇన్ స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 80 ఏళ్లు పైబడ్డ వారికి పోస్టల్ బ్యాలెట్

### ఎన్నికల ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసి ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. కాగా కోవిడ్-10 విజృంభిస్తున్న నేపథ్యంలో ఈసారి బ్యాలెట్ ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా వృద్దులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడం కాస్త రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం. దీంతో 80 సంవత్సరాలు పై బడిన వారికి పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారధి ఆదేశించారు. దీంతో జీహెచ్ఎంసి కమిషనర్, ఎన్నికల అధికారి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 80సంవత్సరాలు పైబడిన వారికే కాకుండా దివ్యాంగులు, కోవిడ్-19పాజిటివ్ ఉన్నవారంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ మూడవ వంతు ప్రజలకు
కూడును గుడ్డను గేహమును కూర్పు క్రమములో
పాడి పరిశ్రమ కొరకై
ఓడక కృషి జేసినాడు "వి. కురియన్" జీ !!

( అక్టోబర్ 26 వీ. కురియన్ జననం..)



-రాధశ్రీ
సెల్: 9494481210

## నేటి సార్వత్రిక సమ్మెకు టీఆర్ఎస్ మద్దతు

### కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తుంటే చూస్తూ ఊరుకోం
### భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో వినోద్ కుమార్

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నదని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటామని ప్రకటించారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గురువారం జరిగే దేశవ్యాప్త సమ్మెకు టీఆర్ఎస్ మద్దతిస్తుందని చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు భవన నిర్మాణ కార్మికులు మద్దతివ్వడం హర్షించదగిన విషయమని చెప్పారు. ఎన్నికల్లో టీఆర్ఎస్ ఉద్యమ పార్టీగానే ప్రజల వద్దకు వెళ్లిందన్నారు. జిల్లాల వారీగా భవన నిర్మాణ కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో భవన నిర్మాణ రంగానికి ఢోకాలేదన్నారు. హైదరాబాద్ నగరం లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తుందని చెప్పారు. సుమారు నాలుగు, ఐదు రాష్ట్రాలకు చెందిన నిపుణులు ఇక్కడ ఉపాధి పొందుతున్నారని తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు టీఆర్ఎస్ అండగా నిలుస్తుందని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని సీఎం కేసీఆర్ ముందుకు వచ్చారని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకుంటామన్నారు. సీఎం హోదాలో బీఎస్ఎన్ వ్యవహారాన్ని గట్టిగా ప్రస్తావించింది కేసీఆర్ ఒక్కరేనని చెప్పారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త మద్దతు కూడగడతామని వెల్లడించారు. ఇందులో భాగంగా సీఎం కేసీఆర్ త్వరలో ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులతో సమావేశం కానున్నారని చెప్పారు.

## హైదరాబాద్ అభివృద్ధికి తోడ్పడండి

### ప్రచారంలో మంత్రి ఎర్రబెల్లి వినతి

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో టీఆర్ఎస్ పార్టీ వేగం పెంచింది. పార్టీ అభ్యర్థుల తరఫున మంత్రులు, ఎమ్మెల్యేలు కాలనీల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గడప గడపకూ వెళ్లి ఓటర్లను కలుస్తూ, గత ఆరేండ్లలో ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మీర్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్టీ తరఫున ఎన్నికల బరిలో నిలిచిన ప్రభుదాస్‌ను గెలిపించాలని, ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆలోచన, మంత్రి కేటీఆర్ సహకారంతో హైదరాబాద్ విశ్వనగరంగా మారుతున్నదని చెప్పారు. నగరంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ గతంలో ఎప్పుడూ లేనంత శాంతియుతంగా వుందని చెప్పారు. మనకు అభివృద్ధి కావాలంటే ఢిల్లీ నాయకులు అవసరం లేదని, గల్లీ నేతలను గెలిపించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేస్తే అభివృద్ధి, సంక్షేమం మన చేతుల్లోనే వుంటాయని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన కొత్త పథకాలు జీహెచ్ఎంసీ అభివృద్ధికి నాంది పలుకుతాయని చెప్పారు.

# ఆక్రమణలపై అక్బరుద్దీన్ ఘాటు వ్యాఖ్యలు

### ముందుగా పివి, ఎన్‌టీఆర్‌ల సమాధులు కూల్చాలని డిమాండ్
### అలాచేస్తే రెండు గంటల్లోనే దారుస్సలాం కూలుస్తామన్న బండి

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ఎంఐఎం, బీజేపీ నేతలు సై అంటే సై అంటూ మాటలు తూటాలు వదులు తున్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్లతో హోరెత్తిస్తున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ సర్జికల్ స్ట్రయిక్స్ వ్యాఖ్యలపై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన బుధవారమిక్కడ మాట్లాడుతూ..'అక్రమ కట్టడాలు, పేదల ఇళ్లు కూల్చేస్తామని చెప్తున్నారు కదా. 4,700 ఎకరాల హుస్సేన్‌సాగర్ ఈరోజు 700 ఎకరాలు కూడా లేదు. హుస్సేన్‌సాగర్‌పై ఉన్న పీవీ నర్సింహారావు, ఎన్టీఆర్ సమాధులను కూడా కూల్చాలి. అసెంబ్లీలో మీ తోక ఎలా తొక్కాలో మాకు తెలుసు. మైనారిటీలకు రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదే. మైనారిటీల అభివృద్ధికి వైఎస్సార్ కృషి చేశారు' అని ప్రశంసించారు. హైదరాబాద్‌లో పేదల ఇళ్లు కూల్చడం కాదు ఆ పని మొదలు చేయండని అన్నారు. చెరువులు కబ్జాకు గురవ్వడానికి ఎవరు కారణమని అన్నారు. ఒకప్పటి హైదరాబాద్ నామ్ నిషాన్ లేకుం డా పోయిందన్నారు. గండిపేట, ఉస్మాన్ సాగర్‌లకు నీరు రాకుండా చేస్తున్నదెవరని అన్నారు. ఇక్కడి నీరు రాకుండా చేసి కృష్ణా,గోదావరిలను తెస్తున్నామని అంటున్నారని అన్నారు.

### దమ్ముంటే వాటిని కూల్చండి: బండి సంజయ్

రోవైపు అక్బరుద్దీన్ వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. అక్బరుద్దీన్‌కు దమ్ముంటే పీవీ, ఎన్టీఆర్ సమాధులను కూల్చాలంటూ సవాల్ విసిరారు. 'హిందువుల ఆరాధ్య దైవం అయిన పీవీ, ప్రజా నాయకుడు ఎన్టీఆర్ సమాధులు కూల్చేస్తారా? దమ్ముంటే కూల్చండి. మీరు కూల్చిన రెండు గంటల్లోనే దారుసలాంని బీజేపీ కార్యకర్తలు కూల్చేస్తారు. దారుసలాంలో సౌండ్ చేస్తే ప్రగతి భవన్‌లో ఎందుకు రీసౌండ్ వస్తుంది. టీఆర్ఎస్ స్క్రిప్ట్‌ని దారుసలాంలో చదువుతున్నారు. భారత్, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌లో టీమిండియా గెలిస్తే నల్ల జెండాలు పట్టుకున్న వారిపై సర్జికల్ స్ట్రయిక్స్ ఎందుకు చేయకూడదు?' అని బండి సంజయ్ ప్రశ్నించారు.

## అహ్మద్ పటేల్ మృతికి సిఎం కెసిఆర్ సంతాపం

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ):కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు అహ్మద్‌పటేల్ మరణం పట్ల ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అహ్మద్ పటేల్‌తో తనకున్న అనుబంధాన్నిఆయన గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఇంటింటికీ తిరుగుతూ టిఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): అమీర్‌పేట్ సిట్టింగ్ కార్పొరేటర్ టీఆర్ఎస్ అభ్యర్థి శేషుకుమారి ప్రచారంలో దూకుడు పెంచారు. ప్రజలతో మమేకమౌతూ స్పెడ్ పెంచారు. అమీర్‌పేట్‌లో తాను చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అమీర్‌పేట్ డివిజన్‌లో పండుగ వాతావరణం నెలకొందని, ఇక్కడ అంతా టీఆర్ఎస్సే ఉందని అన్నారు. అభివృద్ధి చేశాం కాబట్టే గెలుస్తామని నమ్మకం ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు.. ప్రజలకు చేరువలో ఉన్నాయన్నారు. వరద సహాయంలో తమ డివిజన్‌లో అందనివాళ్లు చాలా తక్కువమంది ఉన్నారని, ఎన్నికలు అయిపోయిన తర్వాత మళ్లీ వరద సహాయం అందజేస్తామని ఆమె స్పష్టం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ లాంటి పార్టీలు తమకు పోటీయే కాదని శేషుకుమారి అన్నారు.

## దూసుకొస్తున్న నివార్ తుఫాన్

### తమిళనాట విస్తారంగా వర్షాలు

చెన్నై,నవంబర్25(ఆర్ఎన్ఎ): నివార్ తుఫాన్ గండం ముంచుకొస్తోంది. అతి తీవ్ర తుఫాన్‌గా మారి తీరం వైపు అత్యంత వేగంగా దూసుకొస్తోంది. దీంతో తమిళనాట పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైలో ఉండపోత వర్షాలు కురుస్తున్నారు. కడలూరుకు 300 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 310 కిలోమీటర్లు, చెన్నైకి 350 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. రాత్రి కరైకల్-మహాబలిపురం మధ్య తీరం దాటనుంది. తీరం దాటే సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇప్పటికే నివార్ తుఫాన్ ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలపై విరుచుకుపడుతోంది. కుండపోత వర్షాలతో బీభత్సం సృష్టిస్తోంది. తుఫాన్ హెచ్చరికలతో ఇప్పటికే తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఔఆఖీఈ బృందాలనూ రంగంలోకి దింపి ప్రాణ నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలపై నివార్ తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతో ఆయా రాష్ట్రాలకు వాతావరణ శాఖ ఇప్పటికే ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది . ఏపీలోని నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇవాళ(నవంబర్ 25,2020) కోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.


2001 ఉగాది ప్రత్యేక సంచికలో..

రుసరుసలాడుతు వచ్చిన
'వృష' ఉగాది, కాచుకో,
శశభిష లసలుండవు గద
అందినంత దోచుకో!

'తెహెల్‌కా'ది తప్పుని గురి-
రాలిపడిన పిట్టలు
లెక్క పెట్టకండపుడే
పెరుగుతాయి గుట్టలు!

ప్రతి ఉగాదికి శుభాలు
పలికే పంచాంగం
ప్రతిసారి ఇంతేగద-
యమ ఆశాభంగం!

రాజకీయ విలువల వెల
తెలిసి పోయినప్పుడు
ప్రజలేమిటి మౌనుల వలె
చేయరసలు చప్పుడు!

ఇంతకూడ లేదు సిగ్గు
మన పాలక దొరలకి
తేడా ఏముంది, తమకు
ధనముద్రణ మరలకి?!

దేశం ఏమైపోయిన
ఫరవాలేదా గురూ
అధికారమె ఆయువంటె
నవ్విపోర నలుగురూ?

కీలక రక్షణ శాఖనె
కీళ్ళువిరిచి ఇలాగ
కూలగొట్టుతున్నోళ్ళని
తరమకుండ యెలాగ?

మనవాళ్ళే దోచుకుంటె
మన లక్షలు, కోట్లు
వేరెందుకు శత్రువొచ్చి
పొడవడాలు తూట్లు!

ఒక్కమాట, వాజపేయి,
వారి మిత్ర సమూహం,
ఎవరికొరకు ఈ పాలన
ఏమిటి ఈ ద్రోహం??


2001 గణతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలో.

గణతంత్రం ముదిరి నేడు
అయిందింట రణతంత్రం,
దానికంటే ప్రమాదమోయ్
ఊబివంటి రుణ తంత్రం!

రాజ్యాంగం రాసినోళ్ళు
ఏమనుకున్నారో కాని
చివరికి జరిగింది పౌర
జనకోటికి ఘోరహాని!

ప్రజాస్వామ్య మనేదాన్ని
వేశారెపుడో పాతర,
కంటి తుడుపుకే గురువా
జెండా వందన జాతర!

అదేమంటె కెలుకుతారు
మతంరాజకీయ కంప,
రక్తసిక్త రంగేళితో
అలుకుతారు జనుల కొంప!

ఎండా వానకన నువ్వు
రెక్కలు ముక్కలు చేసిన,
మట్టి పరిమళాలె నీకు-
చెమట చెలమలే వాసన!

రాజకీయ విలువల్ని
వెలకమ్మిన బేరగాళ్లు
చాలనట్టు, దూరారోయ్
సందుచూసి నేరగాళ్ళు!

హరిజనులని, గిరిజనులని
బహుజనులని వున్న అరలు,
బహుళ విధాలుగ కులాల
పేర చీలి- యముడి చెరలు!

మైనార్టీ, మెజారిటీ
జనాభాల లెక్కలొద్దు,
ఇందరు ఎందుకు ఇంకా
వుంటున్నా రొక్క పొద్దు?

ఆకాశం అంతెత్తున
ప్రశ్నలేచి నిలబడాలి,
అసమానతతోనె తుదకి
ఎదురు తిరిగి కలబడాలి!


2001 స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలో..

ఎర్రకోటపైన
ఎగిరేటి జెండా
కూడు లేదే తల్లి
మా కడుపు నిండా!

ఇది రాసి ఎన్నేళ్ళు
గడిచిపోయిందో,
రాజకీయం ఎంత
నడిచిపోయిందో!

లక్షలుగ వాగ్దాన
రచన లొచ్చాయి
రోజుకొక సరికొత్త
కలని తెచ్చాయి!

పెద్ద ఆశలు కూడ
లేని పేదోడు,
దొరుకుతుందనుకుండు
ఇంత 'చే'దోడు!

ఎన్నికలు, ఏలికలు
ఎన్ని సార్లయినా
మారాయి, చెప్పొచ్చు
ఎన్ని పేర్లయినా!

పార్లమెంటులొ సదా
ప్రజల చర్చేనంట,
ఆ లక్షలూ, కోట్లు
జనుల ఖర్చేనంట!

కొత్త పార్టీలొచ్చి
కొత్త ముసుగులు వేసి
కొత్తగా దోచాయి
ప్రజల కళ్ళని మూసి!

దోపిడీ, అవినీతి
లోక లక్షణమంట
అది అర్థమైతేనే
మనకి రక్షణ మంట!

సకల సంపదలుండి
జీవ నదులుండి,
అన్నమెందుకులేదొ
అడుగుదాం రండి!

కాంగ్రెసు, జనతాలు
యునైటెడు ఫ్రంటు,
అయినాయి ఇపుడేమొ
ఎన్.డి.ఎ. స్టంటు!

బీ.జే.పీ. దొరలిపుడు
మరిగారు పీఠం,
మార్చివేశారంట
పసివాళ్ళ పాఠం!

తిరగరాస్తే చరిత,
ప్రజల బతుకుల్లో
ఏమి మారుద్దండి
గంజి మెతుకుల్లో!

ఎక్కడో జరిగింది
పెద్ద పొరపాటు,
స్వేచ్ఛలో దోపిడీ
నగ్న చౌరబాటు!

వేడుకని మొత్తుకుని
గత యాభయేళ్ళు,
ఏమి సాధించాము-
నొచ్చాయి నోళ్ళు!


2001 దసరా ప్రత్యేక సంచికలో..

దసరా పండగ సరదా
చిన్ననాటి ముచ్చట,
ఇప్పుడు మురిసేటందుకు
ఏమున్నది ఇచ్చట?

'విల్లనంబులూ' గులాము
చెక్కపోటీ బొమ్మలు
ఎక్కడంటె బిత్తరపోయి
చూస్తారోయ్ బొమ్మలు!

అయ్యగార్ల వెంట తిరిగి
ఇంటింటికి గుంపుగ,
పప్పుబెల్ల మారగించి
నోళ్ళమండి ఇంపుగ!

మాయమైంది ఆ సంస్కృతి
లేవు అట్టి ఇళ్ళు,
కాన్వెంటుల 'సర్' లేగతి
లేరోయ్ 'పంతుళ్ళు'!

పండగ జరిగేదిప్పుడు
టీ.వీ. తెరమీదనే,
పల్లెల సంస్కృతి గురించి
మన దరణ్యరోదనే!

మరిచారోయ్ మన పిల్లలు
దసరా పద్యాల ఊసు,
ఎక్కువైంది రకరకాల
నినాదాల కొత్త డోసు!

విజయ దశమితో మొదలై
భా.జ.పా.కి కొత్త ఊపు,
యూ.పీ.లో మరొకసారి
చూపుద్దట విశ్వరూపు!

ఎన్నికలొస్తే, హఠాత్తు
రామభక్తి గుర్తుకొచ్చి
అద్వానీ మహాశయుడు
పోతాడోయ్ శానరెచ్చి!

జమ్మిచెట్టు మీదినుంచి
ఆయుధాలు దింపకుండ,
పగలబోదు రాజకీయ
అవినీతుల 'అసుర' కొండ!

'రామ్‌లీల' మనపురాణ
యుద్ధగాథ సరేకాని
'గాంధారం' మీద ఇదేం
రణమండీ, పెద్దహాని!

అమెరికనులు ఏం చూస్తే
అదే మనం చూడాలట,
బ్రిటీషువారి వంతపాటే
మనమింకా పాడాలట!

ఉగ్రవాద కారణాల
మీద కదా అసలు పోరు
దాన్ని మరిచి ఇదేంటండి
లోకవ్యాప్త 'వ్యక్తి' హోరు?


2002 ఉగాది ప్రత్యేక సంచికలో..

చిత్రభాను ఉగాదిలో
చిత్రమేమీ జరుగబోదు,
యథావిధిగా ఈ దేశం
నిముషమైన నిదురపోదు!

దుర్మార్గం, దుర్నీతులు
దుర్మతులే సర్వత్రా,
వేలుపెట్టి చూపేందుకు
ఏమున్నది ఇతరత్రా!

అధికారం, ధనలాలస
తప్ప, ప్రజల మాట,
మరియాదకి కూడ రాదు
మన గురువుల నోట!

పోటీ చేస్తారు కాని
పలు గుర్తులతోటి,
వందనోటు బొమ్మకేది
ఎన్నికలలో సాటి?

గుజరాత్‌లో ఒక అభినవ
హిట్లర్ ఉదయించి,
నరమేధం జరిపాడోయ్
నెత్తురు పారించి!

దేశ విభజనం దినాల
ఆ మారణ దారుణం,
చూడలేదు కాని, నేటి
కసి కేమిటి కారణం?

మతమంటే తెలియని అతి
సాధారణ జనాన్ని
విష నిషాతొ రెచ్చగొడితే-
ఏమనాలి దీన్ని?

పసి పిల్లలు నిస్సహాయ
స్త్రీలు, ముసలి వాళ్ళు,
కపట దేశ భక్త పులికి
చిక్కిన చిరు లేళ్ళు!

ఎన్.డి.ఏ.లో అందరు
అంత గుడ్డివాళ్ళా,
కళ్ళ ఎదుటి ఊచకోత
కనిపించని రాళ్ళా?

మతఛాందస వ్యతిరేకత
డి.ఎమ్.కే. స్వభావం,
ఇప్పుడేమొ భా.జ.పా.దె
దాని మీద ప్రభావం!

సిగ్గూ లజ్జా విడిచిన
పెర్నాండెజ్ గతాన్ని
పూడ్చిపెట్టి, వదలడంట
పదవి అభిమతాన్ని!

ఇప్పుడిప్పుడె చంద్రబాబు
వైఖరిలో మార్పు,
పసిగట్టిన సూచన ఇది
రేపు ప్రజల తీర్పు!!


2002 గణతంత్ర్య దినోత్సవం ప్రత్యేక సంచికలో...

వీరగంధం చల్లినట్టుగ
వెల్లివిరిసే రిపబ్లిక్ డే,
వెల్లకిల పడిపోయినందుకు
బల్లిలా ఢీలా పడే?

రణ తంత్రపు ఉచ్చుల్లో
చిక్కుకుంది గణతంత్రం,
ప్రజని అంధకారంలో
ముంచే ఒక కుతంత్రం?

ఆకస్మాత్తుగ అతి సున్నిత
మవుతయ్ సరిహద్దులు
నిద్దుర పోతున్నారా
పాలించే మొద్దులు!

ఎన్నికలొస్తే చాలోయ్
మోగుతుంది యుద్ధ భేరి,
ఆయుధాల కొనుగోళ్ళలొ
దోచుకునే మహమ్మారి!

పట్టపగలు పట్టుబడిన
పిదప కూడా సిగ్గుమాలి,
పదవులు వదలరు, వీళ్లని
విడువరాదు, వలదు జాలి!

దారిద్ర్య రేఖలని
నిలబెట్టి నిలువుగా!
జాతీయ జెండాలు
ఎగరేయి సులువుగా!

ప్రశ్న వేయాలంటే
భయమంట స్కూలులో,
'బాల టెర్రరిస్టు'లని
తోస్తె జైలులో?

పిల్ల పాపలు వున్న
స్వర్ణ లంకాపురిని,
తగలబెట్టిన గురుని
నిలపవలె నే దరిని?

జెండాల పండుగలొ
జెండాలె మిగిలాయి,
పండగలు జనుల చిర
బాధలై రగిలాయి!

జాతి జన సంక్షేమ
ప్రశ్నలడిగే వాళ్ళు,
దేశభక్తులు కాదు,
'పోటో'కి తగి 'నోళ్ళు'!


2002 దసరా ప్రత్యేక సంచికలో..

కాశ్మీర్ ఫలితాలు చూసి
కమల ప్రభుల గుండెదడలు,
చతికిలబడి పోయారోయ్
అదేపనిగ చరిచి తొడలు!

గుజరాత్‌లో కూడ ఇదే
జరిగే డేంజరు వుందట,
మోడీ గుండెల్లో రైల్లు-
ఓటమి మునుముందుట!

చంద్రబాబు గారికేమొ
రోజుకి ఒక సవాలంట
పండగ రోజులు కూడా
ఎటుచూసిన శవాలంట!

రాష్ట్ర రాజధానిలోని
ప్రజలకి ప్రతిక్షణం హాని,
హోము మంత్రి కదలాలిక
హోమ జపతపాలు మాని!

'పనిబియ్యం' దొంగలెవరు
కనిపించరు, వినిపించరు,
గాంధారీ పరిపాలన
అని కూడా అనిపించరు!

అవునా,ఇది నిజమేనా,
ఏ.పీ. పరిపాలనలో
విశ్వబ్యాంకు ప్రతినిధులట-
ఇవి ఎలాంటి లాలనలో?

దసరా పండగకైనా
సరదాగా వుందమంటె
కుదరనీరు సరుకుదొరలు,
అందనీరు కొందమంటె!

ఒక్క పండగైన జర్ర
సక్కంగా జరగదేంది,
ఎవడి గొడవ వాడిదేగద
సొంతసొమ్ము, దమ్మురంది!

చదీచప్పుడవుతలేదు
తెలంగాణ రాష్ట్రపతులు,
చేతులుడిగి కూచున్నరు-
పనిచేయట్లేదు మతులు!

వేరు కుంపటంట అపుడె
టీ.ఆర్.ఎస్. చీలిపోయి,
ఏలేవారికి సువార్త-
మనశ్శాంతి, శాన హాయి!

కావేరి నీటి చిచ్చు
ఆరకుండ పాకుతోంది.
తమిళనాట ప్రతిమనిషిని
చురాచురా తాకుతోంది!

సంస్కరణల పేరుమీద
తెలుగునాట విద్యుత్‌చెర,
బహుపరాకు, చుట్టుకుంటె
వీడిపోదు, భద్రం దొర!


2003 ఉగాది ప్రత్యేక సంచికలో..

అమెరికా పెద్దపులికి
బ్రిటీషు మొసలి తోకలు,
మిగిలిన దేశాలన్నీ
మ్మెమ్మెమ్మే మేకలు!

ఎంత మంది ఎన్నితీర్ల
హితవు చెప్పినా అంతే
వినిపించాలట అంతట
ఒకే ఒక్క తన గొంతే!

'చందమామ' కథల్లోని
ఘోర బ్రహ్మరక్కసి,
అకారణం, అన్యాయం
కానే కాదిది కసి!

దురాక్రమణా, భూగ్రహణమొ,
అమెరికాది, మిత్రమా,
ఎవ్వడికీ దడవదు-అది
పిశాచాల సత్రమా?

భస్మీపటలాల మధ్య
ఏకవీర ఇరాకు,
ఇతర అగ్రరాజ్య గురుల
కెందుకింత పరాకు?

చమురు బావులన్ని తనకె
కావాలని సొంతం,
పట్టిందోయ్ బుష్ డాలరు
ఒక రాక్షస పంతం!

సెప్టెంబర్ పదకొండున
పట్టుకున్న దడుపు జ్వరం,
వదలలేదు అమెరికాకి-
వుంటుందది తరం తరం!

అయిదు వ్యాపారాలకి
ఆయుష పెంచే యుద్ధం,
అందుకొరకు అమెరికనులు
దేనికైన సంసిద్ధం!

పిల్లలు, తల్లులు, వృద్ధులు-
ఎన్ని బలులు ఇచ్చినా,
తీరదు బుష్ దొర దాహం
తను స్వయంగా చచ్చినా!

హిట్లరు సైతం భయపడి
పొర్లుతోంటె సమాధిలో,
మహావీర ఇరాకీల
పోరుచూడు వీధిలో!



నేటినిజం దినపత్రిక
వెలువరించిన ఎన్నో ప్రత్యేక
సంచికలకు దేవిప్రియగారు
ప్రత్యేకంగా 'రన్నింగ్ కామెంటరీ"
రాశారు. అందులోని కొన్ని
'రన్నింగ్ కామెంట్రీ'లు ఇవి...
-సంపాదకులు.

# దేవదా అని పిలిచే ఆప్త దేవుడు

అది 1976 దీపావళి రోజు. వారపత్రిక ప్రచురణకు నాంపల్లి రైల్వే స్టేషన్ ప్రక్కన గల ఓ ప్రింటింగ్ ప్రెస్‌కు వచ్చిన నన్ను దేవిప్రియగారు ఆప్యాయంగా పలకరించాడు. పత్రిక ప్రచురించబడేటట్టు సహకరించాడు. అప్పుడు దేవిప్రియగారు 'ప్రజాతంత్ర' వారపత్రికకు సంపాదకులుగా వున్నాడు. రాత్రి 8 గం॥లకు ప్రింటింగ్ పనులు ముగిసిన తర్వాత చిక్కడపల్లిలో మొదటి అంతస్తు లోగల ఇంటికి తీసుకువెళ్ళి తన జీవిత భాగస్వామి రాజ్యలక్ష్మి గారికి పరిచయం చేశాడు. రాజ్యలక్ష్మిగారు నిండు గర్భిణితో వున్నారు. ముగ్గురికి భోజనం వడ్డించమని చెప్పాడు. కర్రీ సరిపోదేమో అనడంతో ఆమ్లెట్లతో సరిపెట్టుకుందామన్నారు. నేను షాపుకు వెళ్ళి 3 కోడిగుడ్లు తేవడం, వున్న దాంట్లోనే ముగ్గురం కలిసి భోంచేయడం ఓ గొప్ప ఆనందం. ఆ రోజు నుండి దేవిప్రియగారు నన్ను 'దేవదా' అని పిలవడం, నేను సంబరపడిపోవడం..

దేవిప్రియగారు "హైదరాబాద్ మిర్రర్" పత్రికలో చేరకముందు, ఓ ఆర్నెళ్ళు మా మధ్య నేటినిజం దినపత్రిక గురించి తీవ్రంగా చర్చలు జరిగాయి.

ఎంత కాలమని 'నేటినిజం'ను చిన్న పత్రికగానే వుంచుతావు. దీన్ని గొప్పగా తీయవచ్చు తెలుసా? అన్ని వసతులు వున్నాయి కదా. పెట్టుబడి గురించి ఆలోచిస్తే సరిపోతుంది అనేవాడు. ఒకసారి డా॥నాళేశ్వరం శంకరం సమక్షంలో లక్డికపూల్ వద్దగల "ఫిష్ ల్యాండ్" హొటల్లో, మరోసారి సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ హొటల్లో మరో మిత్రుడి సమక్షంలో ఇలా ఎన్నోసార్లు నేటినిజం కార్యాలయంలో చర్చోపచర్చలు జరిగాయి.

"ఎంత కాలం పత్రిక నడిపామని కాదు, కొంత కాలమైనా పత్రికను గొప్పగా నడిపామన్నదే ముఖ్యం" అన్న దేవిప్రియ మాటలు నన్ను తొందర పెడుతున్నా... జరగకూడనిదేదైనా జరిగితే అందరం రోడ్డున పడతామన్న భయం వెంటాడుతోంది. ఓ దిక్కు భయపడొద్దు. ధైర్యంగా ముందుకు సాగాలని ఒత్తిడి.. మరోదిక్కు పరిస్థితులు అనుకూలంగా లేవని హెచ్చరిస్తున్న నా మనసు. ఏదేమైనా దేవిప్రియగారి ప్లాను చాలా గొప్పది. వనరులు వుండాలేగాని దూసుకుపోవచ్చు. నన్ను ఎప్పటికప్పుడు వెన్ను తట్టిన మంచి మిత్రుడు.

'దేవి 30' సావనీర్‌కు నా వంతు సహకారం అందిస్తే ఓ చిన్న పత్రిక సంపాదకుడిగా నీ స్పందనకు నేనెట్టా ఋణం తీర్చుకునేది అన్న మాటలు నాకు జ్ఞప్తికి వస్తూనే వుంటాయి.

అమ్మ కన్ను మూసింది. వెంటనే గుంటూరు వెళ్ళాలి వస్తావా అంటూ ఫోన్ చేశారు. డ్రైవర్‌తో మాట్లాడి కారు పంపాను. దేవదా నీకు కృతజ్ఞతలు ఎట్లా చెప్పాలి అన్న మాటలతో మా మధ్య మరింత ప్రేమ పెరిగింది. అప్పుడు నేను గుంటూరు వెళ్ళలేకపోయానన్న బాధ మాత్రం మిగిలింది.

నాల్గేళ్ళ క్రితం తను రాజ్యలక్ష్మిని కోల్పోవడంతో కొంత మానసిక క్షోభకు గురైనా, సాహిత్యమిత్రుల సహచర్యంతో కాస్త కుదుటపడ్డా ఆమె జ్ఞాపకాలు వెంటాడుతూనే వున్నాయని పదే పదే చెబుతూ మదన పడేవాడు. ఇంతలోనే శనివారం ప్రొద్దున్నే పిడుగులాంటి వార్త. దేవిప్రియ వెళ్ళిపోయాడని, ఎంతో దూరంలో వున్న నేను చివరి చూపు చూడలేకపోయానన్న బాధ. రెండు కన్నీటి బొట్లు తప్ప మరేం ఇవ్వగలను.

– బైస దేవదాసు

లోకమంత చూస్తున్నది
టెలివిజన్‌లో 'దీపావళి'
నలు చెరగుల నాల్క చాచి
నర్తిస్తే యుద్ధకాళి!

ఆ పార్టీ ఈ పార్టీ
అనేముంది ఇంక కాని,
నేతలు హోలీలు ఆడి
మైమరిస్తె యెంత హాని!

మానవ మారణ హోమం
సాగుతోంటె పొరుగింట్లో,
అసలేమీ కనరాదా?
బాంబు పడిందా కంట్లో?

అతి సుదీర్ఘ ప్రజాస్వామ్య
దేశమంట బ్లెయిరు భూమి,
ఎక్కడ తగలబడిందిపుడు
ఎవడూ మాట్లాడడేమి?

పిరికి నాయకుల జేబులో
ఇరుక్కుంది మానవ కథ,
ఉరికి బయట పడకపోతే
ఉపశమించబోదీ వ్యథ!

కరువు కాటకాల మధ్య
అరుదెంచితె నవ ఉగాది,
కీటక ప్రాయులు జనాలు
ఆకలి నడగాలి సోది!

ఊళ్ళకి ఊళ్ళే ఖాళీ
అయిపోతే ప్రతిరోజూ,
తెలుగునాట చేదుపాట
మనకి నిత్య రివాజు!

ఎవడి బతుకు ఎటుపోతే
మన కెందుకులే-పోనీ,
ఈ లోపే మరొకసారి
వోట్లోస్తాయట కద- రానీ!


2003 గణతంత్ర్య దినోత్సవం ప్రత్యేక సంచికలో...

పలు జాతుల దేశంలో
జాతీయత ఎవడిసొత్తు,
ఈ దేశపు నిజపతాక
కాదెన్నడు ఒకడి తొత్తు!

గుజరాత్‌లో జరిగిన కథ
పునరావృతమవుతుందని,
కలలకనే మాంత్రితులకి
వినిపిస్తది వేరే ధ్వని!

ఆయుధ బల సంపన్నత
ప్రదర్శనల తిరునాళలు,
ఎన్నాళ్ళని జరుపుదాము
మర్చిపోయి తిను వేళలు!

కూడులేని గుడ్డలేని
గూడులేని భరతజనులు
డొక్కలెండి, అనిపిస్తా
రండి, మహా తపోధనులు!

దైవ విగ్రహాల పేర
వీధిపోరు జరుపుతారు,
వోట్లుపడే కొత్తదారి
దొరికిందని భ్రమసి వారు!

ప్రపంచాన ప్రతి జాతికి
సొంత పురాణాలుంటాయ్,
రకరకాల దైవకతలు,
మేమంటే మేమంటాయ్!

కాకులు గద్దలు, పశువులు
పూజనీయ దేవతలై,
శాసించే సమాజాల
ప్రజల బతుకు శతవెతలై..

నిరుపేదల దేవుళ్ళకి
నిలువనీడ వుండనీరు
చెట్లూపుట్టలే వాళ్ళకి
గుళ్ళు గోపురాలు సారు!

అసంఖ్యాక జాతులతో
తెగలూ, ఉపతెగలతోటి,
వెల్లివిరిసె దేశంలో
పెడుతున్నరు దైవపోటీ!

ఒక్కసారి కలియచూడు
నలుదిశలా భారతాన్ని,
ఎవరిది దేశపు పునాది
నిర్మించిందెవరు దీన్ని?
×××
అవునుకాని, అమెరికాకి
'వార్‌వైరస్' సోకిందా,
కాక మనం పోల్చలేని
పిచ్చివ్యాధి తాకిందా?

వియత్నాము గుణపాఠం
ఎలా మరిచిపోయినట్టు,
అల్‌ఖైదా, భయజ్వరం
విడిచిపెట్టలేదు పట్టు!

అనివార్యపు తన ఆర్థిక
సంక్షోభపు భీతి వల్ల,
ఆయిల్ రాజ్యాల గూర్చి
అమెరికలలు-గొప్పకల్ల!

సద్దామ్ తన ప్రజలకింత
రొట్టెముక్క చూపకుండ
చేయాలని బుష్‌లు, బ్లెయిర్లు
అల్లారట క్షిపణిదండ!

మాటవరసకైన మనం
అమెరికాని వారించాం
కల్లబొల్లి సానుభూతి
కాలువలుగ పారించాం!

అంతర్జాతీయంగా
పెనుపెట్రో పాలిటిక్సు,
దాచలేరు అమెరికోళ్ళు
తమ డర్టీ యుద్ధట్రిక్సు!

లోకశాంతి కోసమంట
ఇరాకీల ఊచకోత,
నాగరికత కలిగిన జన
వ్యవస్థలకి చాలరోత!

బుష్‌పాలన హుష్ కాకీ
అయేవరకు ఇదేపీడ
ఫ్రాన్సూ, జర్మని, చైనా
వదిలిస్తయె లేదో చీడ?.
×××
ఆంధ్రప్రదేశ్ రాజకీయ
సీనులోకి చిన్న బ్రదరు,
వరసకుదిరితే, ఏమో
మారవచ్చు తె.దే. వెదరు!

అన్నలాగ అతి చతురత
లేదుగాని రామ్మూర్తికి
ఇతరత్రా ఏమైనా,
గొడవె 'బాబు' ఘనకీర్తికి.


2003 దసరా ప్రత్యేక సంచికలో..

నెత్తురుతో ఎపుడూ ఎరుపే
కలకత్తా కాళిక నాలిక.
దేశవ్యాప్త హింసలు వేసే
ఈ రక్తపు చిందులు చాలిక!

తెలుగునాట పులివేషంతో
దసరా తరతరాల వేడుక,
రాజకీయ యధార్థ పులులే
గాండ్రించడమిప్పటి వాడుక!

ముఖ్యమంత్రి ముఖం తాకుతూ
మృత్యు మందుపాతర పేలుడు,
తెగింపుంటె ప్రధానినైనానా
చంపేందుకు చాలొక బాలుడు!

దశాబ్దాల హింసల ఫలితం-
మొండిపట్లు, అనాలోచనం,
ఉభయుల తెలివైన తలలతో
మొలవాలిక నవ వివేచనం!

చర్చలతో సాధ్యంకాదని
ముందే ముడి వేసుకునుంటె
ఏ.పిలో ప్రశాంతి కుదరదు-
ఎల్లప్పుడూ ఆరనిమంటే!

ప్రజాస్వామ్య నేతి బీరలో
సారం పస తెలుసు జనాలకి,
ఎవరి నోట్లు ఎవరేస్తారో
అమ్ముడయ్యి నల్లధనాలకి!

అమెరికాలో, బ్రిటన్‌లో కూడా
కలుషితమై ప్రజాస్వామ్య జల
విలవిలమని విలపిస్తుంటే
మనకది ఇక ఒక పగటి కల!

అయినా ఒక ఆశ, ఆశయం
మన మానవ సహజ లక్షణం,
ఆ దీపం రక్షణకోసమె
అందరు కదలాలి తక్షణం!

సమీక్షలూ, పునరవలోకన
జరగాలిక మరింత లోతుగ,
సాధ్యాసాధ్యాల జ్ఞానమే
ఉద్యమాల అసలు కవాతుగ!

సాధారణ ప్రజల కెప్పుడూ
రాజకీయ మర్మం లేదని
అనుకుంటే అది పొరపాటే
నమ్మబోరు చక్కెర చేదని!

తె.దే.పట్ల ప్రజల దృష్టిలో
రాకున్నా పలు పెను మార్పులు
వోట్లు మటుకు పడడం ఖాయం
విపక్షాలకిక నిట్టూర్పులు!

రెప్పపాటులో తప్పిన కదు
రాజకీయ సంక్షోభం ఇది,
లేకుంటే ప్రవహించేదే
ఒక ఉన్మాదపు రక్తపు నది!

లోటున్నది భద్రతలోనో
రాజకీయ యోచనలోనో,
యోచించండిప్పటి కైనా
శాంతి ఎవరి విమోచనలోనో!

విశ్వవ్యాప్త పరిణామాలను
చేసుకోండి రవంత అర్థం
అవసమైనపుడు విరామం
ఇవ్వలేని పరుగులు వ్యర్థం!

సంయమనం అతి విలువైనది-
కొలమానం అది పరిణితికి,
తోచిందేదో చేసేయకు
క్షణికాలోచనలో మతికి!


2006 మేడే ప్రత్యేక సంచిలో...

మేడే ఆటలు పాటలు
సంబరాలు సంతలు,
కార్మిక పోరాట స్ఫూర్తి
కళ్ళకిపుడు గంతలు!

ఎక్కడ ఆ ఉద్యమాలు
ఏదా ప్రతిఘటన,
కార్మిక సంఘర్షణిపుడు
ఒక మార్మిక నటన!

మూతబడే ఫ్యాక్టరీల
మూలుగు వినరెవరు,
నామకహా శాఖ ఒకటి-
ఉండదేమి పవరు!

ఒక మీటింగ్, ఒక స్లోగను
ఇదే భాయి మేడే,
సెలవు దినం, ఇంటి వద్ద
పిల్లలతో ప్లేడే!
×××
అంటరాని తనమింకా
అంటుకునే వుంది మనని,
మనుధర్మం జనశత్రువు
అదే వివక్షతకి జనని!

కింది నుంచి మీది వరకు
పాకి పాతుకున్న చీడ,
మహానగర జీవనాన
కూడ వుంది దాని నీడ!

మాల మాదిగలు తదితర
దళితన్నల కేది విముక్తి,
హైందవ పులి బోనులోకి
నడపరాదు ప్రజాశక్తి!

వేల యేళ్ళ సామాజిక
బానిసత్వ భావ వలలు,
తెంపితేనె కాని తిరిగి
లేవవోయి దళిత తలలు!
×××
అన్నదాత ఆంధ్రదేశం
మెల్లమెల్లగ పెను ఎడారి,
జీవనదులున్నాయి. అయినా
పిడచనాలుకలే తడారి!

ముందుచూపే లేని నేతల
దఫదఫాలుగ ఏలిక,
ప్రజలు ఎక్కడొ, ప్రభువులెక్కడొ,
తుగ్లకులతో పోలిక!

నీళ్ళు లేనిదె ఊళ్ళు లేవని
తెలిసినట్టుగ ఇప్పుడు,
రాజశేఖర రెడ్డి హల్‌చల్-
నీరు పారే చప్పుడు-

గొప్ప యోచన గొప్పయోజన-
ఇంతవరకూ శభాసు,
ముంపు బాధలు తీర్చకుంటే
కీర్తి కాగల దభాషు!
×××
మహాజన్ ప్రాణాలు కోరిన
తోడబుట్టిన గన్నుకి,
తెలియదేమో, గాయమైనది
వాజ్‌పేయీ వెన్నుకి!

ఇంటిపోరుని దేశ పోరుగ
మార్చివేస్తే మీడియా
సకల ఛానెల్స్ ఒకే పాటై
ఇలా చంపుడు పాడియా?

నిశ్చయంగా కమల పక్షపు
పవరు ఆశాకిరణమే,
ప్రమోదించరు ఎవరు కూడా
మరణమంటే మరణమే!

ఎవరికెప్పుడు, ఎవరి రూపున
దాపురిస్తదొ ఆ క్షణం
నిరంతరమోయ్, మనిషి మీదే
సదా మృత్యువు వీక్షణం!


2004 శివరాత్రి ప్రత్యేక సంచిలో..

అయ్యా, ఓ మహాశివా
ఏమిటీ ఈ రహస్యం,
నక్సలైట్లు, ఖద్దరోళ్ళు
ఒకటేనట-హాస్యం!

నక్సలైట్లె అసలుసిసలు
దేశభక్తులన్నది
'అన్న'గారె, నిజమేనా
అపుడు మనం విన్నది?

ఇప్పుడేంటి మరి ఇలాగ
ఫిరాయించి 'వాయిసు'
అదే పార్టీ చేస్తున్నది
మరో రకం 'నాయిసు'?

స్వర్ణాంధ్రం ఏమొకాని,
ఎండిన పొలాలు, డొక్కలు,
టీ.వీల్లో ముఖాముఖీ
సుఖా సుఖీగా లెక్కలు!

అంతా బాగున్నదంట
భా.జ.పా.కి దేశంలో
ఔనంతే చూస్తుంటే
ఎపుడూ ఆకాశంలో!

కలవాళ్ళకి ఎల్లపుడూ
కనిపించే రంగుల కల,
నిరుపేదల మీదికేల
విసురుతారు ఇపుడీవల?

ఆరొందల కోట్లతోటి
ఇదేం దుష్ప్రచారం
ప్రజలసొమ్ము మట్టిపాలు
బురీబాత్-విచారం!

మంచివాడు అనుకుంటే
వాజపేయి కూడ,
గట్టుమీద మేస్తుందా
ఆవునొదిలి దూడ?

టీఆర్ఎస్‌తో కాంగ్రెస్
కలిసి వద్దు దంచేనా,
వోటర్లకి వండుకునే
బియ్య మసలు పంచేనా?

వోట్లేస్తాం గెలిపిస్తాం
మళ్ళీ ఆ ముఖాల్నే
ఇంకో అయిదేళ్ళు బాగ
చూపిస్తారనే స్వర్గసుఖాల్ని!

ఎటు పోతున్నామో తెలియని
అయోమయం ఈ స్టేటు
ఏం మాట్లాడాలో ఎరగని
కన్‌ఫ్యూషన్ ఈ 'సేటు'!

అణగారిన వర్గాలతో
ముస్లిములూ, బీసీలూ,
ఏకమైతె నిజంగానె
అన్యులు వనవాసీలూ?


2004 స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలో...

తల్లీ ఓ మువ్వన్నెల
జెండా, ఇదె సలాము,
ఇంకెప్పుడు మన బాధల
గాయాలకి మలాము?

ఏటేటా ఎర్రకోట
మీద ఎగిరి రెపరెప
కనిపించని కన్నీళ్ళని
రాల్చుతావు టపటప!

పొలం కాదు, గొంతైనా
తడవని మన పల్లెలు,
పుట్టినట్టు అవిటన్నకి
తోడు గుడ్డి చెల్లెలు!

పరిశ్రమలు, పెనుద్యాములు
అనేకంగ వున్నా,
పేదప్రజల ఖాతాలో
చెరిగిపోదు సున్నా!

రాజకీయ చదరంగపు
నిర్జీవపు పావులు,
అదే ప్రజులు, అవే వెతలు,
అవె ఆకలిచావులు!

పని చేసే హక్కు వుంది
పని ఎక్కడ నేతలూ
పార్టీ యేదైనా ఒకటె
మీ చేతలు, రాతలూ!

కమ్యూనిస్టు పార్టీలే
పోరుబాట విడిచి
దిండుకింద పెడితే యెలా
జండాలను మడిచి

మతఛాందస అహంకార
మహమ్మారి రాజ్యం
పోలేదోయ్, పొంచి ఉంది
పోసేందుకు ఆజ్యం!

ఒక్క క్షణం దినపత్రిక
చూస్తేనే హడలు,
జననాశక పిశాచాలు
కొడుతున్నయ్ తొడలు!

ఎస్.డీ.ఏ. కంటె నయం
యూ.పీ.ఏ. కొంత,
చూద్దాం ఏమమ్ముతుందొ
కాంగిరేసు సంత!

నేర రాజ కీచకులకి
ప్రభుత్వంలో చోటు,
ఉండరాదు అంటున్నది
కాషాయపు కోటు!

నిజమె కాని, వేసెముందు
పరుల మీద నిందల,
తలలు వంచి చూసుకుంటె
మంచిది గురివిందలు!

బలపక్షం, ప్రతిపక్షం
ఇరువైపుల రంకెలు,
తలకిందులు చేయగలవు
ఒకటి రెండు అంకెలు!

స్వర్ణాంధ్రం కంటె కొంత
తెలివిడి గల మాట,
నవ్యాంధ్రం నయమే మరి
తప్పకుంటె 'బాట'!

ప్రజల మధ్య తిరిగి, ప్రజల
మెప్పు పొంది గెలిచి,
రాజశేఖరన్న రాణ
కెక్కుతాడ నిలిచి!

ఎడాపెడా హామీలతొ
రైతుజనుల కోసం
తపించడం సెహబాసే
జరగరాదు మోసం!

రాజకీయ గురువృద్ధుడు
రోశయ్యకి, ఖజానా,
అప్పగించి చేయలేరు
కద గానాబజానా


2004 దీపావళి ప్రత్యేక సంచికలో..

ప్రభుత్వాలు మారిపోయి
కొత్త నేతలొచ్చినా,
పాతకథే పదేపదే-
అది మారదు చచ్చినా!

నరకాసుర వధ యెప్పుడు
జరిగిందో కాని, చూడు
రాకాసులు సైతానుల
నిత్యపీడ, నెత్రు కూడు!

ముక్కు పచ్చలైన సరిగ
ఆరని నవ పరిపాలన
ఎగిరి దూకడం లేదని
చేయతగదు అవహేళన!

పల్లెబాట, నగరబాట
బాగానే వుంది, 'మేలు'
అందక 'కాంగీ' కరెంటు
ఎండుతున్నయంట చేలు!

ఆచరణలో అధికారులె
అసలు సూత్ర ధారులండి,
పని వసూలు చేయాలోయ్
వారి నుండి ముక్కుపిండి!

గంగ వెర్రిలెత్తినట్టు
తే.దే.వారి కాకిగోల
తొమ్మిదేళ్ళు పథకాలకి
పాడిందెవరండి జోల?

మావోయిస్టుల సందడి
తొలిచర్చలతో సరా,
ఏమాటా చెప్పవేంటి
ఓ సార్, జానా దొరా!?

సాయుధ పార్టీ యెలాగ
ఆయుధాలు వదలడం,
సాధ్యమేన ఇలాగైతె
ఇక ముందుకు కదలడం!

చివరికి సారాంశంలో
ఏ మవుతదొ కాని,
సంఘర్షించే శక్తులకిది
నూతన కహానీ!

తిరుగుబాటు-అణచివేత
ఎదురెదురుగ సిటింగు,
'అమాయకుల' కర్దమవదు
ఏమిటొ-ఈ ఫిటింగు!

అమెరికనులు కూడ అచట
మత మాయకి లోబడి,
బుష్ వెంబడి ఉరికారట
లాడెన్‌కే భయపడి!

అవినీతుల కాంట్రాక్టులు
హఠాత్తుగా పుట్టినట్లు,
రభసెందుకు, తమ వీపున
కూడ వుంది 'మచ్చుబొట్టు'!

దొరలు దొరలు ఒక్కటయ్యి
బాగుపడితె చివరికి,
ప్రజలసొమ్ము యధావిధిగ
దోపిడి-ఫలమెవరికి?

ఎన్నికలకి ముందిచ్చిన
హామీల్లో కొన్ని,
నెరవేర్చే ప్రయత్నాలు
గతచరితలొ యెన్ని?

ఆశ్రితులూ, అనుచరులూ
లేని పవరు బాసులు
ఉంటారా యెక్కడైన-
ఇవి తప్పని లాసులు!

చేసేపని మేలైనా
వుండాలోయ్ ప్రచారం,
ఎగరగలద గాలిపటం
లేకుండా దారం!

ఇక ఇరాను ఇత్యాది
గల దేశాలల్లో,
గుబులు దిగులు బుష్ పేరే-
తెలుసు ఎందువల్లో!

తాని పెంచి పోషించిన
అభద్రతా భావన,
అయిందండి బుష్‌గారికి
శ్వేతసౌధ దీవెన!



## కూలిన 'అమ్మచెట్టు'

# 'రన్నింగ్' ఆగిన 'కామెంటరీ'

ఎవరేమనుకున్నా బ్రహ్మ ముహూర్తంలో తన మనసులో తోచిన పద్ధతేదో తప్పకుండా చేసి తీరతాడని పేరున్న ముఖ్యమంత్రిని సైతం గడగడలాడించిన కవి ఆయన. ముక్కుసూటిగా వ్యవహరిస్తాడని పేరున్న ఆ ముఖ్యమంత్రికి సైతం 'ఈ కవినెలా సంతృప్తి పరచాలి?' అన్న ఆలోచన తెచ్చిన కవిత్వం ఆయనది. 'రన్నింగ్ కామెంటరీ'తో ప్రభుత్వం గుండెలో రైళ్లు పరుగెత్తించిన ఆ ప్రజాగొంతుక దేవిప్రియ. పాలకపక్షాలకు కొరకరాని కొయ్యగా, రాజకీయపార్టీల గొంతుకు అడ్డం పడ్డ రాయిగా, సామాన్యుడి చేతిలో పాశుపతాస్త్రంగా మారిన ఆ ప్రతిభామూర్తి దేవిప్రియ. జర్నలిస్టుగా, కవిగా, రచయితగా విఖ్యాతులైన ఆ పైగంబరుడు దేవిప్రియ.

శ్రీకృష్ణుడు గీతోపదేశం చేసిన ద్వాపరయుగం నాటిది 'ద్వారకా నగరం'. 'నగరంలో ద్వారక' కవులకు గీతోపదేశం చేసిన కలియుగంలోనిది. ఈ 'కవి యుగం'లోని 'ద్వారక'లో ఇద్దరు కృష్ణులు శివారెడ్డి, దేవిప్రియ. వారి చుట్టూ ఉన్న కవి బృందంలో ప్రతి ఒక్కరూ వారి గీతోపదేశాన్ని శ్రద్ధగా విని, కవిత్వ బాణాలు వేసేందుకు సిద్ధంగా ఉన్న పాండవ మధ్యములు" 'అదిగో ద్వారక' అని ఒకరనగానే 'కవిమిత్రులిదిగో' అని మరికొందరు మిత్రులు కోరస్‌గా పలికే కాలమది. ఆ కాలంలో వీరిద్దరూ సూత్రధారులైతే ఆధునిక, ఆధునికానంతర తెలుగు కవులు పాత్రధారులు. 'ద్వారక'లో వేసిన ఎన్నో అడుగులను కవిత్వంవైపు నడిపించిన ఘనతలో సింహభాగం ఆ ఇరువురిదే. ఒకే ఆత్మ ఉన్న రెండు దేహాలు, ఒకే మనసు ఉన్న రెండు గుండెలు శివారెడ్డి, దేవిప్రియ. అందుకే శివారెడ్డిని గూర్చి దేవిప్రియ అభిప్రాయం ఇది.

"నువ్వు పైరగాలివి
నేను నాగులేటి వడగాలిని
నువ్వు పంటపొలానివి
నేను చేనుగట్టుని
నువ్వు మట్టిపెళ్ళవు
నేను ఇటుకరాయిని"

దేవిప్రియ వివిధ కవిత్వ ధోరణుల కాలంలో సమాంతరంగా ప్రయాణించి, స్వయంగా పైగంబర కవుల్లో ఒకరిగా కవిత్వాన్ని వెలువరించినా, ఏ భావజాలంలోనూ పూర్తిగా ఇమడలేదు. ఆయా ధోరణుల్లో కవిత్వం వెలువరించినా ఏదో ఒక చట్రంలో ఆయనను ఇమడ్చలేం. అయినా దేవిప్రియ కవిత్వమెప్పుడూ పేదవాడి పక్షమే. నూనూగు మీసాల వయస్సులో 'ఎర్రకోట పైన ఎగిరేటి జెండా/కూడు లేదే తల్లి మా కడుపు నిండా' అంటూ పేదల తరఫున వకాల్తా పుచ్చుకున్న దేవిప్రియ 'రంగుల కల'లో 'జం జమ్మల్ మర్రి - వెయ్యి కాళ్ల జెర్రి' అంటూ సంచలనం సృష్టించారు.

"నాకు రెండు నిధులున్నాయి
నాలుక మీద కవిత్వం
తల మీద దారిద్ర్యం"

అంటూ కవిత్వ సృజన చేసిన దేవిప్రియ అదే కవితలో ఆ తర్వాతి పంక్తుల్లో తన కవిత్వ మార్గాన్ని తేటతెల్లం చేశారు.

"నాకు రెండు విధులున్నాయి
కవిత్వ నిత్య నిబద్ధం
దారిద్ర్య విముక్తి యుద్ధం"

తన యుద్ధం దారిద్ర్య విముక్తి కోసమేనని ప్రకటించిన దేవిప్రియ ఆ దిశగానే కవిత్వ సృజన చేశారు.

"ఆకలిదప్పులు ఉండని లోకమొకటి కావలెనని
లోపల ఏదో వ్యాకుల స్వప్నం ఇంకా
ఈ కవి మదిని వీడలేదు"

అంటూ వ్యాకులపడ్డ దేవిప్రియ ఆ స్వప్న సాకారం కోసమే 'రన్నింగ్ కామెంటరీ'ని ఉపయోగించారు.

"అడవీ
నువ్వంటే నాకిష్టం
రేపటి దేశానికి
ఈనాటి తల్లివి నువ్వు
రేపటి ఆకాశానికి
ఈనాడే పూసిన సూర్యపుష్పానివి నువ్వు"

అన్నారు దేవిప్రియ.

స్వాతంత్ర దినాన పుట్టిన ఈ కవి తానేమిటో ఎంతో ఆత్మ విశ్వాసంతో చెప్పారు.

"నా పుట్టినరోజుదేముంది
ఒక కార్ల్‌వేల్ తర్వాత
ఒక శ్రీశ్రీ తర్వాత
ఒక పాణిగ్రాహి తర్వాత
ఒక చెరబండరాజు తర్వాత
పుట్టినవాణ్ణి నేను"

'ఈ శతాబ్దం నాది' అని శ్రీశ్రీ ప్రకటిస్తే, అంతే ధీమాగా దాదాపు అదే విధమైన భావ ప్రకటన చేశారు దేవిప్రియ. అయితే నలుగురు నడిచిన దారిలో వెళ్లకుండా ప్రత్యేకమైన దారిని ఎంచుకున్నారు. దిగంబర కవిత్వోద్యమం విస్తృతంగా ఉన్న రోజుల్లో దిగంబర కవుల భాషనూ భావ వ్యక్తీకరణ పద్ధతులనూ వ్యతిరేకించారు. సుగమ్‌బాబు, కిరణ్‌బాబు, కమలాకాంత్, ఓల్గాలతో కలిసి 'పైగంబర కవులు'గా ప్రత్యేక మార్గంలో పయనించారు. 'పైగంబరుడు' అంటే ప్రవక్త. ఈ ప్రవక్తల మార్గం ప్రజాచైతన్యం.

బాబ్రీ మసీదు విధ్వంసంపై చైతన్యవంతమైన కవిత్వాన్ని వెలువరించారు దేవిప్రియ.

"బాబ్రీ మసీదు
ఇప్పుడొక రెక్కలు విరిచిన ప్రాంతం
కుప్పకూలిన చోటే
కునారిల్లుతున్న
శతాబ్దాల శిథిల శకలాలు
రాజకీయ చరిత్రగా మారిన
ఆధ్యాత్మిక పరంపర"

జీవిత సహచరి రాజ్యలక్ష్మిని ఉద్దేశించి,

"ఇంటి దీపానివి కాదు
నువ్వు నా జీవిత విద్యుత్ కేంద్రాన్ని
సాగుచేయడానికి ప్రవహించవలసిన వాగువి"

అన్నారు దేవిప్రియ. ఆ వాగు ప్రవాహం ఇటీవలి కాలంలో ఆగిపోయింది. ఆమె మరణం ఆయనను తీవ్రంగా కుంగదీసింది.

కవిత్వానికి నవరూపాన్నిచ్చినవారు దేవిప్రియ. పాకెట్ సైజు కార్టూన్లతో నవ్వులు పుట్టించే పత్రికలకు కవిత్వం తోనూ గిలిగింతలు పెట్టవచ్చని ఆయన నిరూపించారు. ఆ గిలిగింతలు, చక్కిలిగింతలు పత్రికల సర్క్యులేషన్ అంకెల్లో గారడీ పుట్టించే మంత్రాలయ్యాయి. వ్యంగ్యాస్త్రాలతో ప్రభుత్వం గుండెల్లో బాకులు గుచ్చి, వెన్నులో చలి పుట్టించిన ఈ కవిత్వ వీరుడు పత్రికల సర్క్యులేషన్‌కు జవసత్వాలిచ్చారు.

కవిగానూ ఎడిటర్‌గానూ ప్రఖ్యాతులైన దేవిప్రియ స్వీయ కవిత్వాన్ని ఎప్పుడూ ఎడిటింగ్ చేయకపోవడం విశేషం. కవిత్వ సృజన విస్తృతంగా చేసిన దేవిప్రియ కలాన్నే ఉపయోగించారు కానీ రాసిన కవిత కత్తిరింపులకు కత్తెరనెప్పుడూ వాడలేదు. ఒక భావధార ప్రవహించినప్పుడు పేపర్‌పై పెట్టిన కవితలోని ఒక భాగాన్ని తిరిగి తుడిచెయ్యడమంటే ఆ భావధారను కత్తిరించినట్టేనని ఆయన నిశ్చితాభిప్రాయం.

తొలి రోజుల్లో 'ఆది పరాశక్తి' అనే సినిమాకు మాటలు రాసిన దేవిప్రియ 'మాభూమి', 'రంగుల కల' తదితర సినిమాలకు కూడా పనిచేశారు. 'నిర్మల' అనే మాసపత్రికను స్థాపించిన దేవిప్రియ అనంతర కాలంలో 'ప్రజా వాహిని', 'ప్రజాతంత్ర', 'ఆంధ్రప్రభ', 'ఉదయం', 'ఆంధ్రజ్యోతి', 'హైదరాబాద్ మిర్రర్' తదితర పత్రికల్లో పనిచేశారు. జర్నలిస్టుగా వివిధ తెలుగు పత్రికల్లో తనదైన ముద్ర వేశారు దేవిప్రియ. 'ప్రజాతంత్ర'లో పనిచేసేప్పుడు 'సమాజానంద స్వామి' అనే పేరుతో కవితాత్మకంగా కాలమ్‌ను రచించారు. 'ఆంధ్రప్రభ'లో పనిచేసేప్పుడు 'ఎన్నికల కోలాహలం' అనే పేజీ కోసం రాజకీయ నాయకులపై కవితాత్మక వ్యాఖ్యలను రాయమన్న ఆ పత్రిక సంపాదకులు ఎ.బి.కె. ప్రసాద్ సూచన మేరకు ఎన్నికలపై, రాజకీయ నాయకులపై కవితాత్మక పంక్తులు రాయడం ప్రారంభించారు దేవిప్రియ. కార్టూన్లతో కూడిన ఆ కవితలకు ప్రజాదరణ బాగా పెరిగింది. దేవిప్రియ ఆ రోజుల్లో రాసిన కొన్ని కవితాత్మక పంక్తులు రాజకీయ పార్టీలకు స్లోగన్లుగా కూడా ఉపయోగపడడం విశేషం. ఆయన రచనలు అనేకం ఆ రోజుల్లో గోడలపైకెక్కాయి. ఆ స్పందనతో అనంతర కాలంలో 'రన్నింగ్ కామెంటరీ' మొదటి పేజీకి మారింది.

జర్నలిస్టుగా ఎందరో రచయితలను, కవులను దేవిప్రియ ప్రోత్సహించారు. 'ఆంధ్రజ్యోతి'లో పనిచేసే రోజుల్లో దూరదర్శన్‌లో హిందీలో వచ్చే మహాభారతాన్ని తెలుగు భాషలోకి అనువదింపజేసి, ఆ పత్రిక ఆదివారం అనుబంధం పాఠకలోకానికి అందించారు. ప్రజాగాయకుడు గద్దర్‌పై 'మ్యాజిక్ ఆఫ్ ఎ బ్యాటిల్‌షిప్' అనే పేరుతో ఆంగ్ల డాక్యుమెంటరీని నిర్మించారు.

'సమాజానంద స్వామి', 'రన్నింగ్ కామెంటరీ' అనే పేర్లతో సమకాలీన వ్యవస్థపై వ్యంగ్య కవిత్వాన్ని దేవిప్రియ రాశారు. 'అమ్మ చెట్టు', 'సమాజానంద స్వామి', 'గరీబు గీతాలు', 'నీటి పుట్ట', 'పిట్ట కూడా ఎగిరిపోవలసిందే', 'గాలి రంగు' తదితర కవితాసంపుటాలను వెలువరించారు. 'రన్నింగ్ కామెంటరీ' పేరుతో మూడు కవితాసంపుటాలను ప్రచురించారు. 'అమ్మ చెట్టు' కవితాసంపుటి 1980లో ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు పొందింది. 'నీటిపుట్ట' కవితాసంకలనానికి సినారె కవితా పురస్కారం స్వీకరించారు. 'గాలి రంగు' కవితాసంపుటానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు దేవిప్రియ. సినిమాలు, జర్నలిజం, కవిత్వం - మూడు రంగాల్లోనూ ప్రత్యేకత సాధించిన ఆయన పయనం ఈ నెల 21న ఆగిపోయింది.

**'ఒక యోధుడు అస్తమించాడు"**
**'అమ్మచెట్టు' కూలిపోయింది**
**'రన్నింగ్ కామెంటరీ'**
ఆగిపోయింది.





- డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు
9441046839

# కవితాప్రియపుత్ర 'దేవిప్రియ'

ఇది పోయేకాలం. పండుటాకులు పచ్చనాకు లు కలగలిసి రాలిపోతున్న కాలం. పోతున్నవాళ్లలో తోడబుట్టినవాడో, ఆత్మీయమిత్రుడో, ఆదరణీయుడో ఎవరైన ఉండొచ్చు.ఒక దుఃఖం తీరకముందే మరో దుర్వార్త. దగ్గరకు పోలేము, మీదపడి ఏడవలేము. ఎవరినీ చేరదీసి ఓదార్చలేము. బోనులో నిలబడ్డట్లు నిలువునా శిలలా తడిసిపోవలసిందే. ఒక్కోసారి గుండెలవిసిపోతున్నా గడప దాటలేని దుస్థితి.

పత్రికల్లోనో, సామజిక మాధ్యమ తెరపైనో మనిషి ఫోటో కనబడితే భయం. పుట్టిన రోజేమో... కాదేమో..పక్కనున్న అక్షరాలు చదువ భయం.. వణుకు..అయినా చూడక తప్పదు. పేస్ బుక్ తిరగేస్తుంటే సినిమారీళ్ళలా అన్నీ ఆయన ఫోటోలే.. అవి దేవిప్రియవి. దేవిప్రియ పుట్టినరోజో లేక ఆయనకు మరేదైనా అవార్డు వచ్చిందేమో అనుకుంటూ పై అక్షరాలు చదివితే 'అమ్మచెట్టు కూలిపోయింది' అని రాసుంది. ఆయనతరం ఆత్మీయుల, కవిమిత్రుల , అభిమానుల నివాళిలు బారులుతీరుతున్నాయి.

ఒకతరం సాహిత్యలోకం ఖాళీ అవుతున్నట్లు మరో అద్భుత భావుక శిఖరం తెల్లవారుతుండగానే మాయమయింది. 'మనిషిమీద మనిషికింత మమకారమే లేదు చల్' అంటూ అంతర్ధానమైంది.

దేవిప్రియ నిండుకవి. జర్నలిజం బతుకుతెరువు. ఏ నిలకడ ఉద్యోగం చేయకుండా, ఎవరికీ తన కాలాన్ని కుదువపెట్టకుండా, సర్వ జ్ఞానేంద్రియాల సకల స్వేచ్ఛతో పూర్తిగా తన లోకంలో, తన తపోవనంలో విహరించడంలో ఉన్న జీవన సాఫల్యాన్ని దాని చేదు తీపిలను ఒకే రుచిగా స్వీకరించిన మహానుభావులు దేవిప్రియ. నిష్కమిస్తూ ఆయన మిత్రులపై, అక్షర చిత్రలేఖనంపై వేసిన విశేష, విశిష్ట ముద్ర ఎన్నటికీ చెరిగిపోదు.

తెలుగు కవిత్వంలో 1970,80 దశకాల్లో వచ్చినంత గొప్ప కవిత్వం ఆ తర్వాతి కాలంలో రాలేదని లేదా దాని పై చేయి కాలేదని నా మట్టుకు అనిపిస్తుంది. వచనకవిత్వానికి పూర్తిగా కాలూనిన కాలమది. కె శివారెడ్డి , దేవిప్రియలు యువ కవులను వెంటేసుకొని తెలుగునేలంతా కవిత్వాన్ని చల్లి సాగుచేసిన రోజులవి. రచనకు ముందు ఎంతో శిక్షణ,సాధన..రాసాక ఎంతో చర్చ, విశ్లేషణలు జరిగేవి. అయితే దేవిప్రియవి వ్యక్తిగత పరిచయాలైతే శివారెడ్డివి సమూహాలు,సభలు సమావేశాలు.

కవిత్వానికి ఇష్టమైన కవి దేవిప్రియ. ఒకరికొకరు ఆసరా. 'నాకు రెండు నిధులున్నాయి/ నాలుక మీద కవిత్వం/ తలా మీద దారిద్ర్యం/ నాకు రెండు విధులున్నాయి /కవిత్వంతో నిత్య నిబద్ధం/దారిద్ర విముక్తి యుద్ధం' అని తన కష్టసుఖాలని ఆయన కవిత్వానికి చెప్పుకుంటే, కవిత్వం ఆయన పద లాలిత్యానికి, ప్రయోగానికి మురిసిపోతుంది. అక్షరం తనను ప్రవృత్తిగా కాక వృత్తిగా స్వీకరించేవారిని ఎంతగా పెనవేసుకుంటుందో , ఎలా విజయవంతమౌతుందో దేవిప్రియలో చూడవచ్చు. వామపక్షభావజాలాన్ని నేలవిడిచి సాము చేయకుండా వ్యక్తిగతకోణంలో ఆవిష్కరించారాయన. సాధారణంగా సమకాలీన కవుల రచనల్లో వ్యక్తీకరణలో సారూప్యత బయటపడుతుంది.అయితే దేవిప్రియ ఇందుకతీతుడు.ఏ కోశానా మరొకరి సరసన నిలబడడు. ఒకరిని నిలబడనీయడు. కవిత శీర్షిక మొదలు ప్రతి అంశలోనూ తన సొంత ముద్ర ఉంటుంది.

అమ్మచెట్టు, నీటిపుట్ట, తుఫానుతుమ్మెద, చేపచిలుక, గాలిరంగు ఇలాంటివి మరొకరి ఊహకైనా తట్టుతాయా అనిపిస్తుంది. దేని లోతైన భావన, గూఢార్థము దానికుంది. ఏదో అనితరసాధ్యమైన తాత్వికతయే ఈ పేర్లకు పునాది అయి ఉంటుంది. భాష ఆయన తోబుట్టువు. ఆయన ఆలోచనలను పసిగట్టి తానే ఓ రూపాన్ని సంతరించుకుంటుందా అన్నట్లు తోడుంటుంది.నేను రాసేటప్పుడే నా ఆలోచనలు లయాత్మకంగా సాగుతాయి. అవి అక్షరాల్లో కూడా లయిస్తాయి. కవితా వాక్యాలు నా మెదడులో రూపుదిద్దుకుంటున్నప్పుడు నా పదాల తూనిక అదంతట అదే జరుగుతుంది. ఒక సారి రాసిన తర్వాత దాన్ని ఎడిట్ చేసే ప్రసక్తే లేదు. ఉప్పొంగిన భావ తరంగాలు కవితలో ప్రవేశించిన తర్వాత దాన్ని ఎడిట్ చేస్తే అది కవితే కాదు.అని ఓ ఇంటర్వ్యూలో అన్నారాయన.

1982లో రంగులకల సినిమాకు పనిచేసిన కాలంలో ఆయన సాహచర్యం నాకు లభించింది. కాచిగూడలోని మంజీరా హోటల్ మా విడిది. రూములో కూచొని నేను స్క్రిప్ట్ కాపీలు రాస్తుంటే..యూనిట్ పెద్దలు ఏవేవో లోకేషన్ల, పర్మిషన్ల పనులమీద తిరిగివచ్చేవారు.దేవిప్రియ ఓసారి వెళ్లేవారు..ఓసారి రాసుకుంటూ ఉండేవారు. వ్యక్తిగా దేవిప్రియ అంతర్ముఖుడు. ఆహా..ఓహో అంటూ అనవసరపు ఎత్తుగడలుండవు. కాలయాపన ముచ్చట్లపై కించిత్ ధ్యాస ఉండదు. తామరాకు మీద అంటని, జారని బొట్టు. ఎవరి తాహత్తు, లోతు ఎంతో గ్రహించి అంతే మాట్లాడే పొదుపరి. ఎవరో రాజకీయ వారపత్రిక తెస్తామని ఆయనను సంప్రదిస్తే 'వస్తావా కలిసిపనిచేద్దాం' అన్నారు. రంగులకల యూనిట్ లో బి.నర్సింగరావు, ప్రాణ్ రావు, దేవిప్రియ, జయధీర్ తిరుమలరావు, వైకుంతం, గద్దర్ ఇలా అందరూ అభిమాన అతిరథులే. నేనేమో అప్పుడే యూనివర్సిటీలో అడుగుపెట్టిన పిల్లోన్ని. చేతులు కట్టుకొని ఆశ్చర్యంగా అందరి మాటలు వినే అవకాశానికే ఆనందించే పరిస్థితి నాది. ఈ బచ్చాగాడిని ఆ రోజుల్లో భుజం మీద చేయివేసి పలకరించే మనీషి దేవిప్రియ. అప్పటికే నేను ప్రజాతంత్ర లో ఆయన సమాజానందస్వామి ని చదివిన గౌరవముండేది. ఆయన కవిత్వానికి విద్యార్థిని కూడా అనుకోవచ్చు. ఆయన రాసిన 'జమ్ జమ్మాల్ మర్రి.. వెయ్యికాళ్ల జెర్రి' పాటను ట్రయల్ గా రూము లో గద్దర్ తో పాడించినపుడు నేనూ శ్రోతనే.

ఆ తర్వాత ఆయన ఉదయం లో చేరారని తెలిసింది. నేను ఉద్యోగపరంగా కరీంనగర్ లో ఉన్నాను. ఓరోజు కరీంనగర్ లో హోటల్ ముందు ఉదయం స్టిక్కర్ అతికేసిఉన్న కారు కనిపించింది. వెతుక్కుంటూ వెళ్లి ఆయనను కలిసాను. బ్యాంకులో ఉద్యోగం అని చెబితే గుడ్ అంటూ భుజం తట్టారు. ఆతర్వాత కొన్నేళ్లపాటు ఆయన రన్నింగ్ కామెంట్రీ యే పలకరింపుగా సాగింది. 2012 లో నేటినిజం ఎడిటర్ దేవదాసు తన గృహంలో ఓ ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసినపుడు తిరిగి దేవిప్రియను కలుసుకోగలిగాను. అన్నేళ్ల తర్వాతకూడా అదే ప్రేమతో పలకరించి తన విజిటింగ్ కార్డు ఇస్తూ ఇంటికి రా అన్నారు. కార్డుపై అమ్మచెట్టు, దేవిప్రియ అని ఆయన సంతకం ఉంది. ఇప్పుడు అది నాకొక అపురూప కనుక.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చినా, మరే పురస్కారాలు వరించినా కించిత్ మారని మనిషి ఆయన. ఆ స్థాయినేప్పుడో దాటేశాడాయన. సహచరి వియోగం తర్వాత ఆయనలో ఏకాంతం మరింత పెరిగిందనవచ్చు. అడపాదడపా తనగోడును కవిత్వానికి చెప్పుకున్నారు. రాసినా వాటిలో మిత్రులతో పంచుకొన్నవి కొన్నయితే పత్రికల్లో వచ్చినవి మరిన్ని.

12 అక్టోబర్ న రాసినా 'చివరికి చిక్కింది జింక' దేవిప్రియచివరి కవిత.కాలి మీద చిన్న చంద్రవంకంత గాయం మొత్తం దేహాన్ని ఆక్రమించుకుంది. 'మిగిలిందేముంది ఇంక/ పులినోటికి పూర్తిగా చిక్కినట్లే ఉంది ఈ జింక' అని ముగించిన ఈ కవితలో దానికి తాను చిక్కిపోయినట్టేనని ఆయన గుర్తించినట్టున్నారు . ఈ కవితను తన అభౌతిక పుత్రిక డాక్టర్ నీలిమ,సంతానసముదు శ్రీనివాస్ లకోసం రాసారు. వారి ఇంటిలో ఆయన దాదాపు మూడు నెలలు వైద్యపరమైన ఆశ్రయాన్ని, ఎంతో గౌరవప్రదమైన ఆతిథ్యాన్ని పొందారు.

సీనియర్ కవిగా, ఆత్మీయుడిగా దేవిప్రియని పలవరిస్తూ ఆయన సన్నిహితులు శోకతప్తువవుతున్నారు. కవి కృష్ణుడు, ప్రసాదమూర్తి, నందిని సిధారెడ్డి, శిఖామణి, నున్న నరేష్, కోడూరి విజయకుమార్, అఫ్సర్, కవి యాకుబ్ తమ దుఃఖాన్ని పంచుకొని గుండె దిటువు చేసుకుంటున్నారు. జంటకవుల కాకున్నా జంట వీడని కవులు కె శివారెడ్డి మరియు దేవిప్రియ. ఇప్పుడు అందరూ ఓదార్చవలసింది ఆయన్ని.



-బి.నర్సన్
9440128169



తేది. 08.11.2020న జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర సలహాదారులు డా॥కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డా॥కె.వి.రమణాచారి చేతులమీదుగా ప్రతిభాపురస్కారాలను అందుకొన్న పొత్తూరి జయలక్ష్మి(విమర్శకురాలు), రెహానా(రచయిత్రి-రిపోర్టర్), పి.శ్రీనివాస్ (రంగస్థలం), ఇంటి దుర్గ(సామాజిక సేవ), బి.వాజేంద్ర (పాత్రికేయుడు) లతో పురస్కార ప్రదాతలు సయ్యద్ జానీబాషా, డా॥ రామరాజు శ్రీనివాస్, డా॥చిల్లా రాజశేఖర్‌రెడ్డి (సభాధ్యక్షులు), వి.వి.రాఘవరెడి, గుదిబండి వెంకటరెడ్డి




డిసెంబర్ 23, 2003నాడు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కందుకూరి శ్రీరాములు రచించిన 'దహన కావ్యం' ఆవిష్కరణ సభకు అధ్యక్షత వహించి ప్రసంగిస్తున్న దేవిప్రియ. వేదికపై కందుకూరి శ్రీరాములు, బైస దేవదాసు, ఆవిష్కర్త కె.శివారెడ్డి.

## నిత్య స్మరణీయులు



-దోరవేటి
సెల్:9866251679

### కుంతి

కుంతిభోజు దత్తసుతవై కోరికోరి
కష్టములు గొనుకొన్నట్టి కన్యమాత
దుఃఖ మాజీవనము నీకు తోడు-నీడ
యైన చెదరని సద్గుణాయత్త వీవు !

ముని దుర్వాసుడు నీకొసంగిన వరమ్మునే, నీదు ప్రాణేశ్వరుం
డును గైకొన్న విషాద శాపమును రెండున్ నీకు కష్టంబులే
గొని తెచ్చెన్ గద తల్లి ! భర్తృసుఖమే గోల్పోవ, నీ జీవితం
బనయంబు న్నొక దుఃఖ వార్ధియయె నహా ! హే పృథ ! దుర్వ్యథా !

కన్న సుతుల కొరకు కన్నమ్మ కష్టాల
ననుభవించినట్టి యమల చరిత !
వేతల పాల బడిన సుతులతో బతుకును
మోసినావు నీవు పుణ్యమాత !

ఒక పొరబాటు నీ బ్రతుకు నొత్తెను జీవితమంత, కర్ణు చా
యక, దరిజేరనీక, బతుకంతయు ఘర్షణతో లయించ, నీ
దు కొడుకు ధర్మరాజు నిను దుస్తర శాపము పాలుజేసె న
న్న కథను వింటిమమ్మ, కరుణార్ద్ర నిధీన ! పతివ్రతాంగనా !

## నేటి నిజాలు

అమ్మ రూపం ఏదైతేనేం... ఎలావుంటేనేం... ?
అమ్మప్రేమ మహోన్నతమైనది.. మనోహరమైనది
అంతే.. పవిత్రమైనది

అమ్మస్పర్శతో
మంగారు వాన పరిమళం వెదజల్లుతుంది ప్రేమగా
అమ్మా' అంటే చాలు.. కరిగిపోతుంది మంచులా

నీకు జన్మనిచ్చేందుకు
తన ప్రాణాన్ని పణంగా పెడుతుంది
నీకు ఊపిరిపోసిన అమ్మకు ఊపిరిలా వుండిపో
కడదాకా
ఈ జన్మలో... అమ్మరుణం తీర్చలేనిదని తెలుసుకో..!

- కెరె జగదీష్



### పల్లె పదాలకు మకుటం...



పల్లె పదాలకు పాటగా
ప్రాణం పోసే సంజీవిని విద్య
గోరంటి వెంకన్నకే తెలుసు !
పాటంటే పంచ ప్రాణాల ప్రమాణమే!
జానపదాలను జనంలో జాతర చేసిన
పల్లె గొంతుల ప్రతిధ్వనుల ప్రజా గాయకుడు
పాటకు దూకుడు నేర్పిన వాడు
గోరంటి వెంకన్న పాటకు కొండంత తత్త్వం
పాటతో మనకు నృత్యం చేయాలనిపిస్తది
పల్లెను పాటగా వాగు చేసిందు
పాడిన ప్రతి పాటకు మకుటమున్నట్లే
వెంకన్న పాడిన ప్రతి పాటలో
పల్లెకు తన ముఖం కనిపిస్తది
గుండె చప్పుడు వినిపిస్తది
గొరంటి వెంకన్న వెంట పాటల సైన్యం
ఈ అరుదైన గౌరవం పాటకు వజ్ర కిరీటం అన్నట్లు
పల్లె పాటకు పట్టాభిషేకం జరిగినట్లు.
( ప్రజా గాయకుడు గోరంటి వెంకన్న ఎమ్మెల్సీగా అరుదైన గౌరవంతో అభిషిక్తమైన వేళా విశేషంగా )

- కందాళై రాఘవాచార్య
8790593638

### అమ్మ



తల్లి ప్రేమ ఎంత "మధురం"
అది ఆస్వాదించిన కొద్దీ "అమృతం"
కాదోయ్ ఏప్పటికి కూడా "గరళం"
తల్లి ఒడి వెలకట్టలేని "అక్షయం"
అది జగతిలో సాటిలేని "కిశోరం"
చేయకు దానిని "వ్యర్థం"
కొవ్వొత్తిలా కరుగుతూ
అమ్మ పరిచే ప్రేమ ఏమిచ్చి
కొనగలవ్ ఈ జగతిలోన....
మరి తెలుసుకొని
ఆ మనసును బాధ పెట్టకు ఇకనైనా

-నరేష్ జాటోత్, 8247887267

భోజనశాలలోని గోడలపై అతికించిన
భోజనపదార్థాల చిత్రాలు
ఆకలి తీర్చలేవు.
గతమంతా ఓ సామూహిక జ్ఞాపకం
దాని వైశాల్యం ఎంత పెద్దదైనా
నిర్జీవం కనుక ఆకలి తీర్చలేదు.
వర్తమానం వడ్డించిన విస్తరిలాంటిది.
దాని పరిమాణం ఎంత చిన్న దైనా
జీవం కాబట్టి అనుభవంలోకి వస్తుంది.

మునిమడుగుల రాజారావు.

## రాత - గీత

### ఉరి



మనసుకు కక్ష
తనువుకు శిక్ష
వ్యవస్థకు రక్ష
రాష్ట్రపతి భిక్ష
లేదంటే
మరణశిక్ష

### స్పందన



అలలు లేని నీరు ఉండదు
స్పందన లేని మనిషి ఉండదు
నీటికి అలలు ప్రకృతి గుణం
మనిషికి స్పందన హృదయ గుణం
కానీ-
అలలు అధికమైతే
నీరు ఉప్పెనలో ముంచుతుంది
స్పందన అధికమైతే
హృదయం ఉద్విగ్నమౌతుంది.



రాత-శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత-వర్చస్వి

# నివాళి బాష్పాలలో ఆ నలుగురు...!



పుట్టుటయూ నిజము–పోవుటయూ నిజము
నట్టనడిమి పని నాటకము

అంటాడు అన్నమయ్య. ఎవరి పాత్ర ఈ జీవ నాటకంలో ఎప్పుడు ముగుస్తుందో కనబడని జగన్నాటక సూత్రధారి దర్శకుడికే తెలుస్తుంది గానీ పాత్రధారులకు తెలీదు. 'కాలధర్మం' అనే మాట మరణానికి అందుకే పర్యాయం. ఈ ప్రపంచంలో ఇప్పుడు ఈ కరోనా కాలంలో తరలిపోతున్న మహనీయులు తమ పాత్రలు ముగించుకుని 'కాలధర్మం' చెందుతున్నారు. తెలుగు సాహిత్య, సాంస్కృతిక ప్రపంచం ఎందరో మహనీయులను కోల్పోయింది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, శోభానాయుడు వంటి వారినే కాదు గత కొద్ది నెలలుగా కనుమరుగు అయిపోతున్న దిగ్గంతులు ఎందరినో అశ్రునయనాలతో చూస్తూనే వున్నం. ఒక వారం రోజుల వ్యవధిలోనే ఈ నెల నవంబర్ 2020లో ప్రముఖ కథకులు, ఆకాశవాణి శ్రోతలకు బాలయ్యగా చిరపరిచితులు అయిన జీడిగుంట రామచంద్రమూర్తి, అనువాద సాహిత్య విదుషి కొడవటి కుటుంబరావుగారి కుమార్తె, కొమ్మూరి సాంబశివరావుకు మేనకోడలు చలంకు మనుమరాలు అయ్యే శాంతాసుందరి, ఆకాశవాణి ఢిల్లీ వార్తల అపూర్వగళం, రంగస్థల గాంధీగా ప్రముఖుడు అయిన ఏడిద గోపాలరావు, బాలాంత్రపు రజనీకాంతరావుగారి పెద్ద కుమారుడు, సంగీత సాహిత్యాల సేవలో స్నేహశీలి, అసలుసిసలు అభిమాని అయిన బాలాంత్రపు హేమచంద్ర కనుమూయడం నిజంగా అత్యంత విషాదం. స్మర వారం వారం అనదగిన వారల గురించి నివాళి పరంగా ఈ అక్షరాశ్రుమాలిక.

ఆ నలుగురు..

## 1. జీడిగుంట రామచంద్రమూర్తి

మొదటగా : శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి గారు నవంబర్ 10వ తేదీ మధ్యాహ్నం కరోనాతోనే కన్నుమూశారన్న వార్త దిగ్భ్రాంతి పరిచింది. కొద్ది కాలం క్రితమే బ్రెయిన్ అపరేషన్ జరిగి, ఆ తరువాత కూడా సాహిత్యరంగంలో కృషి కొనసాగించి 'శ్రీ ఆంజనేయం' అనే కథల సంపుటి కూడా ప్రచురించిన ఆయన వేలూరి సహజానందగారి శతజయంతి సందర్భంగా ఓ దినపత్రికలో నేను రాసిన వ్యాసం గురించి ప్రశంసిస్తూ ఫోన్‌చేసి నెల్లాళ్ళయినా కానేలేదు. ఆకాశవాణి జ్ఞాపకాలను నెమరువేసుకున్న ఆ సంభాషణే చివరిది అవుతుందనుకోలేదు. ఆయన ఆకాశవాణి కుటుంబ నియంత్రణ విభాగంలో స్క్రిప్ట్ రైటర్‌గా పనిచేస్తున్న రోజుల్లోనే యువకులుగా నేను, కీ॥శే॥ కోపల్లె శివరాం, కీ॥శే॥ ఉమాపతివర్మ క్యాజువల్ ప్రొడక్షన్ అసిస్టెంట్‌లుగా అదే విభాగంలో పనిచేయడంతో వారితో పరిచయం. ఎంత సౌమ్యుంలో, అంత పనిమంతులు. చక్కని దస్తూరితో కాలాన్ని వృధా చేయకుండా, తన సీట్‌లో కూర్చుని కథలు, నాటికలు కూడా రాసేస్తూ అబ్బుర పరుస్తూండేవారు. అకాశవాణి కార్మికుల కార్యక్రమంలో 'కాంతి కిరణాలు' అనే సంభాషణాత్మక కార్యక్రమంలో చిన్నక్క, ఏకాంబం, బాలయ్య అనే త్రయంలో జీడిగుంట రామచంద్రమూర్తిగారే బాలయ్య. దాదాపు 14 సంవత్సరాలు ఆ కార్యక్రమానికి రచన చేసి, తన గళంతో అశేష శ్రోతల అభిమానపాత్రమయ్యారాయన. 1977లో వనపర్తిలో సన్మానం అందుకుని అప్పటి దివిసీమ తుఫాన్ బాధితుల కోసం వేదికపై నుండే ప్రేక్షకులను ఉత్తేజితులను చేసి పదివేల రూపాయలు చందాలు వసులుచేసి ముఖ్యమంత్రి సహాయనిధికి అందించిన మానవతామూర్తి ఆయన. జీడిగుంట రామచంద్రమూర్తిగారు 1940 ఫిబ్రవరి 13న పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో నరసమ్మ, రామకృష్ణారావు దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించారు. ఆయనకు ముగ్గురు తమ్ముళ్ళు, ఒక చెల్లెలు. 1961 ఏప్రిల్ 20న పెమ్మరాజు రాజ్యలక్ష్మితో వివాహం జరిగింది. విజయసారధి, వేణు, జీడిగుంట శ్రీధర్ వారి అబ్బాయిలే. సినీనటుడు వరుణ్‌సందేశ్ ఆయన మనుమడే! చిన్ననాటనే 'విజయచంద్రిక' అనే లిఖిత పత్రికను నడిపారు. బి.ఏ. బి.యిడి చేసి కొన్నాళ్ళు కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌లో వరంగల్, రాజమండ్రిలలో పనిచేశారు. సాహిత్యాభిరుచితో అందునా కథారచనతో కలంపట్టారు. ఆయన తొలికథే 'హంస గమన' బాపు బొమ్మతో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో



జీడిగుంట రామచంద్రమూర్తి



శాంతాసుందరి

నలుగురు కలిసి కూడే వేళల
నా పేరొకపరి తలవండి
అన్నట్టుగా నాలుగు కాలాల పాటు
నలుగురూ తలుచుకునే
ప్రతిభామూర్తులు. తరలిపోయిన
మహనీయులు నలుగురికీ
నేటినిజం ఈ నివాళి!



బాలాంత్రపు హేమచంద్ర



ఏడిద గోపాలరావు

ప్రచురితం కావడం విశేషం. మూడువందలకు పైగా కథలు రాశారు. ఆకాశవాణి స్క్రిప్ట్‌రైటర్‌గా చేరి, కార్యక్రమ నిర్వహణాధికారిగా ఎదిగి, తెలుగు నాటక విభాగ అధిపతిగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వైభవ ప్రాభవాలకు బాసటగా నిలిచారు. 'మాటల కెరటాలు', 'నవలా స్రవంతి' వంటి కార్యక్రమాలు, రేడియో నాటకీకరణలు ఆయన కీర్తి ఖాతాలోనివని చెప్పాలి. ఈ ప్రశ్నకు బదులేది, అమెరికా అబ్బాయి వంటి సినిమాలకు కథ, సంభాషణలు సంతరించింది ఆయనే. ఆయన కథలు కుటుంబ వ్యవస్థ చుట్టూ గొప్ప ఆర్ద్రతతో సెంటిమెంట్‌తో వుంటాయి. 'సెకండ్ హ్యాండ్', 'కాశీపట్నం చదరబాబు', 'పందిరిమంచం', 'రక్తం చిందనిగాలి' వంటి అద్భుత కథలు, గోదానం, అశ్రుఘోష, సన్‌స్ట్రోక్, అమ్మకో ముద్దు వంటి రేడియో, రంగస్థల నాటకాలు ఆయనపేరు చెప్పగానే స్ఫురించేవి. భర్తృహరి సుభాషిత పద్యాలను ఆధారం చేసుకుని కథలు రాసిన గొప్ప ప్రయోగం వారిది. ఆకాశవాణిలో రిటైర్ అవగానే నాటి రాష్ట్ర ప్రభుత్వంలో ఎలక్ట్రానిక్ మీడియాకై దర్శకులు రాఘవేంద్రరావు గారు రామచంద్ర మూర్తిగారిని కోరి పిలిపించుకున్నారు. తద్వారా ఆయన అందించిన రచనలు, సేవలు ఎనలేనివి. ఆయన వివాదాలకు తావివ్వక, అందరితో స్నేహంతోనూ, కుటుంబంపట్ల ప్రేమానురాగాలతోనూ వుంటూ ఎందరినో ప్రోత్సహించిన గొప్ప మనిషి. 80 సంవత్సరాల వయసులో తెలుగు కథా సాహిత్యంతో తనదైన ముద్రలు నిలిపి తరలిపోయిన ఆ సాహితీవేత్తకు నివాళులు.

## 2. శాంతాసుందరి

తెలుగు సాహిత్యాన్ని హిందీ పాఠకులకు అందించడంలో గొప్ప సృజనశీలిగా ఖ్యాతిగాంచిన శాంతాసుందరిగారు కొడవటిగంటి కుటుంబరావు, వరూధినిగార్ల కుమార్తె. నూరేళ్ళ వయసులో వరూధినిగారు జీవించి వుండగానే 75 ఏళ్ళ శాంతాసుందరిగారు కాలధర్మం చెందడం గొప్ప విషాదం. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అనువాద రచనకుగాను అందుకున్న మహిళల్లో ఆమె సుప్రసిద్ధ. ప్రేమ్‌చంద్ అంటే ఆమెకు అపారమైన ఇష్టం. ప్రేమ్‌చంద్ సతీమణి రాసిన హిందీ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించి ఆవిడ అకాడమీ బహుమతిని 2014లో అందుకున్నారు. అలాగే సలీం నవల 'కాలుతున్న పూలదోట' హిందీ అనువాదానికి జాతీయ మానవ హక్కుల సంఘం ప్రథమ బహుమతి పొందారు. మద్రాసులోని అడయార్ థియసాఫికల్ సొసైటీవారి బాలభారతి పాఠశాలలో ప్రాథమికవిద్య అభ్యసించారు. హిందీపాటలపై ఇష్టంతో హిందీ పరీక్షలు రాసి హిందీలోనే ఎం.ఏ, బిఇడి చేశారు. లిబియాలో భర్త గణేశ్వరరావ్‌గారితో బాటు నివసించిన కాలంలో ఆనేక సంవత్సరాలు హైస్కూలు టీచర్‌గా పనిచేశారు. బిఏ చదువుతున్న రోజుల్లో మద్రాస్ యూనివర్సిటీ నిర్వహించిన హిందీ పోటీల్లో ప్రథమ బహుమతి పొంది పారితోషికంగా వచ్చిన డబ్బుతో కుటుంబ సమేతంగా ఢిల్లీ, బనారస్ వంటి ప్రదేశాలకు కెళ్ళి ఇష్టమైన హిందీ కవులను దర్శించారు. అమితాబ్‌బచ్చన్ తండ్రి అయిన హరి వంశరాయ్‌బచ్చన్ శాంతాసుందరి హిందీ చాలా బావుందనీ, అనువాద రచనలపై శ్రద్ధ పెట్టమని ఒక లేఖలో వచ్చిన సలహాయే శాంతాసుందరిగారిని అనువాద సాహిత్య ప్రపంచంవైపు మరల్చింది. వరవరరావు, కె.శివారెడ్డి, ఎన్.గోపిల వంటి వారి కవిత్వాన్ని, తండ్రి కోంకుగారి చదువు నవలను హిందీలోకి అనువదించిన ఆమె హిందీనుండి తెలుగులోకి, తెలుగు నుండి హిందీలోకి డబ్బై అయిదుపైగా అనువాద గ్రంథాలు వెలువరించారు. తనకు నచ్చిన రచనలను అనువదించారు తప్ప అనువాద రచనను వ్యాపారాత్మకం చేసుకోలేదు. హిందీ, తెలుగు, ఇంగ్లీషు భాషల్లోంచి కవిత్వం, నవల,కథ, నాటకం, వ్యాసాలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు అనేకం అనువదించారు. తమిళం నుంచి కూడా చేసిన కొన్ని అనువాదాలు వున్నాయి. ఆమెది అనుసృజన అనే చెప్పాలి. ఎందుకంటే మూలాలకే మెరుగులు పెట్టిన పఠనీయ గ్రంథాలు ఆమె రచనలు. ఆవిడ గొప్ప స్నేహశీలి. నిగర్వి, ఆ దంపతులతో మేము దుబాయ్ పర్యటించిన మధురమైన జ్ఞాపకాలు మరపురానివి. 1947 ఏప్రిల్ ఎనిమిదిన జన్మించిన ఈ సాహిత్యమూర్తి నవంబర్ 11వ తేదీ కొంతకాలంగా బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతూ భర్త గణేశ్వరరావు గారినీ, తల్లి వరూధినిగారిని, కుమార్తెలు అరుణ, సత్యలనే కాదు అశేష సాహిత్యాభిమానులను, అందునా అనువాద సాహిత్య ప్రేమికులను వదలి 'కాలధర్మం' చెందారు. ఆ విదూషీమణికి అశ్రు నీరాజనాలు.

## 3. ఏడిద గోపాలరావు:

"ఆకాశవాణి వార్తలు చదువుతున్నది– ఏడిద గోపాలరావు" ఢిల్లీ నుండి తెలుగు వార్తలు విన్పించిన ఈ కంఠం కొన్ని తరాల వారికి తరతరాలు గుర్తుండిపోయే స్వరం. మూడు దశాబ్దాలకు పైగా ఆ గళం రేడియో శ్రోతలకు పరిచితమైనదే. తెలుగు విభాగం ఢిల్లీ న్యూస్ రీడర్‌గా పనిచేసిన ఆయన సోషలిస్టు రష్యాలోని మాస్కో రేడియోలోనూ నాలుగేళ్ళు సేవలందించారు. పన్నెండు గంటల పాటు నిర్విరామంగా వార్తలు చదివి 'లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్' కెక్కారు. ప్రముఖ సినీ నిర్మాత ఏడిద నాగేశ్వరరావుగారి రెండో తమ్ముడు ఏడిద గోపాలరావు. పశ్చిమ గోదావరి జిల్లా కొత్తపేట ఆయన స్వస్థలం. ఆయన కేవలం న్యూస్‌రీడర్ మాత్రమే కాదు రంగస్థల నటునిగా కూడా ఖ్యాతిగాంచారు. ముఖ్యంగా రంగస్థల గాంధీగా పేరు పొందారు. 'నేతాజీ' 'బాపు చెప్పిన మాట' వంటి నాటకాల్లో బాపూజీ పాత్ర, గాంధీ ఏకపాత్రభినయ వందలాది ప్రదర్శనలు ఆయనను 'రంగస్థల గాంధీ'ని చేశాయి. 'కరుణామయుడు' సినిమాలో నటించారు. 'సరస నవరస' అనే సాంస్కృతిక సంస్థను ఆయన స్థాపించి, ఢిల్లీ, హైదరాబాద్ నగరాలతో జాతీయ స్థాయిలో నాటకోత్సవాలు నిర్వహించారు. తన అనుభవాలు, జ్ఞాపకాలను 'అరవై వసంతాల ఏడిద గోపాలరావు' అనే గ్రంథంగా వెలువరించారు. అంతే కాదు! 'గోపాల తరంగాలు' అనే కవితా సంపుటితో కవిగా కూడా రూపొందారు. నంది అవార్డుల స్క్రీనింగ్ కమిటీ సభ్యునిగా, చినజియర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఢిల్లీ కేంద్రానికి కొంతకాలం బాధ్యుడిగా కూడా వ్యవహరించారు. కొద్దికాలంగా అనారోగ్యంతో వున్న ఆయన 83 ఏళ్ళ వయసులో 12వ తేదీ గురువారం అస్తమించారు. ఆయన భార్య సుమలత సాంఘిక సంక్షేమ శాఖ విశ్రాంత ఉద్యోగిని ఆయన కుమారుడు శ్యాంరాజ్ చెన్నయ్‌లో స్థిరపడ్డారు. కుమార్తె మెహర్ కొంతకాలం కిందట కన్నుమూశారు. ఇండో సోవియేట్ కల్చరల్ సొసైటీకి సాంస్కృతిక వారధిగా రష్యాలో సేవలందించింది ఆయనే. 1938 సెప్టెంబర్ 22న జన్మించిన ఏడిద గోపాలరావు 1950ల్లో విజయనగరంలో ఫోర్త్‌ఫారం చదువుతున్న రోజులనుంచీ 200కుపైగా నాటకాల్లో పాత్రధారణ, దర్శకత్వం నెరిపినవారు. హైదరాబాద్ దూరదర్శన్‌లో 2012 ఆగష్టు 6న 'మదిలో మాట' కార్యక్రమానికి ఏడిద గోపాలరావుగారిని పరిచయం చేసిన జ్ఞాపకం ఇంకా తాజాగానే ఉంది. ఆ రంగ స్థల గాంధీకి, వార్తావాచస్పతికి వినమ్ర శ్రద్ధాంజలి.

## 4. బాలాంత్రపు హేమచంద్ర:

నవంబర్ 13వ తేదీ ఉదయం నిద్రలోనే గుండె ఆగిపోయి కాలధర్మం చెందిన హేమచంద్ర 'రజని'గా సాహిత్య ప్రపంచంలో ఖ్యాతిగాంచిన బాలాంత్రపు రజనీకాంతారావుగారి పెద్ద అబ్బాయి. హేమచంద్ర స్వయంగా కవియో, కథకుడో, గాయకుడో కాకపోవచ్చు. కానీ అతనిని పరివేష్టించియో, అతను ఆలింగనం చేసుకునో ఎప్పుడూ కవిత్వమూ, కథా, పాటా, ఆ కవులు, కథకులు, గాయకులు అందరూ సజీవ అస్తిత్వంతో మెరిసిపోయేవారు. ఆయన గొప్ప సాహిత్య, సంగీత ప్రేమికుడు. 'అందరి బంధువయా' అనిపించుకున్న హితుడు, స్నేహితుడు. విజయవాడ లచ్చీపేటలో గుడివీధి సందుమొదలే ఆయన ఇల్లు.

రజనీగారి ప్రతిపుట్టిన రోజుని పెద్ద కొడుకుగా హేమచంద్ర చేయడమే కాదు ఈ తరానికి ఆయనను సన్నిహితంగా చేస్తూ వచ్చింది కూడా హేమచంద్ర, ప్రసూనలే. హేమచంద్ర హాజరైన సాహిత్య, సంగీత సభలు కొల్లలు. ఆయన గృహ ప్రాంగణానికి ఆహ్వానింపబడని సాహితీ ప్రియంభావుకుడు లేడు. ఆ ఇల్లు హృదయనందనం, సదా రజనీ గంథకుటిగా భాసిల్లుతుండేది. కృష్ణానదిలో నౌకావిహారంలో కవి సమ్మేళనం నిర్వహింపబడటం వెనుక హేమచంద్ర సంకల్పబలం ఎందరికో మరపురానిది. ఫేస్‌బుక్ అంతర్జాలంలో హేమచంద్ర ఎందరికో అత్యంత సన్నిహితుడైపోయిన మిత్రుడు. అసలుసిసలు పెద్దమనిషి అంటే ఆయనే. ఇతరుల సంతోషంలో తన సంతోషాన్ని చూసుకుంటూ మానవ సంబంధాలకు, ఉన్నతమైన బాంధవ్యాలకు తనే ఒక ప్రతీకగా నిలచే అలాంటి మనుషులు అరుదుగానే వుంటారు. ధన్వంతరి వలె ఆరోగ్యం గురించి ఆయుర్వేదంతో సంబంధితుడయిన హేమచంద్ర 67వ ఏట నిద్రలోనే కాలధర్మం చెందడం 'అనాయాసేన మరణం వినాదైన్యేన జీవనం' వంటిదే! తనకు అశ్రునివాళి.

**నలుగురు కలిసి కూడే వేళల**
**నా పేరొకపరి తలవండి**

అన్నట్టుగా నాలుగు కాలాల పాటు నలుగురూ తలుచుకునే ప్రతిభామూర్తులు, తరలిపోయిన మహనీయులు నలుగురికీ నేటినిజం ఈ నివాళి!

– సుధామ
సెల్:98492 97958

### పొద్దుగూకే వేళ

కప్పుడు పొద్దుగూకే వేళంటే..
గోవుల మెడల చిరుగంటల సవ్వడితో
హృదయం ఊయలూగడం
ఆకాశ విహంగాల బారులగని
నయనానందం పొందడం
అస్తమాద్రిపై పవళించే
భానుని అరుణారుణ కాంతులుగని
ఆనందలోకంలో విహరించడం
పైరగాలి పిల్లతెమ్మెరలుతాకి
మనసు మధురగీతి పాడటం
కర్షకులు అలసిన తమ దేహాలకు విశ్రాంతినివ్వడం
పిల్లాజెల్లా ఆటపాటలతో కేరింతలతో
భూమ్యాకాశాలను ఏకం చేయడం
మహిళామణులు లయబద్ధ జానపద గీతాలతో
చేటలు చెరగడం రోకళ్ళు దంచడం.
నాడు పొద్దుగూకే వేళంటే ఓ మరిచిపోని
మరువలేని మధురానుభూతి

నేడు...
గోవుల చిరుగంటలు కాదు వాహనాల
రణగొణ ధ్వనులతో చెవులు చిల్లు పడటం
ఆకాశమంతా నల్లని పొగ మబ్బుల
బారులు కనిపించడం
సూరీడి జాడకై వెతుకులాడటం
కాలంతో డబ్బువెనక పరిగెడుతూ
అలసిసొలసి రావడం
కాలుష్య కాసారపు పద్మవ్యూహాన్ని
చేధించుకు తిరగడం
ఇంట ఇల్లాలు సీరియల్ల మోతలో
పిల్లలు మొబైలు మోజులో ఎవరికివారే
యమునాతీరే గా బతకడం
నేడు పొద్దుగూకే వేళంటే..
నిర్లిప్తత నిస్సహాయత ఒంటరితనం
రాజ్యమేలే అసురసంధ్య

–రాంనరేష్ కుమార్
9492682285

### గుండె సెరువైతంది!

ఊరి మొదట్లనే చెరువు
అమ్మలెక్క ఎట్లున్నవ్ బిడ్డా
అనుకుంట ఆహ్వానం పలుకుతది!
పక్కనే పెద్దమ్మ తల్లి గుల్లెనుంచి
సల్లగుండు బిడ్డా అని దీవెనలిస్తది! .
వానాకాలంల
నిండు గర్భిణిలా నిండైన రూపం తనది!
ఎగిరే మీనాలతో
ఈదులాడే బాతులతో
కప్పల బెకబెకలతో
కొంగ జపాలతో
పెండ్లిళ్ళు లెక్క కళకళలాడుతుంటది!.
కలువ కమలములను కొప్పున పెట్టుకొని
పచ్చ పచ్చని పొదలతో సింగారించుకున్న
ముత్తైదువ తీరుగుంటది!
చెరువు నిండుకుండ తీరునుంటే
బాయిలల్ల నీళ్ళు చేతికందినట్టుంటయి!
యవుసం మంచిగుంటది!
అన్ని కులపోల్లకు పని దొరుకుతది!
కడుపు నిండుతది!
వినాయకునికి మట్టినిస్తది!
బతుకమ్మలను జూసి పులకరిస్తది!
తనలో కలుపుకుంటది!
పిల్లగాండ్లకా చెరువే గురువైతది!
ఈదులాడుడు నేర్పుతది!
జీవ వైవిధ్యం ఎట్లుంటదో ఎరుక జేస్తది!

గట్లుండేటి చెరువులను
ఇప్పుడు జూస్తే గుండెసెరువైతంది!
ఫ్యాక్టరీలల్ల నీళ్ళూ
మురిక్కాలువల నీళ్ళూ చేరి
గరళమై చెరువుల బతికెడి
జీవుల ఉసురుతీస్తంది!
స్వార్థ పరుల చేత చిక్కి బక్కవడ్డంది!
చెరువు గుండె ముక్కలైతంది!

–ఉష శ్రీ
9440370066

# పోరాటమే జీవితంగా బ్రతికిన నల్ల నరసింహులు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర

నిజాం రాజు పాలకుడిగా తన ఆధ్వర్యంలో రజాకార్లు ,సర్దేశాయి లు జమీందార్లు ,జాగీర్దార్లు,మక్తేదార్లు, దేశ్‌ముఖ్లు,సర్దేశముఖ్లు అంతా కలసి లక్షలాది తెలంగాణ ప్రజలపై దశాబ్దాలుగా కొనసాగించిన రాక్షస, పైశాచిక ,దాడికి వ్యతిరేకంగా అణచివేత, హత్యాకాండ, అత్యాచారాలకు ప్రతిఘటన గా అప్పటిదాకా బాంచన్ నీ కాల్మొక్తా అని బ్రతిమిలాడిన పేద రైతాంగ జనం చేతులను, శరీరాలను, కారం పొడిని,గుత్పలను, చివరికి బందూకులనుపట్టి జరిపిన ప్రపంచ ప్రసిద్ధి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో వీరులు నేలకొరిగారు మరెందరో పోరాడినారు. అందులో సింహ గర్జన చేసిన పోరు బిడ్డ పేద పద్మశాలి యువకిశోరం కడివెండి గడ్డ నల్ల నరసింహులు.

నాటి పరిస్థితులు కొన్ని:–

నాటి నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రంలోని 7430 గ్రామాలలో ఆయన సొంత ఖర్చులకోసం సర్ఫ్ ఎ ఖాస్ అని పిలువబడే భూమి ప్రభుత్వ దళారులై న పైన చెప్పబడిన వారి చేతుల్లో ఉండేది.

పన్నులు వసూలు చేసే అధికారాన్ని పొందిన కొందరు భూస్వాములు వేల లక్షల ఎకరాల భూములను వారి అజమాయిషీలో పెట్టుకునేది. ప్రజలందరూ కౌలుదార్లు కూలీలు దొరల గడిలో వ్యక్తి బానిసలుగా బ్రతికే నిస్సహాయ స్థితిలో ఉండేవారు.

ఉదాహరణకు మానుకోట కు చెందిన జనా రెడ్డి ప్రతాపరెడ్డి కుటుంబం లక్షా 50 వేల ఎకరాల భూమిని, విసునూరు దేశముఖ్ రాపాక రామచంద్రారెడ్డి కి 60 గ్రామాలకు సంబంధించి 40 వేల ఎకరాల భూమి సూర్యాపేట దేశముఖ్ 20 వేల ఎకరాల భూమిని కలిగి ఉండేవారు. దిక్కు మొక్కు లేని లక్షలాది పేద జనం భూముల్లో పంట పండిస్తుంది ఆ ఫలాన్ని అనుభవిస్తూ సర్వాధికారాలు కలిగి తరతరాలుగా ప్రజలను హింసిస్తూ దోపిడీ చేస్తున్న పదుల సంఖ్యలో భూస్వాములు ఒక అసమ సమాజాన్ని నిర్మించి అనివార్యంగా ప్రజా పోరాటం రూపుదిద్దుకోవడానికి కారణమయ్యారు.

ప్రజలకు భూములు లేవు అన్ని దొరల భూములే ఒకరిద్దరికి ఉన్న ఆ భూమిని జప్తు చేసుకునేవారు. ఆగడాలను ఎదిరించిన వారిని పోలీసుల సహకారంతో ,రజాకార్ గుండాలతో ,తామే స్వయంగా పోషించే రౌడీ మనుషులతో దాడి చేయించి చంపేవారు.

తెలంగాణ ప్రాంతం అంతటా వందలకొద్దీ గడీల కింద ప్రజలు నలిగిపోతూ కాలగర్భంలో కలిసిపోతున్న దుర్భర పరిస్థితులలో మరొకవైపు విద్యాగంధం లేక తెలుగు పాఠశాలలు కన్న రాకపోవడంతో సంస్కృతి సాంప్రదాయాలు భాషను రక్షించుకోవడం కోసం ఆంధ్ర మహాసభ పేరుతో కమ్యూనిస్టుల ప్రవేశం వారి ఆగడాలకు కళ్లెం వేసే కొత్త రూపాన్ని సంతరించుకున్నది. కమ్యూనిస్టు పార్టీ నిషేధించడం వల్లనే ఆంధ్ర మహాసభ రూపంలో ఉద్యమాన్ని ఉధృతం చేయవలసి వచ్చింది. పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి ,బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి ,దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి, తరిమెల నాగిరెడ్డి వంటి మానవీయ కోణంలో ఆలోచించే భూస్వామ్య కుటుంబాలకు చెందిన వారు అయినప్పటికీ తమ యావదాస్తిని ప్రజలపరం చేసి, భార్యా పిల్లలతో ఉద్యమంలో దూకడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అలాగే నికృష్ట జీవితం గడుపుతున్న అతి పేద కుటుంబాలకు చెందిన వారు కూడా నిరక్షరాస్యులైన ఉద్యమస్ఫూర్తితో ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో తెలంగాణ పోరు లో నిలిచినధీరులు ఎందరో. నల్ల నరసింహులు, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ బండి యాదగిరి వంటి పేదలు ఎందఱో ఎందరెందరో.

నల్ల నరసింహులు ప్రస్థానం:–

40 నుండి 45 వరకు మధ్య జరిగిన దోపిడి 45 ప్రాంతంలో మరింత ఎక్కువ కావడంతో ఉద్యోగం అనివార్యమైనది.




భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహాసభ పదకొండవ సభలో చేసిన తీర్మానాల మేరకు సంఘాలుగా ఏర్పడి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని కార్యాచరణ ప్రకటించారు. ఆ పిలుపు అందుకున్న కడివెండి గ్రామానికి చెందిన పేద పద్మశాలి బిడ్డ నల్ల నరసింహులు తెలంగాణ సాయుధ విముక్తి ఉద్యమ పోరాట కెరటాలలో ఒకడిగా విప్లవ్ ఇచ్చినాడు. చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన ఆంధ్రమహాసభలో అత్యంత కీలక పాత్ర వహించిన నల్ల నరసింహులు వేలాది మంది యోధులతో నిజాం ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తూ జనగామ ప్రాంతాల నాయకుడిగా వీరోచిత విముక్తి పోరాటంలో పాల్గొని ఎన్నో త్యాగాలు చేశాడు. ఎన్నోసార్లు పోలీసులకు పట్టుబడి చిత్రహింసలకు గురై కోర్టు కేసులు ఎదుర్కొని మూడు సార్లు ఉరిశిక్ష విధించబడిన ఎప్పటికీ న్యాయస్థానములో అత్యంత ధైర్యంగా తన వాదనలను వినిపించి న్యాయస్థానాలు పోలీసుల చేతనే తెలంగాణ టైగర్ అని కీర్తించబడ్డ సామాన్య పేద బిడ్డ అసామాన్య వీర కిశోరం గా మారి నాడు.

నా సందర్శనలో కడివెండి గ్రామాన్ని కడివెండి గ్రామ ప్రారంభంలోనే ఉండే స్మారక స్థూపం, గ్రామం నడిబొడ్డున గల తొలి జీఎజీతీబీటజీతినిజీ దొడ్డి కొమురయ్య స్మారకస్థూపం మొదలైనవి చూసి బాబు ఉద్వేగానికి గురైన అనుభూతి నాస్వీయ అనుభవం. నరసింహులు స్వగ్రామం కడవెండి అది ప్రస్తుతం జనగామ జిల్లాలోని పాలకుర్తి మండలానికి పది కిలోమీటర్ల దూరంలో గల చిన్న గ్రామం. చేనేత పని చేసి నాటి ఉర్దూ మీడియం లో ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న నరసింహులు తన కుటుంబ ఆర్థిక పరిస్థితులను కూడా పక్కనపెట్టి నాటి దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించడానికి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఏళ్లతరబడి అజ్ఞాతంలో ఉండి పోరాడిన ధీరుడు వీరుడు. కనీసం ఆ గ్రామంలో వారు నివసించిన ఇంటి స్థలాన్ని కూడా చూడలేకపోయినా అంటే ఎలాంటి దాఖలాలు లేకుండా ఆ కుటుంబమే కనుమరుగైనది. నిర్మాణ రంగంలోకి దూకిన నల్ల నరసింహులు జనగామ తాలూకా లోని ఎన్నో గ్రామాలలో సంఘం దళాలను నిర్మించి స్వయంగా నాయకత్వం వహించి అగ్ర నాయకత్వానికి కింది దళాలకు సమన్వయ పరిచిన మేధావి కొదమ సింహం నరసింహులు. ప్రజలను కార్యకర్తలను సంఘటిత పరచడంతో దొరలకు రజాకార్లకు నిద్ర లేకుండా చేశాడు. ఆనాడు విసునూరు రామచంద్రారెడ్డి తల్లి జానమా కడివెండి గ్రామం లో దొర గా పిలువబడుతూ దోపిడీ చేసేది. నల్లా నర్సింహులు మొట్టమొదటి తిరుగుబాటును తన సొంత ఊరు కడివెండి లోని జానమ్మ పైననే మొదలుపెట్టి న సందర్భములో 1947 సెప్టెంబర్ 11న నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా భూస్వాముల ఆగడాలను తరిమికొట్టేందుకు ఆంధ్ర మహాసభ నిజమైన సాయుధ పోరాటానికి పిలుపు ఇవ్వడం జరిగింది

భూస్వామ్య వ్యవస్థ బలంగా పాతుకుపోయిన నల్గొండ కరీంనగర్ వరంగల్ ఖమ్మం జిల్లాలోని లక్షలాదిమంది నిరక్షరాస్యత ప్రజా సైన్యం ఎక్కడికక్కడ దొరల గడిల పై రజాకార్లపై పోలీస్ క్యాంపు లపై ప్రతీకారం తీర్చుకున్నారు. వెట్టి పేరుతో తరతరాలుగా బందీ అయిన ప్రజల అప్పు పత్రాలను కాల పెడుతూ గడిల ను ధ్వంసం చేస్తూ దొరలను ప్రజాకోర్టులో నిలబెట్టి శిక్షిస్తూ వేల కొలది ఎకరాలభూములను విముక్తి చేసి దున్నే వాడికి పంచిపెడుతూ ఈ విముక్తి ఉద్యమం 1951 అక్టోబర్ వరకు కొనసాగింది ఈ ఉద్యమంలో వేలాది మంది నేలకొరిగారు.

పరకాల లో జెండా పండుగ నాడు భయంకర సామూహిక హత్య తర్వాత బైరాన్పల్లిలో 118 మందిని కాల్చి చంపి కమ్యూనిస్టుల పై ప్రతీకారం తీర్చుకున్నారు.

అజ్ఞాత దళాలు అటు రజాకార్లు పోలీసుల అమానుష చర్యలతో తెలంగాణ అంతా అగ్నిగుండమే ప్రజ్వరిల్లుతున్న వేళ 122 జలాలను ఆత్మార్పణ గెరిల్లా సమూహాలను నిర్మించి నాయకత్వం వహించిన నరసింహులు కదనరంగంలో ముందుండి నడిపించి అనేకసార్లు హింసను అనుభవించాడు.

## నరసింహులు పైన నేరాలు త్యాగాలు:–

నిజాం రాజు దిగిపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. కొత్త సమస్య ప్రారంభమై యూనియన్ సైన్యాలు కమ్యూనిస్టులను పైన దాడులకు తెగబడ్డారు. 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి పెట్టగా తిరిగి భూస్వాములకు అప్పగించే విధంగా ఆ సైన్యాలు ఒత్తిడి చేసి కమ్యూనిస్టులను తరిమికొట్టిన వి. వందలాది మంది కమ్యూనిస్టు కార్యకర్తలను నాయకులను అడవుల్లోకి తరుముతూ హత్య చేస్తున్నప్పుడు సికింద్రాబాద్ జైలు 12 మందిలో ఒకడిగా ఉండి రేపు ఉరితీయబడ్ తాడు అనగా అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థలు భారత ట్రేడ్ యూనియన్ లో ఆందోళన ఫలితంగా ఉరితీత కు 12 గంటల ముందు నరసింహులు ఉరితీత నిలిపివేయబడింది.

సంకెళ్ళతో బంధించబడ్డ నరసింహు లును చూడడానికి వచ్చిన సైనిక జనరల్ జె.ఎన్.చౌదరికి జిల్లా ఎస్పీ ధనరాజు నాయుడు సంకెళ్ళతో ఉన్న నరసింహన్ను టైగర్ ఆఫ్ తెలంగాణ అని పరిచయం చేసాడట. నిరంతరం గర్జించి ఉరిమే పులి అని నరసింహులు అనేవారని ఆ గ్రామ ప్రజలు మా సందర్శనలో నాతో చెప్పినారు. నిజామును కూలదోసిన కమ్యూనిస్టులు నెహ్రూ ప్రభుత్వానికి కూడా ప్రమాదమే అనే తప్పుడు సంకేతం తో కమ్యూనిస్టు పార్టీ నిషేధించడం కాకుండా హెలికాప్టర్ల ద్వారా కరపత్రాలు పంచి అజ్ఞాత నాయకులను క్యాడర్ను లీడర్ను లొంగిపోవాలని హెచ్చరించిన నేపథ్యంలో నరసింహులు తో పాటు అనేక మంది యోధులు నల్లమల్ల రాచకొండ అడవుల్లోకి పారిపోయి పోరాట విరమణ తర్వాత తిరిగి జనం లోకి వచ్చారు.

ఇప్పటికీ నరసింహుడు పై ఉన్నటువంటి కోర్టు కేసుల వల్ల నాటి ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో చివరి ఉరి శిక్ష నుండి బయటపడి 1959 జనవరి 26న స్వేచ్ఛా ప్రపంచంలోకి కాలు పెట్టాడు.

తరువాత వీరోచిత పోరాటం చేసిన వ్యక్తిగా ఆదరణ లభించినప్పటికీ బొంబాయి సోలాపూర్ భీమండి తదితర ప్రాంతాలలో ఆదరించ బడిన తాను తన ధర్మపత్ని వజ్రమ్మ తెలంగాణ సాయుధ పోరాట మృతులు నాలుగువేల మంది పంపిణీ చేసిన 10 లక్షల ఎకరాల భూమి చారిత్రక విజయాలను స్మరించుకుంటూ జీవితమే నిరంతర పోరాటం అనే సిద్ధాంత అవగాహనతో తన శేష జీవితాన్ని గడిపాడు మహేంద్ర 93 నవంబర్ 5న కన్నుమూసిన కడివెండి గ్రామ ప్రజలకు జనగామ ప్రాంతంలో రాష్ట్ర స్థాయిలోనూ ఒక పోరాట వారసత్వం గా నిలిచిన నరసింహులు ప్రజా ఉద్యమాలకు మద్దతుగా అండగ ప్రజా పోరాటాల లోనే లీనమయ్యాడు. త్యాగాల పోరుబిడ్డ నరసింహులు చరిత్రను నేటితరం యావత్తు అధ్యయనం చేయకపోతే చరిత్రను విస్తరించినట్లు. ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న నరసింహులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను నిక్షిప్తం చేయడం మరో విజయంగా చెప్పుకోవచ్చు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అధ్యయనం చేయడం ద్వారా నేటి తరం నాటి సామాజిక రాజకీయ సాంస్కృతిక వాతావరణాన్ని ఉద్యమాలను ప్రతిఘటనను దోపిడిని అంచనా వేయవచ్చు నేటి పాలనకు హోల్ చుకోవడానికి నాటి ఉద్యమం నుండి స్ఫూర్తి పొందడానికి ఉపయోగపడుతుంది. సాయుధ పోరాట యోధుడు నల్ల నరసింహులు అమర్హై.

( ఈ వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు అధ్యక్షులు జాగృతి కళాసమితి హుస్నాబాద్ జిల్లా సిద్దిపేట)



–వద్దేపల్లి మల్లేశము,
9014206412






సాహితీగౌతమి–2020
సినారె కవితా పురస్కారానికి
కోట్ల వెంకటేశ్వరరెడ్డి

## 'తొణకని వాక్యం'
## కవితా సంపుటి ఎంపిక

సాహితీగౌతమి సినారె పురస్కారం కోసం ఇరురాష్ట్రాల నుండి దాదాపుగా 250 కవితా సంకలనాలు వచ్చాయని వాటిని ఈ సంవత్సరానికిగాను న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్న ప్రముఖ కవులు కందుకూరి శ్రీరాములు, మందరపు హైమవతి, వెల్దండి నిత్యానందరావుగార్లకు పంపించడం జరిగింది. ఈ ముగ్గురి న్యాయనిర్ణేతల నుండి వచ్చిన ఫలితాల ఆధారంగా ఈ సంవత్సరం **'తొణకని వాక్యం'** ఎంపికైంది .త్వరలోనే ఈ పురస్కార ప్రదానోత్సవం ఏర్పాటు చేయడం జరుగుతుంది. పురస్కార కమిటీ సభ్యులుగా దాస్యం సేనాధిపతి, డా॥ బి.వి.ఎన్.స్వామిగారు పాల్గొన్నారు.

–డా॥ యెదవల్లి విజయేంద్ర రెడ్డి
కన్వీనర్, సినారె పురస్కార కమిటీ
మరియు
డా॥ గంద్ర లక్ష్మణరావు, గాజుల రవీందర్,
అధ్యక్ష కార్యదర్శులు సాహితీ గౌతమి, కరీంనగర్.

# భారత రాజ్యాంగం - భారతదేశ ప్రజలకు - ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేస్తున్న సమగ్ర నివేదిక

70 సంవత్సరాల క్రితం ఈ రోజున - నవంబర్ 26, 1949 – భారత రాజ్యాంగ సభ మన రాజ్యాంగాన్ని స్వీకరించింది. 2015 నుండి, ఈ రోజును భారత రాజ్యాంగ దినోత్సవంగా పాటిస్తున్నారు, దీనిని సంవిధన్ దివాస్ అని కూడా పిలుస్తారు. రాజ్యాంగం రెండు నెలల తరువాత, జనవరి 26, 1950 న – రిపబ్లిక్ డేగా జరుపుకుంది.

## గత చరిత్ర

భారతదేశాన్ని బ్రిటీష్ వారు క్రమక్రమంగా ఆక్రమించుకుంటూ 18వ శతాబ్ది చివరకు దేశంలోని చాలా భాగాన్ని తమ పరిపాలన క్రిందకు, కొన్ని రాజ్యాలను తమ ప్రభావం క్రిందకు తీసుకువచ్చారు. 19వ శతాబ్ది తొలినాటికి వారి ఆధిపత్యం పూర్తిగా స్థిరపడిపోయింది. 1858 వరకూ భారత దేశ సార్వభౌమునిగా మొఘల్ పరిపాలకులే ఉన్నా, 19వ శతాబ్ది తొలినాళ్ళ నుంచే వారి గౌరవాన్ని తగ్గిస్తూ వచ్చారు. చివరకు 1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం జరిగి భారత సిపాయిలు, రాజులు అందులో ఓడిపోయాకా 1858లో బ్రిటీష్ రాణి భారత సామ్రాజ్యాధినేత్రి అయ్యాకా దేశం బ్రిటీష్ పాలన కిందకి వచ్చింది. బ్రిటీష్ పరిపాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేందుకు జరిగిన అనేకమైన పోరాటాల్లో ఎందరో దేశభక్తులు పాల్గొన్నారు. ప్రపంచ రాజకీయాల నేపథ్యంలోనూ, భారతీయ స్వాతంత్ర్య పోరాటాల ఫలంగానూ దేశానికి 1947 ఆగస్టు 14న అర్థరాత్రి సమయంలో స్వాతంత్ర్యం వచ్చింది. తదనంతర పరిణామక్రమంలో భారతదేశానికి అవసరమైన రాజ్య నిర్మాణానికై..

## రాజ్యాంగ సభ లేక రాజ్యాంగ పరిషత్

భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి ఏర్పాటు చేసిన రాజ్యాంగ సభ 1946 డిసెంబర్ 9 న మొదటి సమావేశాన్ని నిర్వహించింది. ప్రారంభంలో, తొమ్మిది మంది మహిళలతో సహా 207 మంది సభ్యులు పాల్గొన్నారు. అసెంబ్లీలో 389 మంది సభ్యులు ఉన్నారు. స్వాతంత్ర్యానంతర విభజన తరువాత, దాని బలం 299 కు తగ్గించబడింది. రాజ్యాంగాన్ని రూపొందించడానికి అసెంబ్లీకి మూడు సంవత్సరాలు పట్టింది. ముసాయిదాలోని విషయాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని 114 రోజులు గడిపింది. డిసెంబర్ 13, 1946 న, జవహర్ లాల్ నెహ్రూ జనవరి 22, 1947న ముందుమాటగా ఏకగ్రీవంగా స్వీకరించబడిన "ఆబ్జెక్టివ్స్ రిజల్యూషన్" ను తరలించారు.

అంబేద్కర్ అధ్యక్షతన డ్రాఫ్టింగ్ కమిటీ, రాజ్యాంగ అసెంబ్లీ యొక్క 17 కి పైగా కమిటీలలో ఒకటి, ఆగస్టు 29, 1947 న ఏర్పడింది. భారతదేశం కోసం ముసాయిదా రాజ్యాంగాన్ని సిద్ధం చేయడం వారి పని. ప్రవేశపెట్టిన కొన్ని 7,600 సవరణలలో, కమిటీ రాజ్యాంగంపై చర్చలు జరుపుతున్నప్పుడు సుమారు 2,400 మందిని వదిలించుకుంది. రాజ్యాంగం ఆమోదించబడిన 1949 నవంబర్ 26 న రాజ్యాంగ అసెంబ్లీ చివరి సెషన్ ముగిసింది. 284 మంది సభ్యులు సంతకం చేసిన తరువాత మరుసటి సంవత్సరం జనవరి 26 నుండి ఇది అమల్లోకి వచ్చింది. భారత జాతీయ కాంగ్రెస్ యొక్క పూర్ణా స్వరాజ్ తీర్మానం 1930 లో ఈ రోజున ప్రకటించబడినప్పటి నుండి జనవరి 26 ఎంపిక చేయబడింది. సంవిధన్ దివాస్ భారత రాజ్యాంగాన్ని స్వీకరించిన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం నవంబర్ 26 న భారతదేశంలో సంవిధన్ దివాస్ అని కూడా పిలువబడే రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం జనవరి 26ను భారత గణతంత్ర దినోత్సవంగా జరుపుతారు.

1950 జనవరి 26న భారత ప్రభుత్వ చట్టానికి (1935) బదులు భారత రాజ్యాంగం దేశపరిపాలనకు మార్చడాన్ని భారత గణతంత్ర దినోత్సవం అంటారు. భారత రాజ్యాంగ సభలో 1949 నవంబరు 26న రాజ్యాంగం ఆమోదం పొందగా భారతదేశం స్వతంత్ర గణతంత్రంగా ఆవిర్భవించేందుకు 1950 జనవరి 26లో దీనిని ఒక ప్రజాతంత్ర పరిపాలన పద్ధతితో పాటుగా అమలులోకి తీసుకురావాలని నిర్ణయించారు.

**రాజ్యాంగం** (ఆంగ్లం : constitution) ప్రభుత్వం యొక్క విధానం. సాధారణంగా వ్రాతపూర్వకంగా ఉంటుంది. ఈ రాజ్యాంగంలో చట్టాలు, ప్రభుత్వాలు నడుచుకునే విధానాలు, ఆదేశిక సూత్రాలు, రాజ్యాంగపరమైన విధులు విధానాలూ పొందుపరచబడి వుంటాయి. ప్రతి దేశానికి ప్రభుత్వమనేది సర్వసాధారణం. ప్రతి ప్రభుత్వానికి రాజ్యాంగం అనునది అతి ముఖ్యమైంది. ప్రభుత్వం అనునది శరీరమైతే, రాజ్యాంగం అనునది ఆత్మ లాంటిది. ప్రభుత్వాలకు దిశా నిర్దేశాలు చూపించేదే ఈ రాజ్యాంగం.

## రాజ్యాంగ సభ విశేషాలు

1 స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణానికి రాజ్యాంగ సభకు పట్టిన కాలం: 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు.

1 రాజ్యాంగ సభ 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశమైంది. ఇందులో 114 రోజులు రాజ్యాంగం రాతప్రతిపై వెచ్చించింది. భారత రాజ్యాంగం ప్రపంచంలోని అతి పెద్ద లిఖిత రాజ్యాంగాలలో ఒకటి. అవతారిక 448 అధికరణాలు, 12 షెడ్యూళ్ళతో కూడిన గ్రంథం ఇది. రాజ్యాంగం భారత ప్రభుత్వ వ్యవస్థ, రాష్ట్రాలు, రాష్ట్రాల నిర్మాణం, కేంద్ర రాష్ట్ర సంబంధాలు, కేంద్ర రాష్ట్రాల విధులు, అధికారాలు, స్థానిక సంస్థలు, ఎన్నికలు మొదలైన విషయాలను నిర్వచించింది. పౌరులకు, భారత రాజకీయ వ్యవస్థకు సంబంధించి కింది వాటిని సూత్రీకరించింది:

- ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం
- పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ
- బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్య వ్యవస్థ
- ప్రాథమిక విధులు
- భారత రాజ్యాంగం – ప్రాథమిక హక్కులు
- ఆదేశ సూత్రాలు
- ద్విసభా విధానం
- భాషలు languages
- వెనుకబడిన సామాజిక వర్గాలు

అవసరమైనపుడు రాజ్యాంగాన్ని సవరించుకోడానికి వెసులుబాటు కలిగిస్తూ, సవరణ విధానాన్ని కూడా నిర్దేశించింది. రాజ్యాంగంలో అవతారిక ప్రముఖమైనది. రాజ్యాంగ నిర్మాణం ద్వారా భారతీయులు తమకు తాము అందివ్వదలచిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పట్ల తమ నిబద్ధతను, దీక్షనూ ప్రకటించుకున్నారు. భారత ప్రజలమైన మేము, భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఏర్పరచాలని, దేశ పౌరులందరికీ కింది అంశాలు అందుబాటులో ఉంచాలని సంకల్పించాము:

## న్యాయం–సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం:

స్వేచ్ఛ–ఆలోచనా స్వేచ్ఛ, భావప్రకటన స్వేచ్ఛ, మతావలంబన స్వేచ్ఛ;

సమానత్వం– హోదాలోను, అవకాశాలలోను సమానత్వం;

సౌభ్రాతృత్వం–వ్యక్తి గౌరవం పట్ల నిష్ఠ, దేశ సమైక్యత సమగ్రతల పట్ల నిష్ఠ;

రాజ్యాంగసభలో 1949 నవంబర్ 26వ తేదీన ఈ రాజ్యాంగాన్ని స్వీకరించి, ఆమోదించి, మాకు మేము సమర్పించుకుంటున్నాము. మొదట్లో అవతారికలో భారతదేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా పేర్కొన్నారు. అయితే 42వ రాజ్యాంగ సవరణలో భాగంగా ఇది సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మారింది.

## రాజ్యాంగ దినోత్సవం:

అటువంటి విభిన్న పరిస్థితులలో "ప్రజాస్వామ్యం" యొక్క ఉనికి, విజయవంతమైన మనుగడ మన దేశం గురించి అత్యంత ప్రసిద్ధమైన వాస్తవం, రాజ్యాంగం దాని వెన్నెముక. ''పౌరులలో రాజ్యాంగ విలువలను'' ప్రోత్సహించడానికి నవంబర్ 26 ను రాజ్యాంగ దినంగా పాటిస్తామని మే, 2015 లో కేంద్ర మంత్రివర్గం ప్రకటించింది. రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్ బాబాసాహెబ్ భీమ్రావ్ అంబేద్కర్ 125 వ జయంతిని గుర్తుచేసిన సంవత్సరం ఇది. కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అంబేద్కర్ వారసత్వానికి చేసే చర్యగా భావించబడింది. భగత్ సింగ్, డాక్టర్ రామ్ మనోహర్ లోహియాతో సహా అనేక సంఘేతర చిహ్నాలను సహకరించడానికి చేసిన బహిరంగ ప్రయత్నాలకు అనుగుణంగా నవంబర్ 19, 2015 న ప్రభుత్వం అధికారికంగా నవంబర్ 26 ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించింది. దీనికి ముందు, ఈ రోజును జాతీయ న్యాయదినోత్సవంగా పాటించారు. అంబేద్కర్ భారతదేశపు మొదటి న్యాయమంత్రి కూడా. "ఈ సంవత్సరం, డాక్టర్ బి ఆర్ ఆర్ అంబేద్కర్ 125 వ జయంతిని జరుపుకుంటున్నారు. 'రాజ్యాంగ దినం' ఈ ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా జరిగే వేడుకల్లో భాగంగా ఉంటుందన్నారు. రాజ్యాంగ అసెంబ్లీ ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ అంబేద్కర్‌కి ఇది నివాళి" అని ముంబయిలో విగ్రహ సమానత్వానికి పునాది రాయి వేస్తూ 2015 అక్టోబర్, 11 న ప్రధాని నరేంద్ర మోడీ దీనికి సంబంధించిన ప్రకటన చేశారు. ఇంతకుముందు లా డేగా జరుపుకునే నవంబర్ 26, బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం పొందిన రెండేళ్ళకు పైగా, 1949 లో భారతదేశం తన రాజ్యాంగాన్ని తిరిగి స్వీకరించిన రోజును సూచిస్తుంది. ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది. రాజ్యాంగ ప్రాముఖ్యత, ప్రాముఖ్యతను బలోపేతం చేయడానికి భారత ప్రభుత్వం నవంబర్ 26 ను రాజ్యాంగ దినోత్సవంగా 19 నవంబర్, 2015 న భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జ్ఞాపకార్థం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించింది. భారత రాజ్యాంగం (అధికారికంగా భారత సంవిధానము సంస్కృతం: **भारतस्य संविधानम** నుండి హిందీ: **भारत का संविधान**, English: Constitution of India) భారత దేశానికి సర్వోత్కృష్ట చట్టం.

## "CONSTITUTION DAY"- యొక్క సెలబ్రేషన్:

2015 అక్టోబర్, 11 న ప్రధాని నరేంద్ర మోడీ దీనికి సంబంధించిన ప్రకటన, గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా, భారత తొలి న్యాయమంత్రి భీమ్ రావు అంబేద్కర్ కు నివాళిగా రాజ్యాంగ దినోత్సవాన్ని మొదటిసారిగా 2015 లో నవంబర్, 26 ను రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఖేర్వాలోని గణపత్ విశ్వవిద్యాలయం – యు వి పటేల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రాంగణంలో కూడా ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిబ్బంది అందరూ వారి గౌరవనీయ తరగతి గదిలో 'స్పెషల్ అసెంబ్లీ' నిర్వహించడం ద్వారా ఇది గుర్తించబడింది. ఈ వేడుక చాలా సముచితమైన పదాలతో ప్రారంభమైంది, "త్రివర్ణ రుచిని మా పదాల ద్వారా మాత్రమే కాకుండా మన చర్యల ద్వారా కూడా చిత్రీకరించకూడదు." ఈ విలువైన ఆలోచన తరువాత విద్యార్థులు తీసుకున్న ఉపోద్ఘాతంపై ప్రమాణం చేశారు. తరగతి గది ప్రతిజ్ఞతో ప్రతిధ్వనించింది "నేను, భారత పౌరుడిగా, నాగరిక సమాజం యొక్క సార్వత్రిక సూత్రంపై నా విశ్వాసాన్ని ధృవీకరిస్తున్నాను, భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకునే 26.11.1949 న 70 సంవత్సరాల క్రితం ఈ రోజున – నవంబర్ 26, 1949 – భారత రాజ్యాంగ సభ, మన రాజ్యాంగాన్ని స్వీకరించింది. రాజ్యాంగం రెండు నెలల తరువాత, జనవరి 26, 1950 న – రిపబ్లిక్ డేగా జరుపుకుంది. భారత రాజ్యాంగం ద్వారా భారత దేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చింది. 1950 జనవరి 26 న భారత రాజ్యాంగాన్ని అమలుపరిచిన తరువాత స్వతంత్ర భారతదేశం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. ప్రతి సంవత్సరం ఆ రోజును గణతంత్ర దినంగా జరుపుకుంటారు. భారత ప్రభుత్వ నిర్మాణం ఎలా ఉండాలి, పరిపాలన ఎలా జరగాలి అనే విషయాలను రాజ్యాంగం నిర్దేశించింది. శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థల ఏర్పాటు, ఆయా వ్యవస్థల అధికారాలు, బాధ్యతలు, వాటి మధ్య సమన్వయం ఎలా ఉండాలో కూడా నిర్దేశిస్తోంది. భారత రాజ్యాంగాన్ని స్వీకరించిన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం నవంబర్, 26 న భారతదేశంలో రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. సంవిధాన్ దివస్ అని కూడా అంటారు.

## రాజ్యాంగంలో హక్కులతో పాటు బాధ్యతలు:

కుల, మత, లింగ వర్ణ వివక్ష లేకుండా ప్రజలందరికీ, ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో కల్పించారు. అలాగే ప్రతి పౌరుడు దేశసేవకు, దేశాభివృద్ధికి పాటుపడేలా బాధ్యతలను కలిగి ఉండాలని అందులో పొందుపరిచారు. ప్రతి ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడమే కాదు, ఎందరో మహానుభావులు ఎన్నో సంవత్సరాలు, శ్రమకోర్చి భారతీయులు సుఖ శాంతులతో వర్ధిల్లాలని, అనేక దేశాలు పర్యటించి, భారతదేశంలో జీవించే భారతీయుల ఉత్తమ స్థితిగతుల కోసం రచించిన ఉద్గ్రంథమే భారత రాజ్యాంగం. భారతదేశంలో నివసించే ప్రజలకు సౌకర్యవంతంగా జీవించడానికి అనువైన ఉన్నత ప్రమాణాలతో కూడినదే భారత రాజ్యాంగం. భారతదేశ ప్రజలకు, ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేస్తున్న సమగ్ర నివేదిక. భారత రాజ్యాంగం, అందులో పొందుపరిచిన అంశాలు, అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు, ప్రజల జీవన విధానంలో వారు కలిగి ఉన్న హక్కులకు భంగం కలిగించని విధంగా బాధ్యతాయుతమైన పరిపాలన అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రజలు, వారి హక్కులకు భంగం వాటిల్లినప్పుడు పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థను ఆశ్రయించి తమ హక్కులను సాధించుకునే విధంగా ప్రతి భారతీయుడికీ, భారత రాజ్యాంగంలో పొందుపరచబడింది అనే విషయం తెలుసుకునేందుకు తరగతి గదిలో, ఉత్తీర్ణత మార్కుల కోసం బట్టీపట్టడమే కాకుండా, ఏ సబ్జెక్టులో ఉన్న విద్యార్థి అయినా తరచుగా భారత రాజ్యాంగాన్ని, చదివి తెలుసుకోవాలి. భారత రాజ్యాంగం విధి విధానాలు భవిష్యత్ సారధులైన ప్రతి విద్యార్థి, ఆకళింపు చేసుకోవడం ద్వారా ప్రతి పౌరుడికి ఎప్పటికప్పుడు కాలనిర్ణయంనకు లోబడి జరిగే, ఎన్నికలు స్థానికంగా, రాష్ట్ర అసెంబ్లీకి, కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటుకు అనునిత్యం జరిగే ఎన్నికలకు ప్రాతినిధ్యం వహిస్తూ, భారతదేశంలో నివసించే ప్రతిపౌరుడు ప్రభుత్వం నిర్ణయించిన కాలనిర్ణయం ప్రకారం (వయస్సులో) ఓటరుగా తమ పేరు తప్పనిసరిగా నమోదుచేసుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉంది. అంతేకాకుండా ఎన్నికలలో తమ ఓటు హక్కుని సక్రమంగా వినియోగించుకునే క్రమంలో తమదైన ఆలోచనతో ఎలాంటి ఒత్తిడిలకు గురి కాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా అవినీతికి తావివ్వని స్వచ్ఛమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా భారత రాజ్యాంగ నిర్మాతల కృషి ఫలించి, సమాజమంతా వికాసవంతమై పరిఢవిల్లుతుందనడంలో కించిత్తు సందేహం లేదు.

జైహింద్ – జైభారత్
26-11-2020 తేదిన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా)



**–శారద శృంగేరి**
సెల్: 9490261119

---

# కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా'

**పోటీ ఫలితాలు**



అడ్మిన్: *రమాదేవి కులకర్ణి*
8985613123

నిర్వహణ: *డా॥ప్రతికంఠం మాలతీలత*

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

ప్రథమ బహుమతి విజేత

శీర్షిక: **పుస్తక శిల్పం-430**

పల్లవి:పుస్తక శిల్పం..పుస్తక శిల్పం..
మస్తిష్కపు పొరలోన నిలిచే సర్వం..నిలిచే సర్వం..
మేలుకొలుపు గీతంలా..,
నిదురపుచ్చు లాలిలా..
కదలాడే తత్వం అదే భవ్య స్వరూపం..॥పుస్తక॥.
చరణం1:మది గదిలో నిలిచిపోయి..,
పైరగాలి వీవెనలా అమ్మ జోల పాటలా
నిలుపును నిత్యం అదే చదువులమ్మ తత్వం..!॥పుస్తక॥.
చరణం2:జీవితాన వెలుగునింపు..!
జీవకళను పెంచు రూపు..!
భారతమ్మ చేతి వీణ..!
భవిత చూపు నెరజాణ..!
అదే అక్షర సత్యం..ఇదే అక్షర సత్యం..
నిధిగ వెలుగును నిత్యం..॥పుస్తక॥
చరణం3:పానుపై మారిపోయి పవ్వళింప చేయు నిధి..!
దుప్పటిలా చలిని తీర్చి జోకొట్టు పెన్నిధి..!
అలసటనే మాయ చేసి ఆనందాలు పంచు నిధి..!
వెన్ను దన్నుగా నిలిచి
మదిని హాయిని గొలిపించు ధనం..!॥పుస్తక॥
చరణం4:అక్షరాలే పెన్నిధులై ఆనందపు ఊయలూపు..
అమ్మచేతి గోరుముద్ద ఆకలినే తీర్చునదై
మల్లెపూల పాన్పులా పరిమళాలు వెదజల్లగ..
పుస్తక శిల్పం..అదే పరిమళ ధూపం..!
తరగని గనియై నిలుచును నిత్యం..
సేదదీర్చును సత్యం..
అదే చదువులమ్మ కృత్యం..!
చిరునవ్వుల చిత్రం..!
చిత్రమే చిత్రం..,
చిరునవ్వుల దీపం,నవ్వుల దీపం..॥పుస్తక॥



**–నీలా రంగనాథం**

ద్వితీయ బహుమతి విజేత

శీర్షిక: **చిత్రపాట**

పల్లవి:–పుస్తకమేరా
చదువుల తల్లి సరస్వతీ మాతా....
పుస్తకమేరా వీణాపాణి
విరించి రాణీ......
విద్యలో నొసగే
రాగ స్వరూపిణి
రసమయ వాహినీ! !! ॥పుస్తక॥.

చరణం : హంస వాహిణీ స్వేతాంబర
ధారిణీ పుస్తకరూపిణీ.....
రాగిదోనిలో నిలచిన తల్లి
వ్యాసముని ఎదల్లో మెదిలిన తల్లీ! ॥పుస్తక॥

చరణం :వాణివి నీవే
శ్రీ వాణీ నీవే
చదువుల రాణివీ....
విద్యల నొసగే
విద్యా స్వరూపిణీ
బుద్ధిని ఒసగే
మోక్షప్రధాయినీ..... ॥పుస్తక॥

చరణం :మెదడును తొలచే
బుద్ధిని మలచే....
జ్ఞాన స్వరూపిణీ......
కలమును కదిపీ....
కవితను రాసే
సాహితి రూపిణీ! ॥పుస్తక॥

చరణం :బాధను మరచీ....
నిద్రను విడచీ.....
మంగళదాయినీ......
భాషను తెలిపీ
కోర్కెలు తీర్చే
దివ్య తేజోమయీ! ॥పుస్తక॥



**–కోణం పర్శరాములు**
9959524585

---

# "పుష్కర తుంగభద్ర" ఆవిష్కరణ



తుంగభద్ర పుష్కరాల సందర్భంగా ప్రముఖ కవి, రచయిత డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ రచించిన "పుష్కర తుంగభద్ర" పుస్తకాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆవిష్కరించారు. నవంబర్ 20 వ తేదీన పుష్కరాల ప్రారంభ సందర్భంగా అలంపురంలో జోగుళాంబ అమ్మవారి సన్నిధిలో రాష్ట్రమంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా పుష్కరవిశేషాలతో పుస్తకాన్ని భీంపల్లి శ్రీకాంత్ రచించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అలంపురం శాసనసభ్యులు డాక్టర్ అబ్రహం, అలంపురం దేవస్థాన కమిటీ అధ్యక్షులు ప్రదీప్ గౌడ్, డాక్టర్ గుంటి గోపి, సృజామి తదితరులు పాల్గొన్నారు.

---

**మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 'అటక' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'అటక' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..** – సంపాదకులు

*మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:*
***డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839***

## మనో ఫలకం

వైద్యం నా ధ్యేయమంటూ
నిత్యం సాగిన నా పయనంలో
కరిగిపోయిన వసంతాలెన్నో
చెరిగిపోని జ్ఞాపకాలు మరెన్నో
మరపురాని మజిలీలు ఇంకెన్నో

నా ప్రతి మజిలీ మలుపులో
నా ఆలోచనల తలుపు తట్టి
నా మనోఫలకమనే అటక మీద
దాచుకున్న అందమైన అక్షరాలు
గమ్మత్తుగా నా పదాల కూర్పుగా చేరి
ఒద్దికగా నా భావంలో ఒదిగిపోయి
నా కవితగా రూపుదిద్దుకొని
పుస్తకాల దుప్పట్లోకి దూరిపోయి
ఇంటి అటక మీద చేరి
జ్ఞాపకాల కౌగిట్లో హాయిగా నిద్రిస్తాయి

**డా. రానవేయిన రమేష్,**
9849294694

## భాండాగారం

అవసరానికి ఆదుకునే
అక్షయ పాత్ర
అమూల్యమైన స్థలం
అన్నిటికీ అనువైన ప్రాంతం
ఇంట్లో పనికిరాని
పనికొచ్చే వస్తువులను
గుట్టుగా దాచుకునే
రహస్య తావు
పురాతన కాలం నాటి
తాతముత్తాతలిచ్చిన
విలువైన కానుకలను
ఉంచే అపురూప వేదిక
ఆటలలో దాక్కునే
అనువైన ప్రాంతం
ఎన్ని వస్తువులనైనా
కనబడనీక ఉంచేది.
అత్యంత ముఖ్యమైంది.
సమస్త సరుకుల
భాండాగారం.

**–వై. మంజులత,**
9396983346

## బహిరంగ రహస్యం

పూర్వికుల ఆనవాళ్ళు
దాచిన పురావస్తు శాల
ఎలుకలు బ్యాండు మేళం మోగించే రంగస్థలం
యింట్లో దొరకని వాటికై వెదికే రహస్య స్థలం
ఎన్నో సేవలందించిన
చేతకాని వస్తువులకు శరణాలయం
ఒకే గదిలో రెండింతల స్థలం చూపే మాయా గృహం
ఒకరికి తెలియకుండా ఒకరు
సొమ్ము దాచుకునే
సామూహిక నిక్షేపాలయం అటక
దొంగాపోలీసాటల్లో దొంగను దాచే రక్షక స్థావరం.

**– గుర్రాల వేంకటేశ్వర్లు,**
9490918014

## తన పురాతన జ్ఞప్తి

**1. స్వీయచరిత్రదివ్యంగ్యము**
చం॥ 'ననుగను నాయనా కుడిని నాగలి ప్రక్కన పట్టకార నా కునదిటనివ్వుమా' యనుచు గోరగ బామ్మ, సుధీరతాత్ముడై జనెనటకెక్క, జూప కడు సాహసమున్ భయముక్తబుద్ధి, కాని, నివురు గప్పు నిప్పువలె నీడను బల్లులనెట్లు గెల్చెడిన్??!!

**2. వాస్తవము**
చం॥పరుగుల జీవితంబు గడుపంగ జనాళికి కొత్త వింతయై, వరుసగ పాత వస్తువులు పైకెగబెట్టటకెక్క జేసిరా తిరుగలి, కత్తిపీట, యులి, దేవుని గూళ్ళును, తాళపత్రముల్, మరుగున మూల్గుచున్నవి! సమాజము పాతవి రోతగా గనన్!

**–ఆదిపూడి రోహిత్ శర్మ,**
8188357381

## గుప్త నిధి

అల్లరి పనుల పిల్లల రక్షణ వేదిక
భయంతో వణికే పిల్లల రహస్య స్థావరం.

నాన్నకు కనబడకుండా
అమ్మ ఇనప డబ్బాలో
డబ్బులు దాచే మినీ బ్యాంక్.
పండుగలకు చేసిన పిండి వంటలు
శుభకార్యాలకు చేసిన లడ్డూలు..
అన్నీ అటకపైనే
ప్రతి ఇంటికీ రహస్యాలను దాచిపెట్టే ఊర్ధ్వ మాలిగ
కొంటె పనులు చేసే పడుచు జంటలకు
గుప్త స్థావరం.
పనికిరాని వస్తువులన్నీ అలంకరించే పురాతన వేదిక
అటకెక్కిన వస్తువులకు చాలా బద్ధకం
ఓ పట్టాన కిందికి దిగవు
దాన్ని అందుకోవాలంటే
కుర్చీ ఎక్కాల్సిందే
కుస్తీ పట్టాల్సిందే
మనిషి జీవితం అంతే
పనికిరాని
పసలేని పనులన్నీ
కన్నీటిజ్ఞాపకాలన్నీ
కాలంచేతిలోఎదురైన అవమానాలన్నీ
అటకెక్కాల్సిందే.

**– త్రివిక్రమ శర్మ,**
9000392707

## పిల్లుల ప్రసూతి వైద్యశాల

అటక
లేకపోతె ఇల్లంతా
చిందర వందర
సామనుల చిల్లర
నాటి తరం నుండి
నేటి తరం వరకు
పాత్రల
దస్త్రాల
ధాన్యాల బస్తాల
బరువులు మోసే
రహస్య పేటిక ఆ అటక
ఖైరవులు
నాగులు
పిల్లులు అటకల చేరి
చేసే గొలలెన్నో
పిల్లుల ప్రసూతి వైద్యశాల
అటకల అందాలు వేరు
మార్చుకున్నాయి నాగరిక రూపాలు
మోగుతోంది వాటి ఖర్చుల జోరు
మోజు పోయినవి
బూజు పట్టినవి
అటక చేరాల్సిందే!
ఇంట్లో కార్యానికి
ఆ అటక దిగాల్సిందే!
అటక లేనిది ఇల్లే లేదు!
నవ నాగరికతలో
అటకను అటకెక్కించి
దంపు గదికి పట్టం కట్టేస్తున్నారు!
అటకల నిర్మాణం వదిలేశారు!!

**–జె. నరసింహారావు**
9490128690

## ధాన్యాగారం

అటక–
పెంకుటింటి పేరంటం
రెండో ఇంటిగా పేరు
దొంగలకందకుండా డబ్బు దాచే చోటు
సందుకా పెట్టెల పుట్ట
పెళ్లి భాసింగాలు భద్రపరిచే తావు
ఎండవేడికి కాపాడే చల్లటి కప్పు
పాత సామాన్ల నిక్షిప్త ప్రదేశం
పంట ధాన్యాన్ని దాచే ధాన్యాగారం
ఎక్కడానికి ఎంతో కష్టం
ఎక్కినంక ఉక్కపోతల మంట

**–మామిడి కిరణ్ కుమార్,**
9989726679

## ఖజానా

పెద్దల ఖజానా
అమ్మమ్మ ఇంట్లో
పెద్ద అటక
దాని నిండా ఎన్నో సరుకులు
ముత్తాతల జ్ఞాపకాలు
అపురూప వస్తువులు
వస్తువుల ఖజానా
నిండుగా మెండుగా తరతరాల జ్ఞాపకాలు
నిధులూ పెన్నిధులూ సన్నిధులూ
వారసత్వపు ఆస్తులు
ఏ వస్తువు కావాలన్నా పైకెక్కాల్సిందే
అదొక అందాల అనుభూతి
విడివిడి అటకలు
రైల్వే క్యాబిన్లు.

**–నారు మంచి వాణి ప్రభాకరి**
9849481823

## ఆటలూ లేవు- అటకలూ లేవు

మా ఇల్లు పెంకుటిల్లు
మాకు రెండు అటకలు
వంటింట్లో ఒకటి
హాల్ లోంచి ఎక్కేదొకటి

నాకు బాగా గుర్తు
చిన్నప్పుడు అమ్మ
మడిగట్టించేది నన్ను
వంటిట్లో అటకెక్కించేది
నా కెంత సరదాగా ఉండేదో
పెద్దజాడీలలోని ఊరగాయలు
చిన్నజాడీలలోనికి తీయించేది

కుంకుళ్ళు
చింతపండు
సెనగకాయలు
జీడిపిక్కలు
అన్నీ వంటింటి అటకే భరించేది
వారం వారం నాకు పండగే
అటకెక్కి కూర్చోవడమంటే
అమ్మ అరుపులు దిగు దిగని
కొద్దిసేపమ్మా అటక బాగుందని
మారాం చేసి ఆనందించేవాడిని
ఇప్పుడు ఆ అటకలు లేవు
ఆ సరదాల డోలికలు లేవు.

**– తాతపూడి సోమశేఖర శర్మ**
8328079336

## నాటి సభలు, సమావేశాలు...

నవంబర్ 19 నుండి నవంబర్ 25 వరకు

### నవంబర్ 19

జ్ఞాపకాలు



నవంబర్ 19, 2008న త్యాగరాయ గానసభలో పులివర్తి కృష్ణమూర్తి రచించిన " మనసాయి కథ" పుస్తకావిష్కరణలో గుదిబండి వెంకటరెడ్డి, శైలజామిత్ర, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ఆంధ్రప్రభ సంపాదకులు పి. విజయబాబు, ఆవిష్కర్త డా॥సినారె, పులివర్తి కృష్ణమూర్తి, కళా వేంకట దీక్షితులు.



నవంబర్ 19, 2008న 'మనసాయి కథ' పుస్తకావిష్కరణలో ఆవిష్కర్త డా॥సినారెకు జ్ఞాపికను అందజేస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, పులివర్తి కృష్ణమూర్తి.

### నవంబర్ 20

జ్ఞాపకాలు



నవంబర్ 20, 2015న ఏ.జి. ఆఫీసు సభాస్థలిలో "రంజని-విశ్వనాథ" పద్య కవితా పోటీ విజేతలతో అతిథులు డా॥ అనంతలక్ష్మి, బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణిశర్మ, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, చీకోలు సుందరయ్య, మట్టిగుంట వెంకటరమణ, పద్మలత.



సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

### నవంబర్ 21

జ్ఞాపకాలు



నవంబర్ 21, 2017న టి.ఎల్. కాంతారావు 94వ జయంతి సందర్భంగా వై. మల్లి ఖర్జునం, వై.ఎస్.ఆర్. మూర్తిలను సన్మానిస్తున్న ముఖ్య అతిథి నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు. వేదికపై చిక్కా దేవదాసు, జనార్ధనమూర్తి, ఎ. సురేందర్.




నవంబర్ 21, 2018న త్యాగరాయ గానసభలో ప్రముఖ సాహితీవేత్త శ్రీ వేదం వేంకటరాయ శాస్త్రిగారి జయంతి సభలో పాల్గొన్న డా॥ ఖాన్, వై. రాజేంద్రప్రసాద్, కళా వి.యస్. జనార్ధనమూర్తి, తోట శ్రీలక్ష్మి, బైస దేవదాసు తదితరులు.

### నవంబర్ 22 & 23

జ్ఞాపకాలు



నవంబర్ 22, 2015న త్యాగరాయ గానసభలో డా॥పులివర్తి కృష్ణమూర్తి రచన "అభివ్యక్తి" (సాహితీ సమీక్షలు) గ్రంథావిష్కరణలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥కె.వి. దీక్షితులు, డా॥పులివర్తి కృష్ణమూర్తి, గ్రంథావిష్కర్త వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, సుధామ, పి. సుబ్బారావు,



నవంబర్ 23, 2014న ఆర్టీసి కళ్యాణ మండపంలో జరిగిన జస్టిస్ బి. చంద్రకుమార్ రాసిన "నేను మాకు ఆదర్శం" కవిత సంపుటి ఆవిష్కరణలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు "ఉత్తమ జర్నలిస్టు పురస్కారం"తో సత్కరిస్తున్న జస్టిస్ బి. చంద్రయ్య, జస్టిస్ బి. చంద్రకుమార్, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, ద్వైవజ్ఞశర్మ.

### నవంబర్ 24 & 25

జ్ఞాపకాలు




నవంబర్ 24, 2019న త్యాగరాయ గానసభలో 'పరిస్తా లోకం' రెక్కల సంపుటి ఆవిష్కరణలో పెద్దూరి వెంకటదాసు, బైస దేవదాసు, ఆవిష్కర్త తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి. రమణాచారి, రచయిత ఎన్వీ రఘువీర్ ప్రతాప్, ఆచార్య టి. గౌరీశంకర్, ఎన్. శ్రీనివాసుల రెడ్డి, వై. రమాప్రభ.



నవంబర్ 25, 2017న త్యాగరాయ గానసభలో జరిగిన చిత్రోత్సవంలో తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకరరావు, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, మల్లిఖార్జున్‌లను సత్కరిస్తున్న కళా జనార్ధనమూర్తి, రాజేశ్వరం.

# రాజకీయ పార్టీల దిగజారుడు ఆరోపణలతో ఎవరికి ప్రయోజనం !

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. ప్రధానంగా ఇప్పుడు బిజెపి ముందుండగా దానిని నిలువరించే పనిలో టిఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు బలంగా పనిచేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ మూడు పార్టీలు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రచారంలో కానీ, వ్యూహంలో కానీ ఎక్కడా కానరావడం లేదు. దుబ్బాక కన్నా పరిస్థితి ఇంకా భిన్నంగా ఉంది. దీంతో బిజెపి గ్రేటర్ రాజకీయాల్లో వ్యూహాత్మకంగా ఎజెండా సెట్ చేస్తోంది. మొత్తంగా ప్రచారసరళి చూస్తుంటే..విమర్శలు తారాస్థాయికి చేరాయి. అటుతిరిగి ఇటుతిరిగి టిఆర్ఎస్ కూడా తమ ప్రత్యర్థి బిజెపి అన్న దిశలోనే ముందుకు పోతోంది. తమ ప్రత్యర్థి ఎఐఎం అని నామ్‌కేవాస్తే ప్రకటించినా.. బిజెపిని టార్గెట్ చేస్తూ ప్రధాన ప్రచారకులుగా ఉన్న పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ విమర్శలు గుప్పిస్తున్నారు. బిజెపి కూడా దూకుడుగానే ముందుకు సాగుతోంది. దీంతో తీవ్రస్థాయిలో గ్రేటర్ రాజకీయ ప్రచారాలు నడుస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో నువ్వా నేనా అంటూ పార్టీలు.. ప్రజలను తమ వైపు తిప్పుకునే అనేక రకాలుగా జిమ్మిక్కులను ప్రదర్శిస్తున్నాయి. ఒకరినొకరు తిట్టి పోసుకుంటూ, విధ్వంసకారులుగా తీర్చి దిద్దుకునే ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంలో కరోనా జాగ్రత్తలు,ఫారమాసిటీ భూసేకరణ సమస్యలు, నగర ట్రాఫిక్ సమస్యలు, మెట్రో విస్తరణ, రేప్‌లు, మర్డర్లు, చిన్నారుల అదృశ్య కేసులు, వరద బాధితులను ఆదుకునే ప్రణాళికలు వెనక్కి పోయాయి. బండి సంజయ్ చేసిన సర్జికల్ స్ట్రయిక్ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. టిఆర్ఎస్ కూడా సమస్యలను పక్కకు తప్పించాలన్న ప్రయత్నంలో ఉన్నట్లుగా ఉంది. మతకల్లోల పార్టీ అంటూ బీజేపీని టీఆర్ఎస్ టార్గెట్ చేసింది. బిజెపి చేసిందేమీ లేదని, దానికి అధికారమిస్తే హైదరాబాద్‌ను కూడా అమ్ముకుంటుందని కెటిఆర్ విమర్శలు సంధిస్తున్నారు. అలాగే దేశాన్ని అమ్మకానికి పెట్టారని కూడా కేంద్ర ప్రభుత్వంపై ఘాటుగానే విమర్శలు గుప్పించారు. ఇకపోతే హైదరాబాద్‌లో ఎంఐఎం తొత్తుగా మారిన టిఆర్ఎస్ వారికి సలాం చేస్తోందని బండి సంజయ్ విమర్శలకు పదను పెట్టారు. ఇక్కడ హిందువులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎంఐఎంతో జత కడుతున్న టీఆర్ఎస్ కూడా మత కల్లోలాలకు ఆజ్యం పోస్తుందంటూ బీజేపీ ఆరోపిస్తోంది. దీంతో ఒకరిమీద ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ రాజకీయాన్ని వేడెక్కిస్తున్నారు. పాతబస్తీలో తిష్టవేసిన రోహింగ్యాలను, పాక్ పౌరులను తరిమి వేసేందుకు సర్జికల్ స్ట్రయిక్స్ చేయిస్తామన్న బిజెపి తెంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటనలతో రాజకీయవేడి మరింత రాజుకుంది. పాతబస్తీపై సర్జికల్ స్ట్రయిక్ చేస్తామని ప్రకటించ డం బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట అని కెటిఆర్ విమర్శలు సంధించారు. దీనిని కాస్తా నగరంపైనే సర్జికల్ స్ట్రయిక్‌గా ఆయన తీసుకుని విమర్శలకు పదును పెట్టారు. జిహెచ్ఎంసి ఎన్నికల ప్రచారంలో నగర అభివృద్ధి, ప్రజా సమస్యలు, వరదబాధితులకు కలిగిన నష్టాలు, బాధలు వంటివన్నీ బురదలో కలిసి పోయాయి. కొత్తకొత్త అంశాలు తెరపైకి వస్తున్నాయి. మరో నాలుగు రోజుల్లో మరిన్ని అంశాలు తెలరపైకి రావచ్చు. హైదరాబాద్ పాతబస్తీలో ముస్లిం జనాభా ఎక్కువగా వుండటం అక్కడ మజ్లిస్ రాజకీయ ప్రాబల్యం కొనసాగుతోంది. వారు మతం ఆధారంగానే తమ ప్రాబల్యాన్ని చాటుకుంటున్నారు. అందుకే తన ప్రచారంలో బండి సంజయ్ హిందూ ధర్మం గురించి పదేపదే ప్రస్తావించడం ద్వారా తమది హిందుత్వ పార్టీ అని, బరాబర్ తాము హిందువుల కోసం పనిచేస్తామని అంటున్నారు. ఎంఐఎం ముస్లింల పార్టీ అయిన పుడు తమది హిందువుల పార్టీ అన్న ధోరణిలో విమర్శలు చేస్తున్నారు. మొత్తంగా ఏ మతం గురించైనా మాట్లాడక పోవడం అన్నది అందరూ పాటించాలి. ఇలాంటి ప్రచారంలో ప్రజా సమస్యలు పక్కకు పోయి

వ్యక్తిగత విమర్శలకు దిగజారడం మంచి పరిణామం కాదు. విద్వేషం వివాదం పెంచే వ్యాఖ్యలు ఎవరు చేసినా సరికాదు. నిజానికి హైదరాబాద్‌లో ఉగ్రవాదులు లేదా అక్రమంగా వచ్చిన విదేశీయులు వుంటే వారిని పట్టుకోవాల్సిందే. వారిని వెనక్కి పంపాల్సిందే. ఆ బాధ్యత దేశాన్ని పాలించే బిజెపి ప్రభుత్వానిదే. అలా చేస్తే ప్రజలు కూడా హర్షిస్తారు. అక్రమంగా తిష్టవేసిన విదేశీయులను వెతికి పట్టుకోకుండా ఇంకా ఎందుకు జాప్యం చేస్తున్నారో కూడా అర్థం కాదు. ఇలా చేయకుండా మిన్నకుండడం బిజెపి బాధ్యతా రాహిత్యం కిందకే వస్తుంది. దానికి జిహెచ్ఎంసి మేయర్‌గా గెలిస్తేనే చేయాలన్న రూల్ లేదు. టిఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కెసిఆర్ విధానాలపై బిజెపి విమర్శలను ప్రజలు స్వాగతిస్తున్నారు. కుటుంబ పాలనపైనా ప్రజలు విసుగెత్తి ఉన్నారు. అయితే ఈ విమర్శలను తిప్పి కొట్టడానికి ఇప్పుడు కెటిఆర్ కూడా ఎదురుదాడికి దిగుతూ బిజెపి, నరేంద్రమోడీ ఇచ్చిన హామీలను ఎలుగెత్తి చాటుతున్నారు. దీంతో ఆయన తమ ప్రత్యర్థి బిజెపి అని అంగీకరించక తప్పడం లేదు. ఈదశలో బండి సంజయ్ సర్జికల్ వ్యాఖ్యల పై అసదుద్దీన్ ఒవైసీ బిర్యానీ తినిపిస్తామని బదులివ్వడం, బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ వాల్మీకి బిర్యానీ అంటూ మరింత తీవ్రమైన వ్యాఖ్యలకు ప్పాడటం అంతా ప్రచారంలో భాగంగానే చూడాలి. మొత్తంగా ప్రచారంలో హైదరాబాద్ అభివృద్ధి, ప్రజల సమస్యలు పక్కన పోయాయి. కరోనా విపత్తు అస్సలు కానరావడం లేదు. ఎక్కడా మాస్కులు ధరించి ప్రచారం చేస్తున్న దాఖలాలు లేవు. అందరూ నార్మల్‌గానే తమ ప్రచారంలో సాగుతున్నారు. నాలుగువందల ఏళ్ల నగరం ఆధునికత సంతరించుకుంటూ ముందుకు సాగడానికి మరిన్ని అభివృద్ది పనులు ఏమైనా చేయవచ్చా అన్నది చెప్పడం లేదు. ఫార్మాసిటీ పేరుతో రైతులను బెదరించి భూములు లాక్కునే అంశం ఎక్కడా ప్రచారంలో కానరావడం లేదు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లను మించి పచ్చటి పంటపొలాలను ఫార్మాసిటీ కోసం బలవంతంగా గుంజుకునే పోలీస్ రాజ్యం నడుస్తోంది. దీనిపై రైతులు రోదిస్తున్నారు. ఈ సమస్యలను ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఫార్మాసిటీని ఓ అభివృద్ధి బూచిగా చూపే ప్రయత్నంలో కెటిఆర్ గతకొంతకాలంగా ప్రకటనలు చేస్తున్నారు. ఇలాంటి అనేకానేక సమస్యలను ప్రస్తావిస్తూ, దానికి విరుగుడు ప్రణాళికలను ఆయా పార్టీలు ప్రకటిస్తే బాగుంటుంది.

# కరోనా వ్యాక్సిన్‌కు రవాణా సమస్యలు

### శీతల పరిస్థితుల్లో చేరవేయడమే అసలు సవాల్
### ప్రధాని సూచనలు కూడా గమనార్హం

న్యూఢిల్లీ,నవంబర్25(ఆర్ఎన్ఎ): కరోనా టీకాలను నిల్వ చేసి రవాణా చేయడం ఇప్పుడు అతిపెద్ద సమస్యగా మారనుంది. మైనస్ 70 డిగ్రీల మధ్య ఇది నిల్వ చేయాల్సి ఉంటుంది. అమెరికాలో రూపొందిస్తున్న ఫైజర్ టీకాను మైనస్ 70 డిగ్రీల దగ్గర నిల్వ చేయాల్సి ఉందని తెలియచేసింది. ప్రధాని మోడీ కూడా సిఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఇదే విషయాన్ని తెలిపారు. కోల్డ్ స్టోరేజ్‌లను సిద్ధం చేసుకోవాలన్నారు.

అంతటి చల్లదనాన్ని నిర్వహించే రిఫ్రిజిరేటర్లు మందుల దుకాణాల వద్ద ఉండవు. రవాణా చేయడంలోనూ ఆ నిల్వ శీతలత సమస్య అవుతుంది. టీకాను రూపొందిస్తున్న ÷జైర్ కంపెనీ సూట్‌కేసు పరిమాణంలో ఉండే, పారిశ్రామిక అవసరాలకు, నిల్వల కోసం వాడే డ్రై ఐస్‌ను మాత్రమే ఉపయోగించే సంచార రిఫ్రిజిరేటర్ రూపొందించింది. ఇందులో సుమారు 2 నుంచి 4 వేల దాకా డోసులున్న టీకా సీసాలు నిల్వ చేయవచ్చు. వాటి రవాణా, నిర్వహణ కూడా ఎంతో సున్నితమైనవి. భారతదేశం అతిశీతల స్థితిలో ఉంచిన టీకాలను కాక, ద్రవరూపంలో ఉండే టీకాలను కోరుకుంటున్నది. మన దేశంలో కూడా గాజు సీసాలను కోట్లాది సంఖ్యలో తయారు చేయడం, రవాణా చేయడం ఎంతో సాధకబాధకాలతో కూడుకున్నది. కరోనాకు టీకా వస్తుందన్న సమయంలో ఆశలు రేకెత్తాయి. కానీ అంతలోనే రవాణా, నిల్వ అన్నవి పెద్ద సమస్యలుగా మారబోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి కమ్ముకున్న కరోనాలాంటి అంటువ్యాధి మరొకటి చరిత్రలో లేదు.వైద్య ఆరోగ్య వ్యవస్థలు, చైతన్యం ఇంతగా పెరిగిన ఈ ఆధునిక కాలంలో ఇన్ని ప్రాణాలు బలి అయ్యాయంటే, వైరస్ తీవ్రత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. మానవ సామర్థ్యం పరిమితి ఏమిటో కూడా ఇప్పుడు తెలిపోయింది. మనం ఎంతగా పరిశోధనలు చేసి అభివృద్ధి సాధించామని చెప్పుకుంటున్నా ఏదైనా వరస్ వస్తే తట్టుకోలేని విధంగా ఉన్నామని కరోనా నిరూపించింది.

కరోనాకు మందు లేదు కాబట్టి, ఆ తరహా వ్యాధులకు ఇప్పటికే వాడుతూ ఉన్న చికిత్సా పద్ధతులను, మందులను ఉపయోగిస్తున్నాము. చికిత్స అందినా ఫలితం పొందని రోగులు చనిపోతుంటే ప్రపంచం నిస్సహాయంగా చూస్తూ ఊరుకోవలసి వచ్చింది. ఆరు కోట్ల మందికి వ్యాధి సోకగా, పద్నాలుగు లక్షల మంది మరణించారు. దీంతో విస్తృతస్థాయిలో ప్రపంచ వ్యాప్తంగ ఆపరిశోధనలు సాగుతున్నాయి. వ్యాధి వ్యాప్తి తీవ్రత తగ్గుతోంది. కొన్ని చోట్ల తగ్గినట్టే తగ్గి మళ్లీ విజృంభిస్తున్నది. భారత్‌లో కేసుల సంఖ్య రానురాను తగ్గుతూ ఉన్నది. కరోనా కారణంగా మూతపడిన జనజీవనం క్రమంగా సాధారణ స్థితికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. కరోనా నివారణకు సమర్థమైన, దీర్ఘకాలిక రక్షణ ఇచ్చే టీకా మాత్రమే ప్రపంచం కోరుకుంటోంది. టీకా పరిశోధనల విషయంలో వినిపిస్తున్న మంచివార్తలు ఈ కరోనాకాలం త్వరలో ముగిసిపోతుందన్న ఆశ కలిగిస్తున్నాయి. అనేక దేశాల్లో వివిధ బృందాలు 42 ఔషధాలను క్షేత్రస్థాయిలో పరీక్షిస్తున్నాయి. ప్రస్తుతానికి కనీసం మూడు ప్రయోగాలు ఫలితానికి సమీపంలో ఉన్నాయి. ప్రాణులపై, మనుషులపై ప్రయోగాలు, ఇతర సామర్థ్య పరీక్షలు మాత్రమే కాదు, తయారుచేసిన టీకాలు ప్రంచానికి చేరవేయడం అన్నది పెద్ద పరీక్షగా మారింది. ఒక్కొక్కరికి రెండు పర్యాయాలు టీకా ఇవ్వాలని అనుకుంటే, వెయ్యి కోట్లకు పైగా డోసులను రవాణా చేయవలసి ఉంటుంది. కనీసం పదిహేనువేల విమాన సర్వీసులు ఈ రవాణా కోసమే నడపవలసి ఉంటుంది. మానవులందరికీ టీకా వేయడం అన్నది కూడా ఇప్పట్లో లక్ష్యానికి మించిన పెద్దపని. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఎక్కువ మంది ప్రజలతో మెలిగే ప్రభుత్వ ఉద్యోగులు, వృద్ధులు ఇట్లా ప్రాధాన్య వర్గాలను గుర్తించి టీకా అందించాల్సి ఉంటుందని, అందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని ప్రధాని మోడీ తెలిపారు. టీకా ఎప్పుడు వచ్చినా దానిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. లక్షలాది మంది వైద్యసిబ్బంది, ముఖ్యంగా నర్సులు ఈ బృహత్ కార్యక్రమంలో పాలుపంచుకోవాలి. తగినంత మంది శిక్షిత సిబ్బంది లేకపోతే, అందవలసిన వారికి అందకపోతే, అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి.

# తిరుపతి ఉప ఎన్నిక సీటు కోసం పవన్ పట్టు

### అనూహ్యంగా పోటీకి రంగం సిద్దం
### బిజెపి సీటు వదులుకుంటుందా అన్నదే సమస్య

తిరుపతి,నవంబర్25(ఆర్ఎన్ఎ): ఉప ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందని ముందునుంచే సమాచారం ఇచ్చినా, దానికి మిత్రపక్షంగా మారిన జనసేన అనూహ్యంగా వచ్చే ఉప ఎన్నికల్లో పోటీ చేస్తుందన్న సమాచారన్ని ఇస్తోంది. ఇందుకు బిజెపిని ఒప్పించే పనిలో భాగంగా జనసేనాని పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌లో హస్తినలో మకాం వేశారు. ఈ విషయంలో.. త్వరలోనే క్లారిటీ వస్తుందని ఎపి బిజెపి సోము వీర్రాజు అంటున్నారు. పవన్ కల్యాణ్ ఢిల్లీ పెద్దలతో చర్చిస్తున్నారని... ఆ తర్వాత అభ్యర్థి విషయంలో స్పష్టత వస్తుందన్నారు. అయితే గత సార్వత్రిక ఎన్నికల్లో జనసేన ఎక్కడా ప్రభావం చూపకున్నా ఎందుకనో ఉప ఎన్నికల్లో బిజెపితో కలసి నిలబడాలని చూస్తోంది. తమకు కలసి వస్తుందని పార్టీ అధినేత భావిస్తున్న ట్లుగా ఉంది. రాజకీయంగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉన్నారని సమాచారం. అయితే బిజెపి నేతలు ఇందుకు సమకరిస్తారా..ఉప ఎన్నికల్లో సీటును బిజెపికి వదులుతారా అన్నది చూడాలి. తిరుపతి అభివృద్ధికి కేంద్రం అధిక ప్రాధాన్య మిస్తోందని బీజేపీ చీఫ్ సోము వీర్రాజు అనడంతో పాటు తాము పోటీ చేస్తామని ఎప్పటి నుంచో చెబుతున్నారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమన్నారు. అయితే ఇదే సమయంలో అధికార వైసీపీ... అవినీతికి పాల్పడుతోందని విమర్శించారు. ప్రధానంగా ఇసుక మాఫియా చెలరేగుతోందన్నారు. తిరుపతి ఉప ఎన్నికల్లో గెలుపు సాధించే వరకు విశ్రాంతి వద్దన్నారు. ఇక ఇదే పనిమీద ఢిల్లీ వెళ్ళిన పవన్ కళ్యాణ్ కూడా ఢిల్లీలో బిజెపి పెద్దలతో కీలక మంతనాలు జరపనున్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జే.పి. నడ్డా తో పవన్ కల్యాణ్ ముఖాముఖి చర్చలు జరుపునున్నారు. బిజెపి, జనసేన సంయుక్త కార్యాచరణ పై సమాలోచనలు చేస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉభయ పార్టీ లు అనుసరించాల్సిన వ్యూహం పై దృష్టి పెట్టాయి. హైదరాబాద్ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ బిజెపికి అనుకూలంగ ఆప్రకటన చేశారు. జనసేన కార్యకర్తలు బిజెపికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. ఇకపోతే తిరుపతి ఉపఎన్నికల్లో టీడీపీ తన అభ్యర్థిని మాత్రం అందరికంటే ముందే ప్రకటించింది. ఉప ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా పనబాకలక్ష్మిని ముందే ప్రకటించడానికి కారణం ఉందని ఆ పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాక్షేత్రంలో టీడీపీకి గడ్డు రోజులు నడుస్తున్న తరుణంలో మాజీ మంత్రి పనబాకలక్ష్మి బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అందులో భాగంగా బీజేపీ పెద్దలతో కూడా సంప్రదింపులు నెరిపి తేదీ కూడా ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. పనబాకలక్ష్మి బీజేపీలో చేరుతుందని తెలుసుకున్న చంద్రబాబు ఆవెను సంప్రదించకుండా తిరుపతి పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించారని అంటున్నారు. చంద్రబాబు తీరుతో ఆమె షాక్‌కు గురైనట్లు ప్రచారం కూడా సాగుతోంది. అభ్యర్థిత్వం ప్రకటించినా ఆమె నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో చంద్రబాబు ఆరా తీసినట్లు తెలిసింది. తనను సంప్రదించకుండా ప్రకటించడంపై ఆగ్రహంతో ఉన్నారని, టీడీపీ అభ్యర్థిత్వం నుంచి తప్పుకునే అవకాశందని ఉందని టీడీపీ అధిష్టానానికి సమాచారం అందింది. వెంటనే చంద్రబాబు సోమిరెడ్డిని రంగంలోకి దింపారు. అందులో భాగంగా ఆయన పనబాకలక్ష్మితో భేటీ అయ్యారు. టీడీపీకి సన్నిహితంగా ఉండే మాజీ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు పట్ల బిజెపి మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఆయన్ని బీజేపీ అభ్యర్థిగా ప్రకటిస్తే చంద్రబాబు వైఖరి ఎలా ఉంటుందన్నది చూడాలి.

# హైదరాబాద్‌పై బాంబుల దాడి చేస్తారా?

## సర్జికల్‌స్ట్రయిక్స్ ప్రకటనపై మండిపడ్డ మంత్రి జగదీశ్వర్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): బీజేపీకి ఓటు వేయకుంటే భాగ్యనగరంపై బాంబులతో దాడులు చేస్తారా? అని ఆ పార్టీ నేతలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. సర్జికల్ స్ట్రయిక్స్ చేయడమంటే ఏమిటని అన్నారు. హైదరాబాద్ ప్రశాంతతను దెబ్బతీసేలా బిజెపి కుట్ర చేస్తోందని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఉదయం కొత్తపేట డివిజన్‌లో మంత్రి ప్రచారం నిర్వహించారు. ప్రపంచ దేశాలను కన్నతల్లిలా హైదరాబాద్ అక్కున చేర్చుకుందని, అలాంటి నగరంపై సర్జికల్ స్ట్రయిక్‌లంటూ కమలనాథులు అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలకు కల్పించే మౌలిక సదుపాయాలు, అభివృద్ధిని విస్మరించి సర్జికల్ స్ట్రయిక్ అంటూ నగర ప్రజల్లో భయాందోళనలను సృష్టించేందుకు బీజేపీ కుట్ర పన్నుతుందని ఆరోపించారు. 2014లో అదుపు తప్పిన శాంతిభద్రతలను ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఏర్పాటైన తెలంగాణ ప్రభుత్వం అదుపులోకి తీసుకువచ్చిందన్నారు. గతంలో నగర శివారులో నివాసం ఉండాలి అంటేనే జనం భయపడేవారని.. వారికి టీఆర్ఎస్ ప్రభుత్వం రక్షణ కల్పించిందన్నారు. సీసీ కెమెరాలు, షీటీంలతో నగరంలో శాంతిభద్రతలు ఫరిడవిల్లుతుందన్నారు. బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో మాదిరిగా ఈ సారి ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పీఠం టీఆర్ఎస్‌కు అప్పగించి నందునే రూ.65వేట కోట్లతో నగరాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఈ సారి ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కొత్తపేట అభ్యర్థి విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.



### ప్రజాభిమాన పాత్రికేయులు డా॥పొత్తూరి వెంకటేశ్వరరావు వ్యాససంకలనం - రచనలకు ఆహ్వానం

సుప్రసిద్ధ పాత్రికేయులు, ఆంధ్ర ప్రెస్ అకాడెమీ పూర్వ ఛైర్మన్ డా॥పొత్తూరి వెంకటేశ్వరరావు ప్రపంచవ్యాపితంగా ఎందరో ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఎందరో రచయిత(త్రు)లకు వారితో ఎనలేని అనుబంధం నెలకొనివున్నది. మార్చి 5, 2021 వారి ప్రథమ వర్ధంతి నాటికి సాహితీకిరణం ఒక వ్యాస సంకలనం ప్రచురించాలని నిర్ణయించటం జరిగినది. ఈ సంకలనంలో ఇంతకుముందు వివిధ పత్రికలలో ముద్రించబడిన వ్యాసాలు, ఎంపిక చేయబడిన మరికొంతమంది రచయితల వ్యాసాలు ప్రచురించబడతాయి. వ్యాసం 1.8 సైజులో 3 పేజీలు మించకుండా ఉండేటట్లు పంపాలి. రచనలు చేరవలసిన ఆఖరుతేదీ 31.12.2020 చిరునామా: ఎడిటర్, సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్ నెం.3 హైదరాబాద్-500102. ఫోన్: 040-29550181.సంపాదకులు, సాహితీకిరణం,సెల్:9490751681

# పైకెపి కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోండి

ఆదిలాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): ఐకెపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు లబ్దిచేకూరుతుందని ఆదిలాబాద్ జేసీ సంధ్యారాణి అన్నారు. గ్రామాల్లో ఐకెపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. సర్కారు ప్రకటించిన మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.1,888, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.1,868 చెల్లిస్తున్నట్లు చెప్పారు. రైతులు తేమ శాతం 17 కంటే తక్కువగా ఉండేలా చూసుకొని, కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.

# తరుణ్‌గొగోయ్‌కు రాహుల్ నివాళి

గౌహతి,నవంబర్25(ఆర్ఎన్ఎ): అసోం మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు తరుణ్ గొగోయ్‌కు ఎంపీ రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. కరోనా అనంతర సమస్యలతో తరుణ్ గొగోయ్ ఈనెల 23న మరణించారు. గువాహటిలో జరుగుతున్న ఆయన అంతిమ యాత్రలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. 'తరుణ్ గొగోయ్ తనను కన్న కొడుకులా చూసుకున్నారు. ఆయన మరణంతో తనకు వ్యక్తిగతంగా నష్టం కలిగింది. ఇవాళ కాంగ్రెస్ పార్టీ మరో మూల స్తంభం, సీనియర్ నేత అహ్మద్ పటేల్ కన్నుమూశారు. ఇది చాలా విషాధకరమైన రోజు' అని రాహుల్ ట్వీట్ చేశారు.

# గ్రేటర్‌లో మకాం వేసిన టీఆర్ఎస్ బృందాలు

### ఒక్కో డివిజన్‌లో జోరుగా ప్రచారంలో నేతలు
### కార్పోరేటర్లను గెలిపంచుకునే పనిలో చెమటోడుస్తున్న మంత్రులు

హైదరాబాద్,నవంబర్25(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అంగబలం అంతా హైదరాబాద్‌లోనే మకాం వేసింది. గల్లీ పార్టీ అయిన టిఆర్ఎస్‌ను ఓడించేందుకు ఢిల్లీ పార్టీ పెద్దపెద్దోళ్లను రంగంలోకి దింపిందన్న కెటిఆర్..తమ పార్టీ వారిని కూడా హైదరాబాద్‌లో దింపారు. మొత్తం మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు సహా వివిధ హోదాల్లో ఉన్న నేతలంతా ఇప్పుడు హైదరాబాద్ ప్రచారంలో బిజీగా ఉన్నారు. దీంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. టిఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి, కెసిఆర్ విజన్ పై ప్రచారాలు చేస్తున్నారు.

అలాగే ప్రచారంలో ఉన్న డివిజన్ ఇంఛార్జ్‌లకు కంటిపై కునుకు లేకుండా ప్రచారంలో దూసుకుపోతన్నారు. దుబ్బాక ఓటమి తర్వాత ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవడంతో ఇంఛార్జ్‌లు అమలు చేస్తోన్న వ్యూహం ప్రధానంగా ప్రభావం చూప నుంది. తమ పరిధిలోని కార్పొరేటర్లను గెలిపించి పార్టీ పెద్దల దృష్టిలో పడేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలతో మమేకం అవుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. పోలింగ్‌కు మరో ఐదురోజులే మిగిలి ఉండటంతో అన్ని పార్టీలు డివిజన్లలో గెలుపోటములపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఓటర్లను కలవడం..పోల్ మేనేజ్‌మెంట్.. అభ్యర్థులను గెలిపించుకునేందుకు వ్యూహ రచనలో మునిగిపోయాయి. ఈ విషయంలో ఒక్కో పార్టీది ఒక్కో ఎత్తుగడ అయినా టిఆర్ఎస్ మాత్రం పక్కా వ్యూహంతో ముందు సాగుతోంది. అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శులకు ఎన్నికల బాధ్యతలు అప్పగించి సిటీ మొత్తం చుట్టేస్తోంది. గ్రేటర్ ఎన్నికల ప్రచార బాధ్యతలు స్వీకరించిన పార్టీ నేతలందరికీ రాజకీయంగా ఇది జీవన్మరణ సమస్యగా మారబోతున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తమకు అప్పగించిన ప్రాంతాలలో ఎక్కువ స్థానాల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే అధిష్ఠానం దగ్గర మంచి మార్కులు పడతాయి. ఒకవేళ ఆశించిన స్థాయిలో డివిజన్లు గెలవకపోతే రాజకీయ భవిష్యత్‌కు గ్రహణం పడుతుం దేమోనని ఆందోళన చెందుతున్నారు. అందుకే ఆయా డివిజన్లలో టీఆర్ఎస్ రెబెల్‌గా బరిలో ఉన్నవారి.. పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న స్థానిక టీఆర్ఎస్ నాయకులను బుజ్జగించే పనిని కూడా ఎత్తుకున్నారు. రెబెల్స్‌దారిలోకి వచ్చిన చోట సగం విజయం సాధించి నట్టుగా భావిస్తున్నారు. మొదటి సారిగా డివిజన్లకు మంత్రులు, ఎమ్మెల్యేలను ఇంఛార్జ్‌లుగా పెట్టడం చూస్తే ఈ ఎన్నికలను టిఆర్ఎస్ ఎంతగా ప్రతిష్టాత్మకంగా తీసుకుందో అర్థం చేసుకోవచ్చు. కార్పోరేటర్ గెలవాల్సిన ఒక డివిజన్ చిన్నగా ఉంటుంది. అలాంటి ప్రాంతానికి మంత్రి ఇంఛార్జ్‌గా రావడం కొత్తగా ఉన్నా.. పార్టీ మాత్రం ఎలాంటి ఛాన్స్ తీసుకోకుండా ముందస్తు వ్యూహంతో ముందుకు సాగుతోంది.

గత ఎన్నికల్లో 99 మంది కార్పొరేటర్లను గెల్చుకున్న టీఆర్ఎస్ ఈ సారి 105 స్థానాలను గెలుస్తామని చెబుతోంది. అందుకే అన్ని అస్త్రశస్త్రాలను మొహరించింది. ఇప్పటికే ఎన్నికల ప్రచార గోదాలోకి దిగిన మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు వ్యక్తిగతంగా ఓటర్లను కలుస్తున్నారు. అయితే.. పోటీలో ఉన్న కార్పొరేటర్ అభ్యర్థి సత్తా సరిపోవడం లేదని భావించిన ప్రాంతాల్లో మరింత దృష్టి పెట్టారు. పార్టీ వ్యూహానికి తోడు మంత్రులు తమ సొంతంగా కూడా గెలుపు వ్యూహాలను రచిస్తున్నారు. ప్రస్తుతం టీఆర్ఎస్ ప్రచారంలో డివిజన్లస్థాయిలో ఇలాంటి టీమ్‌లు హడావిడి ఎక్కువగా కనిపిస్తోంది. దుబ్బాక ఇచ్చిన చేదు అనుభవం ఫలితమో కానీ.. ఇంఛార్జులుగా ఉన్న నాయకులకు మాత్రం కంటిపై నిద్ర కరువైందని ప్రచారం జరుగు తోంది. స్థానిక నాయకులతో కలిసి ఈ టీమ్‌లు సమన్వయం చేసుకుంటూ పనిచేశాలా మంత్రులు, ఎమ్మెల్యేలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ విధంగా ఎమ్మెల్యేలు, మంత్రులకు చెందిన వంద నుంచి రెండు మూడొందల మంది కార్యకర్తలు చొప్పున నగరంలోకి వచ్చినట్టు సమాచారం. వారికి అవసరమైన ట్రావెలింగ్, లాడ్జింగ్ అంతా నాయకులే చూసుకుంటున్నారని సమాచారం. డివిజన్లలో పార్టీకి ఎలాంటి ప్రతికూలత వ్యక్తం కాకుండా.. బలం చాటే విధంగా ఇలాంటి టీమ్‌లు ఇంటింటా ప్రచారం చేస్తున్నాయని సమాచారం.

# కాంగ్రెస్ మూలస్తంభం కూలిందన్న సంజయ్ రౌత్

ముంబై,నవంబర్25(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అహ్మద్ పటేల్ మరణవార్త తమను బాధించిందని శివసేన పార్టీ అధికార ప్రతినిధి, ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. రెండు రోజుల క్రితమే తాను అహ్మద్‌పటేల్ కుటుంబసభ్యులను కలిశానని, ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే సైతం వారితో మాట్లాడారని సంజయ్ రౌత్ చెప్పారు. అహ్మద్‌పటేల్‌ను మెరుగైన వైద్యం కోసం ఎయిర్ అంబులెన్స్ ద్వారా ముంబైకి తరలిద్దామని వారికి చెప్పామని, అయితే ఇంతలోనే ఆయన మరణవార్త వినాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. అహ్మద్‌పటేల్ మరణం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఒక మూలస్తంభాన్ని కోల్పోయిందని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఆయన విశ్వాసానికి మారుపేరని, రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ పార్టీకి నమ్మినబంటుగా ఉండటం ఎలాగో ఆయనను చూసి నేర్చుకోవాలన్నారు. అహ్మద్‌పటేల్ ఒక సంస్కారవంతుడైన రాజకీయ నాయకుడని రౌత్ కొనియాడారు.

# త్వరలోనే మరోమారు టెలికామ్ ఛార్జీల పెంపు?

న్యూఢిల్లీ,నవంబర్25(ఆర్ఎన్ఎ): త్వరలోనే మరోమారు టెలికమ్ సంస్థలు కాల్ ఛార్జీలు పెంచుతాయని తెలుస్తోంది. నిర్వహణ ఖర్చులు చూపి పెంచడం అనివార్యంగా కనిపిస్తోంది. జియో రిలయన్స్ రంగ ప్రవేశం తరువాత మిగతా టెలికాం రంగ సంస్థలు తమ ఖాతాదారులను కోల్పోకూడదనే ఉద్దేశంతో ఇన్ని రోజులు అడపాదడపా ఆఫర్లు ఇస్తూనే ఉన్నాయి. కానీ ఇక మీదట అలా కుదిరే అవకాశం కనిపించట్లేదని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ మార్కెట్లోకి వచ్చిన తర్వాత రేట్లు పెరగడం ఇదే మొదటిసారిగా అయ్యే అవకాశంగా కనిపిస్తుంది. ఈ సందర్భంగా వొడాఫోన్ ఐడియా విలీనం తర్వాత పరిస్థితి మారింది. రేట్లు పెంచడంలో ఎటువంటి మొహమాటం లేదని అంటున్నారు. అందుకే ఈ సంవత్సారంతంలో టాక్ టైమ్ ధరల్ని పెంచే ప్రయత్నం చేస్తామని అన్నారు. న్యూఇయర్ సందర్భంగా టాక్ టైమ్ ప్లాన్స్ భారీ స్థాయిలో పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎయిర్ టెల్, వొడాఫోన్ ఐడియాలు టాక్ టైమ్ ధరల్ని 15 నుంచి 20 శాతం పెంచేందుకు సిద్ధమైనట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.